thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 232 | కరీంనగర్ గురువారం, 30 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## డార్జిలింగ్‌లో వరుణుడి బీభత్సం

డార్జిలింగ్ : పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల వల్ల డార్జిలింగ్, ఆ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తగా, చాలా చోట్ల పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో డార్జిలింగ్, ఆ జిల్లాలోని మిరీక్ సహా ఇతర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఘటనల్లో పలువురు చిన్నారులు సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు.ఒక్క మిరీక్ ప్రాంతంలోనే 11 మంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రకటించాయి. మిరీక్, సిలిగురి ప్రాంతాలను కలిపే బాలాసోన్ నదిపై దుదియాలో ఉన్న ఓ వంతెన కూలిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా తెగిపోయాయి. కొండచరియలు విరిగి పడడంతో పెద్ద సంఖ్యలో ఇళ్లు ధ్వంసమై చాలా మంది నిరాశ్రయులవ్వగా.. పలువురి ఆచూకీ గల్లంతయింది.




## ఏపీ, తెలంగాణకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు... ఐఎండీ హెచ్చరిక

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు రాబోయే కొన్ని గంటల్లో తక్షణ వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ ప్రకటించింది. రాబోయే ఆరు గంటల్లో ఏపీలో, 24 గంటల్లో తెలంగాణ, విదర్భా, మరాఠవాడాలో తీవ్ర వర్షపాతం వల్ల వరద వచ్చే ఛాన్స్ ఉందనిపేర్కొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, వరద ప్రభావంతో రహదారులపై నీరు వచ్చి చేరవచ్చని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంతమైన యానంతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఈ ముప్పు పొంచి ఉంది. తెలంగాణ రాష్ట్రం: ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్గిరి, పెద్దపల్లి జిల్లా.

**మరాఠవాడా సమీప ప్రాంతాలు:** నాందేడ్, హింగోలి, పర్భణీ.

**విదర్భా ప్రాంతం (మహారాష్ట్ర):** బుల్ఢానా, అకోలా, అమరావతి, వార్ధా, యవత్మాల్, నాగ్పూర్ జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చికలు జారీ అయ్యాయి.

**ప్రజలకు సూచనలు:** వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొదని.. వాగులు, కాల్వలు, చెరువుల దగ్గర తిరగవద్దని ఐఎండీ హెచ్చరించింది. ప్రయాణం ముందు వాతావరణ సమాచారం తెలుసుకోవాలని సూచించింది. రైతులు పంటలు, పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని.. స్థానిక అధికారులు అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని వాతావరణ శాఖ సూచించింది.

**ఎమర్జెన్సీలో..** అత్యవసర పరిస్థితుల్లో ఆయా జిల్లాల డిజాస్టర్ కంట్రోల్ రూమ్, స్థానిక సహాయ కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచనలు చేసింది. ఐఎండీ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి జారీ అయ్యే తాజా సమాచారం తప్పకుండా పాటించాలని భారత వాతవారణ శాఖ పేర్కొంది.




## 'ఎక్స్'లో వల్గర్ కామెంట్స్.. పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు..

హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా తనను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో తనపై అభ్యంతకర పోస్టులు పెట్టి తిడుతున్న కొన్ని ఎక్స్ హ్యాండిల్ ప్రొఫైల్స్‌పై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇటీవల సిటీ సివిల్ కోర్టు తీర్పు ఇచ్చినా.. తనపై ఇంకా వల్గర్ కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు ఫిర్యాదులో దయా చౌదరి అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలపై కూడా తగు చర్యలని తీసుకోవాలని అన్నారు. చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. కొన్ని రోజుల క్రితమే.. తన ఫోటోలను డీప్‌ఫేక్ చేస్తున్నారని చిరంజీవి పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలుగా మార్చి వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో దుండగులు పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్‌గా మారాయి.

విషయం తెలుసుకున్న ఆయన వెంటనే సీపీ వీసీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కోర్టను సైతం ఆశ్రయించటంతో న్యాయస్థానం ఆదేశాలతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తన పేరును దెబ్బతీసేలా డీప్‌ఫేక్ వీడియోలు రూపొందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో కూడా మెగాస్టార్ చిరంజీవి సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.




హైదరాబాద్: మహమ్మద్ అజహరుద్దీన్‌కు మంత్రి పదవి లభించింది. ఎల్లుండి తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.

ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రి వర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది.

# ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి




## మొంథా తుపాన్.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్: మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నందున.. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని.. దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు.. హైదరాబాద్, ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... కలెక్టర్లు ఆయా బృందాలకు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతుల్న, ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.




## భారత్ - చైనా చర్చలు.. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి

ఢిల్లీ: భారత్ – చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పడానికి ఇరు దేశాల మధ్య సైనిక చర్చలు జరిగినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. చుషుల్–మోల్డో సరిహద్దుల్లో ఈనెల 25న భారత్ భూభాగంలో చర్చలు జరిగినట్లు తెలిపింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా.. ఏడు ఘర్షణ పాయింట్ల నుంచి ఇరువైపులా.. సైన్యాన్ని పూర్తిగా తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఐదు పాయింట్ల నుంచి.. పెట్రోలింగ్ పునఃప్రారంభమైందన్నారు. తూర్పు లడఖ్‌లోని సరిహద్దుల్లో ఉద్రిక్తత పూర్తిగా తగ్గిందని విదేశాంగ శాఖ అధికారులు స్పష్టం చేశారు. భారత్– చైనా సరిహద్దు ప్రాంతాల్లో సంయుక్తంగా శాంతిని కాపాడేందుకు అంగీకరించారని విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ చర్చల విషయాన్ని తాజాగా భారత ప్రభుత్వం కూడా ధ్రువీకరించింది. సరిహద్దుల్లో సమస్యల పరిష్కారం, స్థిరీకరణ తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టేందుకు ఇరుదేశాలు అంగీకరించాయని పేర్కొంది. ఈ చర్చలు స్నేహపూర్వక, సంతోషకరమైన వాతావరణంలో జరిగాయని వెల్లడించింది. ఈ సమావేశంలో కార్ప్స్ కమాండర్ స్థాయి అధికారులు, జనరల్ స్థాయి ప్రత్యేక అధికారులు హాజరయ్యారు. 2025 ఆగస్టు 19న జనరల్ స్థాయి ప్రత్యేక అధికారుల 24వ చర్చల తర్వాత పశ్చిమ కమాండ్‌లో జనరల్ లెవల్ మెకానిజం కోసం జరిగిన తొలి భేటీ ఇదే అని విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. 2024 అక్టోబర్‌లో జరిగిన 22వ రౌండ్ కార్ప్స్ కమాండర్ స్థాయి సమావేశం తర్వాత పురోగతిని ఈ సమావేశంలో ఇరుపక్షాలు సమీక్ష జరిపాయని తెలిపారు. గత ఏడాది చర్చల తర్వాత.. ఇప్పటి వరకు సరిహద్దు ప్రాంతాలలో శాంతియుత వాతావరణం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న శాంతిని కొనసాగించేందుకు.. ఏవైనా సమస్యలు వస్తే ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చి పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు భారత్–చైనా విదేశాంగ శాఖలు వెల్లడించాయి.




## నితీషే బీహార్ ముఖ్యమంత్రి - తేల్చేసిన అమిత్‌షా!

పట్నా: రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బిహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఆర్జేడీపై ఆయన వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడు తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని పీఎంను చేయాలనుకుంటున్నారని అమిత్ షా విమర్శించారు. కానీ ఆ రెండు స్థానాలు ఖాళీగా లేవంటూ మహాగఠ్‌బంధన్ పార్టీలను ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి.. రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారని ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్‌షా వ్యాఖ్యానించారు. అలాగే పహల్గాం దాడి గురించి ప్రస్తావించారు. "ఆ ఉగ్రదాడి జరిగిన వెంటనే మోదీ ఆపరేషన్ సిందూర్‌కు ఆదేశాలు ఇచ్చారు" అని గుర్తుచేశారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎన్డీయే, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ అని ఇప్పటికే ప్రకటన రాగా.. ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం స్పష్టత లేదు. దానిపైనే విపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. దాంతో తాము నీతీశ్ నాయకత్వంలో బిహార్ ఎన్నికలకు వెళ్తామని ఇటీవల మోదీ ప్రకటించారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని తాజాగా అమిత్ షా స్పష్టంచేయడంతో ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై ఉన్న సందిగ్ధత వీడిపోయింది

చురకలు






హైదరాబాద్: మొంథా తుపాను ప్రభావంతో హైదరాబాద్ సహా తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, బీఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట్, బాలాపూర్, బడంగ్‌పేట్, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, జవహర్‌నగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, దోమలగూడలో వర్షం కురుస్తోంది. దీంతో రహదారులపైకి నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**ఉప్పునుంతలలో అత్యధికంగా 20.8 సెం.మీ వర్షపాతం...** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో అత్యధికంగా 20.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో 19.7 సెం.మీ, నల్గొండ జిల్లా తెల్దేవరపల్లిలో 18.5 సెం.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్టూర్‌లో 18.3 సెం.మీ, ఐనోలులో 17.8 సెం.మీ, నల్గొండ జిల్లా ఎర్రారంలో 15.1, పోలేపల్లిలో 13.3 సెం.మీ, రంగారెడ్డి జిల్లా వెలిజాలలో 13.9, వనపర్తి జిల్లా రేవల్లిలో 12.6, మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్‌లో 11.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉరువకొండ, కల్వకుర్తి, వెల్దండ, ఆమన్‌గల్, వంగూర్, చారగొండ మండలాల్లో వర్షం కురుస్తోంది. దీంతో మంద వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈక్రమంలో ఎర్రవల్లి–గోకారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బైరాపూర్ వద్ద రోడ్డుపై వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అచ్చంపేట–శ్రీశైలం ప్రధాన రహదారిపై చంద్ర వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బ్రిడ్జిపై నుంచి నీరు వెళ్తోంది. మిడ్జిల్ మండలం కొత్తూరు–వేలుగోముల మధ్య దుందుభి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**పలు జిల్లాలకు వర్షసూచన...** తుపాను ప్రభావంతో నేడు ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కుమురం భీం, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు నల్గొండ, సూర్యాపేట, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.




మొంథా తుపాను ప్రభావంతో హైదరాబాద్‌లో జోరు వాన కురుస్తోంది. పలు చోట్ల రహదారులపై నీరు నిలిచింది. దీంతో హైటెక్ సిటీ, మాదాపూర్, ఐటీ కారిడార్, రాయదుర్గంలో తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. రాయదుర్గంలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి.




హైదరాబాద్, అక్టోబర్ 29: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ప్రచారం ముమ్మరం చేసింది. ఆ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీత విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రచారంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా రంగంలోకి దిగనున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వరుస రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 31 నుంచి నవంబర్ 9 వరకు నియోజకవర్గాన్ని మాజీ మంత్రి చుట్టేయనున్నారు. వరుసగా 10 రోజుల పాటు బైపోల్స్‌లో కేటీఆర్ రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించనున్నారు.

**కేటీఆర్ ప్రచార షెడ్యూల్:** అక్టోబర్ 31న షేక్‌పేట్ నవంబర్ 1న రెహమత్ నగర్ నవంబర్ 2న యూసుఫ్‌గూడ నవంబర్ 3న బోరబండ నవంబర్ 4న సోమాజిగూడ నవంబర్ 5న వెంకట్రావు నగర్, నవంబర్ 6న ఎర్రగడ్డ డివిజన్ నవంబర్ 8న షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, రెహమత్ నగర్ డివిజన్లలో రోడ్ షో నిర్వహించనున్నారు.ల ఇక చివరి రోజు నవంబర్ 9న షేక్‌పేట్ నుంచి బోరబండ వరకు నిర్వహించే బైక్ ర్యాలీతో కేటీఆర్ ప్రచారం ముగియనుంది.

**వరుస సమావేశాలు...** మరోవైపు వరుస సమావేశాలతో కేటీఆర్ ఈరోజు (బుధవారం) బిజీబిజీగా గడుపనున్నారు.

కుల సంఘాలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈరోజు మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం జరుగనుంది. తెలంగాణభవన్‌లో జరుగనున్న ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.




## జలదిగ్బంధంలో గురుకుల పాఠశాల.. తాడు సాయంతో విద్యార్థులు బయటకు

నల్గొండ: మంగళవారం రాత్రి నుంచి తెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి దేవరకొండ మండలం కొమ్మపల్లిలో గురుకుల పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. సమీపంలో వాగు ఉద్ధృతికి ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలోకి భారీగా వరద నీరు చేరింది. స్కూల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలోకి వరద చేరడంతో వారంతా భయాందోళనకు గురై కేకలు వేశారు. సహాయక చర్యలు చేపట్టిన అధికారులు విద్యార్థులను తాడు సాయంతో క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు.

## అలా అయితే కృష్ణా నదిలో క్రికెట్ ఆడుకోవడమే..: కవిత



మహబూబ్ నగర్, అక్టోబర్ 29: భౌగోళిక తెలంగాణ సాధించుకున్నామని.. కానీ సామాజిక తెలంగాణ సాధనలో మాత్రం ఒక అడుగు వెనుకనే ఉన్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జాగృతి జనం బాట పేరిట చేపట్టిన పాదయాత్రలో భాగంగా బుధవారం మహబూబ్ నగర్‌లో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. సామాన్యులకు కనీస వైద్యం అందించ లేని స్దితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు చదువులు వదిలి ఇంటి వద్దే ఉంటున్నారని చెప్పారు. భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం చేసిన ఉద్యమం విజయవంతమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జాగృతి సంస్థ కీలక పాత్ర పోషించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం ఆసుపత్రులు, గురుకులాలను నడిపే స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం లేదని విమర్శించారు. అధికారంలో అందరికీ వాటా దక్కాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ స్థానిక సంస్థ ఎన్నికల్లో వర్తిస్తుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పరిస్థితి తేలడం లేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముస్లిం, లంబాడీలు లేని మొట్టమొదటి కేబినెట్ ఇదంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆత్మగౌరవం కలిగిన అధికారం కావాలని కవిత ఆకాంక్షించారు. అధికారం.. ఆత్మగౌరవం, సామాజిక తెలంగాణ నినాదంతో తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. విప్లవాత్మక చర్యల వల్ల సామాజిక తెలంగాణ సాధ్యమని స్పష్టం చేశారు. వివక్ష లేని సమాజం కోసం సామాజిక తెలంగాణ రావాలన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా?.. బీజేపీలో ఉన్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వెంటనే పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పథకం పనులు ఆలస్యం వల్ల పక్క రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ఆ నీటిని తరలించుకు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్మట్టి ప్రాజెక్ట్ ఎత్తు పెంచితే పాలమూరు జిల్లాలోని కృష్ణానదిలో క్రికెట్ ఆడుకోవల్సిందేనంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ఆల్మట్టి ఎత్తును అడ్డుకునేందుకు ప్రయత్నించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. తేమ ఎంత ఉన్నా.. పత్తి, వడ్లు, ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. అందుకోసం అన్ని రాజకీయ పార్టీల బృందాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. అయితే తనకు బీఆర్ఎస్‌తో సంబంధం లేదని కుండ బద్దలు కొట్టారు.

ఎంబీసీ కులాల స్వశక్తికరణే లక్ష్యంగా తెలంగాణ జాగృతి పనిచేస్తుందని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అక్టోబర్ 26వ తేదీన జనం బాట పేరిట కవిత పాదయాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. 33 జిల్లాల్లోని మొత్తం 119 నియోజకవర్గాల్లో ఈ పాదయాత్ర కొనసాగనుంది. అంతకుముందు గన్ పార్క్‌లోని అమర వీరుల స్తూపానికి కవిత నివాళులర్పించి.. అనంతరం నిజామాబాద్ వెళ్లారు. నిజామాబాద్ నుంచి ఆమె ఈ యాత్రను చేపట్టారు.




## మొంథా తుఫాన్ ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో భారీ వర్షం..

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. నగరంలో కురుస్తున్న వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ.. సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోల్స్ గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. డీప్ మ్యాన్‌హోల్స్ దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్స్ మూతలను తెరవకూడదని అశోక్ రెడ్డి సూచించారు. ఎమర్జెన్సీ కోసం జలమండలి హెల్ప్ లైన్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు. జంట జలాశయాల గేట్లు ఎత్తిన నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నగరంలో గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. వర్షాలతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి.

మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, బీఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట్, బాలాపూర్, బడంగ్‌పేట్, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, జవహర్‌నగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, దోమలగూడలో వర్షం కురుస్తోంది. నగర వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## మొంథా తుఫాను.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సీతక్క



హైదరాబాద్, అక్టోబరు 29 : మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) దిశానిర్దేశం చేశారు. తుఫాను పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అత్యావసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొంథా తుఫానుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సీతక్క ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి సీతక్క మాట్లాడారు. తుఫాను కారణంగా అధికారులు చేపట్టిన చర్యలపై మంత్రి సీతక్క తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు.

రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. పశువుల కాపరులు తమ పశువులని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు మంత్రి సీతక్క. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం అందుతున్న క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు వెంటనే అందించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు.

## నవంబర్ 1 నుంచి కొత్త రూల్స్.. ఇకపై నలుగురికి అవకాశం

కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన బ్యాంకింగ్ సవరణ చట్టం కారణంగా నవంబర్ నెలలో కొన్ని మార్పులు జరుగనున్నాయి. బ్యాంక్ ఖాతా నామినీలకు సంబంధించి కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. అకౌంట్ హోల్డర్ కి ఒక నామినీ మాత్రమే ఉండటం వల్ల ఆ నామినీ అందుబాటులో లేకపోవడం, నగదు క్లెయిమ్ చేసుకోకపోవడంతో ఆ డబ్బు అలాగే ఉండిపోతుంది. ఇలా మన దేశంలోని మన బ్యాంకుల్లో దాదాపు రూ.67,000 కోట్లకు పైగా డబ్బు అలాగే ఉండిపోయింది. దీంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఖాతాదారుడికి ఒక్కరు నామినీ కాకుండా.. నలుగురు నామినీలుగా ఉండేందుకు అవకాశం కల్పించింది. ఈ నామినీలకు ఎవరెవరికి ఎంతెంత శాతం డబ్బు కేటాయించాలనేది అకౌంట్ హోల్డర్ నిర్ణయించుకోవచ్చు. ఖాతాదారుడి నిర్ణయం మేరకు నామినీలకు చివరి మొత్తాన్ని బ్యాంక్ అందజేస్తుంది. ఖాతాదారుడి మరణానంతరం డబ్బు విషయంలో వారసత్వ గొడవలు, చట్టపరమైన సమస్యలు నివారించడానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రూల్ నవంబర్ 1 నుంచి అమలులోకి రానుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డులో నవంబర్ 1 నుంచి స్వల్ప మార్పులు చోటుచేసుకోనున్నాయి. యాప్ వాలెట్ లోడింగ్, ఎడ్యుకేషన్ ఫీజు చెల్లింపులకు సంబంధించి కొత్త ఛార్జీలు ప్రవేశబెట్టనున్నారు. క్రెడ్, చెక్, మొబిక్విక్ వంటి థర్డ్ పార్టీ యాప్స్ ఉపయోగించి చేసే ఎడ్యుకేషన్ ఫీజు చెల్లింపులపై ఇకపై 1 శాతం ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల వెబ్‌సైట్లు, పీఓఎస్ మెషీన్ల వద్ద చేసే ట్రాన్సాక్షన్ లకు ఈ ఫీజు వర్తించదు. ఇక వాలెట్‌లో రూ.1000కి మించి చేసే లావాదేవీలకు 1 శాతం ఫీజు ఉండనుంది.



# సజీవ స్వరూపాలు... వడ్డాది పాపయ్య చిత్రాలు

## - అక్టోబర్ 30...వడ్డాది పాపయ్య వర్ధంతి







తెలుగు చిత్రకళా ప్రపంచంలో సాటిలేని ప్రతిభావంతుడు వడ్డాది పాపయ్య. తన అపురూప చిత్రాలతో తెలుగు ప్రజల మనసుల్లో నిలిచిపోయిన సహజ కళాకారుడు అనేక మంది స్ఫూర్తి ప్రదాత. ఆయన చిత్రాలు తెలుగు సాహిత్యం, పౌరాణిక కథానికలు, గ్రామీణ జీవనశైలిని చక్కగా ప్రతిబింబించేలా ఉంటాయి. వడ్డాది పాపయ్య 1921 సెప్టెంబర్ 10న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. తండ్రి రామమూర్తి డ్రాయింగ్ టీచర్ కావడంతో చిన్ననాటి నుంచే చిత్రకళ పట్ల ఆయనకు మక్కువ కలిగింది. పాపయ్య పెరిగిన వాతావరణంలో కుంచెలు, రంగులతో కలిసిపోయే కళాజీవితం ఉన్నది. ఇది ఆయనలోని సృజనాత్మకతను పెంచింది. పాపయ్య చిన్నప్పటినుంచి చిత్రకళ పట్ల ఆసక్తి చూపిస్తూ, వివిధ రూపాల్లో తన శైలిని అభివృద్ధి చేసుకున్నారు. చిన్ననాటి నుంచే గ్రామీణ జీవితం, ప్రకృతి దృశ్యాలు ఆయన చిత్రాలకు ప్రేరణగా నిలిచాయి. రాజా రవివర్మ, దామెర్ల రామారావు ల చిత్రకళా తపస్సును ఆదర్శంగా ఎంచుకున్న పాపయ్య, అడవి బాపిరాజు నుంచి గొప్ప భావుకతను అంది పుచ్చుకున్నారు. వడ్డాది పాపయ్య చిత్రకళలో ఒక కొత్త శైలికి నాంది పలికారు. ఆయన చిత్రం ప్రతి చిన్న విషయాన్ని స్వచ్ఛమైన, సహజమైన రూపంలో తీసుకు వస్తుంది. ఆయా చిత్రాలలో ప్రతీ రేఖ, ప్రతి రంగు చిత్రాన్ని మరింత ముద్రించే విధంగా ఉంటుంది. ఆయన చరిత్ర, పురాణ కథలు, సామాజిక అంశాలను అద్భుతంగా చిత్రించడంలో దిట్ట. వడ్డాది పాపయ్య రచించిన చిత్రాలలో రామాయణం, పంచతంత్రం, మహాభారతం వంటి పురాణ ఇతిహాసాలకు సంబంధించిన కథానికలు ముఖ్యంగా నిలిచాయి. ఎగురుతున్న హనుమంతుడు, గోపికాకృష్ణుల రాసలీల, పార్వతి, శకుంతల, లక్ష్మి, ధనలక్ష్మి, శివపార్వతులు, గంగావతరణం మొదలైన పౌరాణిక ఊహాత్మక బొమ్మలను గీచారు. ఆయన చిత్రాలు తెలుగు సాహిత్యానికి ఒక సజీవ రూపాన్ని సంతరింప చేశాయి. ప్రత్యేకించి పంచతంత్రం చిత్రాలు, పిల్లల హృదయాలను ఆకర్షించే విధంగా ఉంటాయి. పాపయ్య పురాణ గాథలను చిత్రించిన విధానం ద్వారా కథలు కళాత్మకంగా జీవింప జేయబడ్డాయి. వడ్డాది పాపయ్య చిత్రాలు చూడగానే ఆకర్షిస్తాయి. ఆయన చిత్రాలలోని రంగుల వాడకం, కాంతి-చాయా ప్రభావాలు చూపించే సామర్థ్యం అత్యద్భుతంగా ఉంటాయి. ప్రత్యేకంగా గ్రామీణ దృశ్యాల చిత్రణలో ఆయన చూపిన శైలి చక్కని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి వ్యక్తి ముఖాల్లో భావాలను ప్రతిబింబించడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం, ప్రతి దృశ్యాన్ని సహజంగా చిత్రించడంలో ప్రతిఫలిస్తుంది. చిత్రకారుడిగా మాత్రమే కాకుండా, పాపయ్య పత్రికా రంగంలో కూడా తన ప్రతిభను చాటారు. తెలుగు పత్రికలు, మాసపత్రికలు ఆయన చిత్రాలతో అలంకరించ బడ్డాయి. ఈ పత్రికా బొమ్మలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన వాటిని తీర్చిదిద్దారు. పత్రికల్లోని ఆయన బొమ్మలు, ప్రత్యేకించి పౌరాణిక పాత్రలు, సాంప్రదాయ వస్త్రధారణ, ప్రాచీన జీవనశైలికి ఆయన విన్నూత్న రూపాన్ని అందించారు. రేరాణి, అభిసారిక, భారతి పత్రికలలో ప్రచురితమైన బొమ్మలలో ఒక సంచలన చిత్రకారుడుగా పత్రికా ప్రపంచానికి చేరువయ్యారు. తత్ఫలితంగా తెలుగు సినీ ప్రముఖుడు చక్రపాణి తమ సంస్థ ప్రచురణలైన చందమామ, యువ పత్రికలలో బొమ్మలు వేసే ఉద్యోగం ఇచ్చారు. ఒక్క "చందమామ" పత్రికలోనే దాదాపు మూడు దశాబ్దాల పర్యంతం తన సహజ శైలిలో బొమ్మలు చిత్రిస్తూ, ఒకే పత్రికలో కొనసాగటం తెలుగు పత్రికా రంగంలో ఒక పెద్ద రికార్డు. వడ్డాది పాపయ్య సాధారణంగా సరళమైన వ్యక్తిగా, స్నేహపూర్వక స్వభావంతో కళాభిమానులతో మెలిగేవారు. సరళమైన జీవిత శైలిని అనుసరించిన పాపయ్య, కళాభిమానులతో గడపడంలో ప్రత్యేక ఆనందం పొందేవారు. వడ్డాది పాపయ్యకు తెలుగు చిత్రకళాభిమానుల నుండి ఎల్లప్పుడూ ప్రశంసలు అందాయి. అతని చిత్రాలలో భావాలను స్పష్టంగా చూపించడం, ప్రతి చిన్న విషయాన్ని చిత్రంలో ప్రతిబింబించడంలో ఆయన ప్రతిభ అనన్యమైనది.

అయితే కొందరు విమర్శకులు ఆయన చిత్రాల్లో మరింత లోతు ఉండాలని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, పాపయ్య దశాబ్దాలుగా చిత్రకళా రంగానికి అందించిన సాయానికి ప్రజలు ఎల్లప్పుడూ ఆయనను ప్రశంసిస్తూనే ఉంటారు.

వడ్డాది పాపయ్య సృజనాత్మకతను ప్రతిబింబించే అనేక చిత్రాలు ఆయన కుంచె నుంచి వెలువడినవి. ఈ చిత్రాలు అందరికీ కళా సౌందర్యాన్ని అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళలో ఒక అద్భుతమైన స్ఫూర్తి. ఆయన చిత్రాలు ఎల్లప్పుడూ కళాభిమానులకు స్ఫూర్తిగా నిలుస్తూ, తెలుగు చిత్రకళా రంగానికి సజీవ స్వరూపంగా నిలిచాయి

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440585494**

# ధర్మ సంస్థాపనకై శ్రమించిన తాపసి దయానంద సరస్వతి

## అక్టోబర్ 30... దయానంద సరస్వతి వర్ధంతి



నవీన భారతదేశ సంస్కర్తలలో అగ్రగణ్యుడు దయానంద స్వరాజ్ నినాదాన్ని తొలిసారి నినదించి భారతీయుల మనసులలో చొప్పించిన దేశభక్తులు దయానంద సరస్వతి జయంతి. స్వామి దయానంద సరస్వతి (ఫిబ్రవరి 12, 1824 - అక్టోబర్ 30, 1883) ఆర్య సమాజ్ స్థాపకుడు, అజానాంధకారం, దారిద్ర్యం, అన్యాయన్ని ఎదురించి పోరాడిన ముని. హిందు ధర్మ సంస్థాపనకు నడుం బిగించిన ఋషి. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి, ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణ అయిన దేశ భక్తులు. భారతదేశం భారతీయులకే అనే "స్వరాజ్" నినాదాన్ని మొదటి సారిగా ప్రవచించినది ఆయనే. వేదాలను అంత చక్కగా అధ్యయనం చేసిన వారు భారత దేశంలో మరొకరు లేరు అని ఈయన గురించి స్వయంగా అరవిందుల వారే అన్నారు. దయానంద సరస్వతి ఫిబ్రవరి 12, 1824లో గుజరాత్ లోని ఠంకార అనే గ్రామంలో ఒక వర్తక కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు మూలశంకర్. ఆయన తండ్రి ఒక మహా శివ భక్తుడు. పద్నాలుగేళ్ల ప్రాయంలో ఒక శివరాత్రి నాడు శివలింగంపై విసర్జిస్తున్న మూషికాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి 1846లో భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లారు. ఆ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందారు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథురలోని స్వామి విరజానంద సరస్వతి వద్దకు చేరుకున్నారు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలు దేరారు. ఆయన తన వాదనలను, ఉద్యమాన్ని సమర్థిస్తూ అథర్వణ, యజుర్వేదం వంటివి భాష్యం చేసిన వేద భాష్యకారుడైనారు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నారు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది. ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన భారతదేశం ఆ సమయం లో అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులి డుతుండడం చూసి శోకించారు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములగు చుండడాన్ని చూసి చలించి పోయారు. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసి ఆవేదనకు గుర్తై, వాటిని ఛేదించడానికి 'పాఖండ ఖండిని ' అన్న పతాకాన్ని ఆవిష్కరించారు. భారత దేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించారు. స్త్రీ విద్య పరిచయం చేసారు. ధర్మ సంస్థాపనకు శాశ్వత సంస్థగా, దేశ సంఘ సంస్కరణకు పునాదిగా, 10 ఏప్రిల్ 1875 న ముంబాయి నగరంలో మొదటి ఆర్యసమాజము స్థాపించారు. మేడంకామా, గురుదత్ విద్యార్థి, వినాయక్ దామోదర్ సావర్కార్, లాలా హర్‌దయాళ్, మదన్‌లాల్ ధింగ్రా, రాంప్రసాద్ బిస్మల్, మాహాదేవ గోవిందరనడే, స్వామి శ్రద్ధానంద, మహాత్మా హంసరాజ్, లాలా లజపతిరాయ్ తదితరులు ఆయనచే ప్రభావితు లైనారు. ఆయన రచించిన సత్యార్థ ప్రకాష్ గ్రంథం సుప్రసిద్ధమైనది. మత మార్పిడిలు చేసిన వారిని తిరిగి హిందూ మతంలోకి రప్పించడానికి శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో దయానంద సరస్వతి పెక్కుమందికి కంట్లో నలుసు అయినారు. ఏడు సార్లు విష ప్రయోగాలు జరిగిననూ బస్తి, న్యోలి అనే యోగ ప్రక్రియ ద్వారా ప్రేగులను ప్రక్షాళనము చేసుకుని వాటిని విఫలము చేసినను, చివరి సారిగా అక్టోబర్ 30, 1883 దీపావళి సాయంత్రము జరిగిన విష ప్రయోగంతో క్షీణిస్తూ ఓంకార నాదంతో సమాధి అవస్థలో మోక్షాన్ని పొందారు. 30 అక్టోబరు, 1883న దయానంద సరస్వతి మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440585494**

# బంగారం ధరలపై బాబా వంగా ప్రిడిక్షన్.. భవిష్యత్తులో?







బంగారం.. బంగారం.. సామాన్య ప్రజలను మొదలు కొని ప్రపంచ దేశాల వరకు ప్రతి ఒక్కరూ చర్చిస్తున్న ఏకైక అంశం.. ప్రస్తుతం ఎవరు చూసినా సరే బంగారు కొనుగోలు చే యాలని ఆశపడుతున్నా.. ధరల కారణంగా వెనకడుగు వేస్తు న్నారు. అటు సామాన్యులు ఎప్పుడో బంగారం కొనడం మానేశారు కానీ ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది. తప్పని పరిస్థితుల్లో ఉన్న బంగారాన్ని మార్పించి కొత్త బంగారు నగలు చేయిస్తూ తమ పిల్లలకు వివాహాలు చేస్తున్నారు తల్లిదండ్రులు. ఇంకొంతమంది అప్పుచేసి మరీ బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇ లాంటి సమయంలో బాబా వంగ జ్యోతిష్యం అందరిని ఆశ్చర్యప రుస్తోంది. అసలు 2026లో ఏం జరగబోతోంది ? బంగారం ధరలలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయి ? బాబా వంగా చెప్పిన జ్యోతిష్యం ఏంటి? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం. అసలు విషయంలోకి వెళ్తే.. భవిష్యత్తును ఊహించి చెప్పే బాబా వంగాకి ప్రాముఖ్యత ఎంత ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జరిగే విషయాలను ముందే ఊహించి చెబుతుం ది. అలా ఇప్పుడు బంగారంపై కూడా ఆమె తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. 2026లో ప్రపంచ మార్కెట్ అంతా బంగారం పైన ఆధారపడి ఉంటుందని, బంగారం ఉన్నవారు కోటీశ్వరులే అంటూ కూడా వివరించింది. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా బంగారం ధర భారీగా పెరిగే అవకాశం ఉందని బల్గేరియాకు చెందిన బాబా వంగా తెలిపారు. ఆమె చెబుతున్న జోష్యం ప్రకారం చూసుకుంటే.. ప్రపంచం మార్కెట్ లలో అస్థిరత వల్ల అది ఆర్థిక మాన్యానికి దారి తీయవచ్చు అని ఆమె తెలిపారు. ఒకవేళ ఆమె చెప్పిన జోష్యం నిజమైతే బంగారం ఇంట్లో ముందుగానే కొని పెట్టుకున్న వారు కోటీశ్వరులతో సమానమని చెబుతున్నారు. ఏది ఏమైనా వచ్చే ఏడాది బంగారం ధరలు ఆకాశాన్ని తాకబోతు న్నాయని తెలిసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడితే బంగారంపై ధరలు 25 నుండి 45 శాతం పెరిగే అవకాశం ఉందని, వచ్చే దీపావళి నాటికి ఈ ధరలు మరింత పెరగవచ్చు అని నిపుణులు కూడా చెబుతున్నారు. పైగా వచ్చే ఏడాదికి 1,80,000 వరకు ఈ ధరలు పలికే అవకాశం ఉంటుందని ఒకవేళ ఇది నిజమైతే బంగారం ధరల్లో కొత్త రికార్డు సృష్టించినట్లే అని చెప్పవచ్చు. ఇకపోతే ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయి అనే విషయానికి వస్తే..ఈరోజు హైదరాబాదు బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.820 తగ్గి 1,22,460 కి చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.750 తగ్గి రూ.1,12,250 కి చేరుకుంది. అటు వెండిపై రూ.5000 తగ్గి ఏకంగా కేజీ సిల్వర్ ధర 1,65,000 చేరుకుంది.

# తోడు కోసం పులి తహతహ.. ప్రాణహిత నదిని దాటి, తెలంగాణలోకి అడుగుపెట్టింది

వన్య ప్రాణుల ప్రపంచం ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉ ంటుంది. ముఖ్యంగా పులుల ప్రవర్తనలో కనిపించే సహజ స్వభావం మనిషికి ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఇటీవల అలాంటి సంఘటనే తెలంగాణలో చోటుచేసుకుంది. మహారాష్ట్రకు చెందిన ఓ మగ పులి తోడు కోసం ప్రాణహిత నదిని ఈదుకుంటూ సరిహద్దులు దాటి తెలంగాణలోకి అడుగుపెట్టింది.

**50 కిలో మీటర్ల ప్రయాణం...** ఈ పులి మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా కంహర్గావ్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుంచి బయలుదేరి, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ వరకు చేరింది. దాదాపు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగించింది.

**జత కోసం సాగిన సాహసయాత్ర...** భారతదేశంలో పులుల సంయోగ కాలం ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మగ పులులు తమ పరిధిని దాటి జత కోసం



విస్తారంగా ప్రయాణిస్తాయి. చాలా సందర్భాల్లో అవి అడవి మార్గాల గుండా తమ ప్రయాణాన్ని సాగిస్తాయి.

అయితే, ఈ పులి మాత్రం నడవడం కాదు, ఏకంగా నది మార్గాన్నే ఎంచుకొని ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రాణహిత నదిని దాటి, ఇట్యాఖాల్ పహాడ్ అటవీ ప్రాంతం గుండా తెలంగాణలోకి అడుగుపెట్టింది. ఇది మహారాష్ట్ర రిజర్వ్‌ల నుంచి పులులు తరచుగా వచ్చే ప్రసిద్ధ ప్రవేశ మార్గంగా గుర్తింపు పొందింది.

**పులి కదలికలపై నిఘా...** ఫారెస్ట్ అధికారులు ఆ పులి కదలికలను నిరంతరం గమనిస్తున్నారు. పులులు తరచూ ప్రాణహితను దాటి వస్తుంటాయి. ముఖ్యంగా వసంతకాలం, సంయోగ కాలంలో ఆహారం, నీరు, జత కోసం కొత్త ప్రదేశాలకు వెళ్తాయి. కొంతకాలం ఆ ప్రదేశాల్లో గడిపి, తిరిగి తమ అసలు పరిధికి చేరుతుంటాయి. అయితే ఫారెస్ట్ అధికారులు ఎప్పటికప్పుడు కెమెరా ట్రాప్స్, ట్రాకింగ్ పద్ధతుల ద్వారా ఆ పులి కదలికలను పర్యవేక్షిస్తుంటారు.

**ప్రకృతి సమతౌల్యానికి సంకేతం...** ఈ సంఘటన ప్రకృతి సమతౌల్యాన్ని సూచించే ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. పులులు తమ జాతి కొనసాగింపు కోసం ఎంత దూరమైనా ప్రయాణించగలవని ఇది నిరూపించింది. సంరక్షణ కేంద్రాల మధ్య ఉన్న కారిడార్లు (ప్రాణహిత-కాగజ్‌నగర్ మార్గం వంటి) పులుల సంచారానికి జీవ నాధారం. అలాంటి మార్గాలు భద్రంగా ఉండటం వలన వన్యప్రాణుల సంయోగం, వంశవృద్ధి కొనసాగుతాయి. ప్రేమ కోసం లేదా సహజప్రేరణ కోసం పులి చేసిన ఈ ప్రయాణం కేవలం జంతు ప్రవర్తనగాక, పర్యావరణ పరిరక్షణలోని సున్నితమైన సమతౌల్యాన్ని గుర్తు చేస్తుంది. నదులు, అడవులు, జంతు కారిడార్‌లు అడ్డంకుల్లేకుండా ఉండటం, వన్యప్రాణుల మనుగడకు అవసరం.

# అహో ఒహో ట్రంప్.. పొగడ్తల్లో ఒలింపిక్స్.. షాబాజ్ కు గోల్డ్ మెడల్!

అబ్బో ట్రంప్.. ఆయన అంత గట్టిగా ప్రయత్నం చేయకుంటే రెండేళ్ల పాటు సాగిన ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ఆగేది కాదు.. అహో ట్రంప్.. ఆయన అడ్డుకట్ట వేయబట్టి సరిపోయింది కానీ.. కాంబోడియా-థాయ్ లాండ్ దేశాలు కొట్టుకు చచ్చేవి. ..ఈ మాటలన్నది ఎవరో అమెరికాకు చెందిన విశ్లేషకుడు కాదు.. డొనాల్డ్ ట్రంప్ పార్టీకి చెందిన నాయకుడూ కాదు.. ఈ పొగడ్తలన్‌ఈన పాకిస్థాన్ కు ప్రధానిగా ఉన్న షాబాజ్ షరీఫ్ నోటినుంచి వెలువడిన ఆణిముత్యాలు. అటు ట్రంప్ పాలనలో అమెరికాలో అశాంతి చెలగుతున్నా.. ఇటు షాబాజ్ ప్రభుత్వాన్ని అఫ్ఘానిస్థాన్ తాలిబన్ సర్కారు సవాల్ చేస్తున్నా... ఇంట్లో ఈగల మోత.. బయట పల్లకీ మోత అన్నట్లుగా ఉంది వ్యవహారం. దీంతో షాబాజ్ ను పాకిస్థాన్ కు చెందిన రాజకీయ విశ్లేషకులు ఓ ఆట ఆడుకుంటున్నారు.

**ఒలింపిక్ మెడల్ మావోడికే..** హుస్సేనీ హక్కానీ పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త. తన అంతర్జాతీయ అనుభవం నేపథ్యంలో ఆయన స్పందిస్తూ



ట్రంప్ ను పొగడడంలో ఒలింపిక్స్ పెడితే అందులో తమ ప్రధాని షాబాజ్ కే గోల్డ్ మెడల్ వస్తుందని వెటకారం ఆడారు. పదేపదే ట్రంప్ ను ఆకాశానికి ఎత్తుతున్న వైనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం ముగింపునకు ఈజిప్ట్ లోని షర్మ్-ఎల్-షేక్ లో శాంతి ఒప్పందం జరగ్గా అందులో షాబాజ్ పాల్గొని ట్రంప్ ను గొప్పగా కీర్తించారు. ఈ ఒప్పందం ట్రంప్ గొప్పదనం అంటే సరిపోయేది.. కానీ, అంతకుమించి పొగిడారు.

**భారత్-పాక్ ఘర్షణను ఆపారంట..** ట్రంప్ స్వయంగా జోక్యం చేసుకుని భారత్-పాకిస్థాన్ ఘర్షణను ఆపేశారంటూ షాబాజ్ చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఈ ఘర్షణలో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. కానీ, ట్రంప్ ప్రమేయం ఉందని షాబాజ్ అంటున్నారు. భారత్ మాత్రం ట్రంప్ జోక్యమే లేదని గట్టిగా ఖండిస్తోంది. థాయ్ లాండ్-కాంబోడియా కాల్పుల విరమణనూ ట్రంప్ ఘనతగా షాబాజ్ చెబుతుండడంతో పాక్ కు చెందినవారే హవ్వా ఇదేం చోద్యం అని అంటున్నారు.

**కీలుబొమ్మలా ఎందుకీ పొగడ్తలు..** ట్రంప్ పై షాబాజ్ అంతగా ప్రశంసలు కురిపిస్తుండడంపై పాక్ లోనే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ట్రంప్ చేతిలో కీలుబొమ్మలా మారారని, దేశాన్ని అమ్మేశారని మండిప డుతున్నారు. ట్రంప్ ను ఇంతగా పొగిడే వ్యవహారం అంతా తమకు ఇబ్బందిగా మారిందని పాక్ చరిత్రకారుడు అమర్ అలీ జాన్ తప్పుబట్టారు.

చురకలు
సంపాదకీయం

## బంగ్లా చేసిన పిచ్చి పని...భారత్ ఆగ్రహం

భారతదేశం ఎంతో సహన వంతమైన దేశంగా చెప్పుకుంటారు. అందరూ బాగుండాలి అందులో తాను ఉండాలని నమ్మే దేశంగా ప్రపంచంలో పేరుంది. విశ్వానికి మిత్రుడు అన్న పదం ఒక్క భారత్ కే సరిపోతుంది. శతృవు అన్న మాట భారత్ వైపు నుంచి ఉండదు, తమ జోలికి ఎవరైనా వస్తేనే మూడో కన్ను తెరుస్తుంది. పాక్ దాయాదిగా ఉంటూ శతృవుగా మారినా కూడా భారత్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. మారాలని కోరింది అయినా వినిపించుకోక తన బుద్ధి చూపించుకోగ్వడంతోనే ఆపరేషన్ సింధూర్ లాంటి గట్టి ప్రయోగం చేయాల్సి వచ్చింది. అలాగే సింధు జలాలను నిలుపు చేసి పాక్ గొంతు ఎండబెట్టాల్సి వచ్చింది.


**ఊపిరి పోసిన చోట :** ఇక మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గురించి చెప్పాలంటే ఆ దేశం ప్రతీ రోజూ భారత్ పేరు తలచుకోవాల్సిందే అని అంటారు. ఒక్కసారి చరిత్ర పుటల్లోకి వెళ్తే కనుక పాక్ కబంధ హస్తాల నుంచి తూర్పు పాకిస్తాన్ ని కాపాడి ఒక ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేసిన మంచితనం భారత్ ది అని చెబుతారు. తూర్పు పాకిస్తాన్ ని అలా కనుక వదిలేసి ఉంటే ఈ రోజున బెలూచిస్తాన్ మాదిరిగా అన్ని విధాలుగా అణచివేతకు గురి అయి పాక్ చేతిలో హింస పడుతూ దిన దిన గండంగా ఉండేది. అంతకు ముందు కూడా మొదటి మూడు దశాబ్దాల పాటు అలాగే తూర్పు పాకిస్తాన్ హింసకు గురి అయింది భారత్ ని శరణు కోరడంతో న్యాయ సమ్మతంగా అది ఉండడంతో భారత్ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో పాక్ తో యుద్ధం చేసి 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి నాంది పలికింది. ఒక కొత్త దేశం ప్రపంచ పటం మీద ఊపిరి పోసుకోవడానికి దోహదదం అయింది. అంతటితో ఊరుకోలేదు నిన్నా మొన్నటి వరకూ ఆర్థికంగా అన్ని విధాలుగా బంగ్లాదేశ్ ని ఆదుకుంటూనే వచ్చింది. కానీ గత ఏడాదిన్నరగా మారిన పరిణామాలతో బంగ్లాదేశ్ భారత్ కి శతవుగా మారిపోయింది.

**విషం చిమ్ముతూ :** తన ఒకనాటి శత్రువు అయిన పాక్ తో చేతులు కలిపి భారత్ మీద విషం చిమ్మడంతో పోటీ పడుతోంది బంగ్లాదేశ్. ఆ దేశం తాజాగా చేసిన పిచ్చి పనికి భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పాక్ కి టెంపరరీగా ఒక ప్రధాని ఉన్నారు. ఆయనే మహమ్మద్ యూనస్. ఆయన భారత్ మీద అదే పనిగా తన వ్యతిరేకతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా ఈ పెద్ద మనిషి ఇంకో సారి భారత్ పై తనకు ఉన్న అసూయను వ్యతిరేకతను చాటుకున్నారు. భారత్ కు చెందిన కీలకమైన భూభాగాలను బంగ్లాదేశ్ దేశం మ్యాప్ లో ఆయన చూపించారు. ఇది ఒక విధంగా బరితెగింపు అని చెప్పాల్సి ఉంటుంది. అంతే కాదు చాలా గొప్పగా దానిని పాక్ నేస్తాలకు బహూకరించారు.

**పెడ ధోరణికి :** ఇదంతా బంగ్లాదేశ్ పెడ ధోరణికి నిదర్శనం అని అంటున్నారు తమది కానిది తమకు చెందనిది అయిన భూములను ప్రాంతాలను ఎలా కలుపుకుంటారు అని భారత్ లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇది దిగజారుడు తనం చౌకబారుతనం బరితెగింపు అని అంటున్నారు. ఈ విధంగా తయారు చేసిన మ్యాప్ ని ఆయన పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు ఇవ్వడం మరో రకమైన పైత్యానికి నిదర్శనంగా చూస్తున్నారు. ఇక బంగ్లా ఈ విధంగా రూపొందించిన మ్యాప్ లో చూస్తే భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు అన్నీ ఉండడం గమనార్హం. వాటిని తమ సొంతంగా సొత్తుగా బంగ్లా తాత్కాలిక పాలకుడు చూపించుకుంటూ మురిసిపోవడం కంటే తెంపరితనం వేరొకటి ఉండదని అంటున్నారు

**బంగ్లాకు తగిన గుణపాఠం :** ఈ మధ్యనే పాకిస్థాన్ కు చెందిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాప్ కమిటీ ఛైర్ పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా బంగ్లాదేశ్ లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగానే ఆయనకు ఈ తాత్కాలిక ప్రధాని అయిన యూనస్ మహాశయుడు ఒక బుక్ ని ప్రజెంట్ చేశారు. ఆ బుక్ కి వేసిన కవర్ పేజి చిత్రంలో భారత్ లోని భూభాగాలను కలుపుకుంటూ ఉన్న మ్యాప్ లో ఉంది. భారత్ లో ఈశాన్యంలో ఏకంగా ఏడు రాష్ట్రాలు మావే అంటూ చేసిన ఈ మ్యాప్ ప్రదర్శన బంగ్లా బుద్దిని బయట పెట్టింది. అంతే కాదు పిచ్చి తనాన్ని బయటపెట్టింది అని అంటున్నారు. దీని మీద మొత్తం భారతదేశం ఆగ్రహంగా ఉంది. సమయం చూసి భారత్ బంగ్లాకు తగిన గుణపాఠం చెప్పాలని అంతా కోరుకుంటున్నారు.

## ధర్మపురి అధ్యాపకుడికి అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం ౹ తెలుగు సాహిత్యానికి గౌరవం




జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రాంత పవిత్ర భూమి కేవలం ఆధ్యాత్మికతకే కాదు, విద్యా, సాహిత్య స్ఫూర్తికీ నిలయంగా ఉంది. ఆ నేలలో పుట్టిన ప్రతిభావంతుడైన డా. ఓర్సు రాయలింగు జాతీయ స్థాయిలో విశిష్టమైన గౌరవం అందుకోవడం తెలంగాణ ప్రాంతానికి గర్వకారణం. తెలుగు భాష, సాహిత్యం, విద్యా రంగం, సృజనాత్మకత వంటి విభిన్న రంగాల్లో తన మేధస్సు, కృషి, అంకితభావం ప్రదర్శించినందుకు గాను ఆయనకు డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం 2025 లభించడం విశేషం. ఈ పురస్కారం ఆయన సాహిత్య, విద్యా సేవలకు వచ్చిన సరైన గుర్తింపు మాత్రమే కాదు, తెలంగాణ విద్యావేత్తల కీర్తి ప్రతిష్ఠలను మరింత ఎత్తుకు చేర్చిన ఘట్టంగా నిలిచింది. తెలుగు భాషా బోధకుడిగా ఆయన పెద్దపల్లి జిల్లా మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ అధ్యాపకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు సృజనాత్మక కవిగా, పరిశోధనాత్మక రచయితగా, సమాజం పట్ల బాధ్యత కలిగిన విద్యావేత్తగా విస్తరించింది. బోధనలో చిత్తశుద్ధి, సాహిత్యంలో సృజనాత్మకత, సమాజం పట్ల సానుభూతి౹ ఈ మూడు విలువలను సమన్వయ పరుచుకున్న ఆయన వ్యక్తిత్వం విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచింది. తెలుగు భాషను కేవలం పాఠ్యాంశంగా కాక, జీవన విలువల సాధనంగా చూడడం ఆయన విద్యా తత్వం. తరగతి గదిలో విద్యార్థులకు వ్యాకరణం, వ్యాసరచన నేర్పుతూనే సాహిత్య రసానుభూతిని జోడించి భాషను జీవమంతం గావిస్తున్నారు. విద్యారంగంలో తన కృషితో విద్యార్థుల్లో పఠనాభిరుచి, రచనా సామర్థ్యం, విలువల అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. సాహిత్య రంగంలో కూడా డా. రాయలింగు ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన కవిత్వం సామాజిక స్పృహతో నిండినది. పల్లె మనుషుల భావజాలం, భాషా నైజం, విద్యా వాస్తవాలు ఆయన కవితల్లో ప్రతిఫలిస్తాయి. గీతం, వ్యాసం, చిన్న కథ వంటి సాహిత్య రూపాలపై పట్టు సాధించి అనేక రచనలు చేశారు. తెలుగు సాహిత్య సమాజంలో ఆయన కృషి గౌరవంగా గుర్తించబడింది. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం, గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన ఘన కార్యక్రమంలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు ఆయనకు ప్రదానం చేయబడింది. ఈ కార్యక్రమాన్ని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణ్ రావు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా అవార్డు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు, చైర్మన్ డా. పి. నాగయ్య మాట్లాడుతూ౹ "తెలంగాణ రాష్ట్రం నుండి ఈ అవార్డుకు ఎంపికైన తొలి కవి, రచయిత, విద్యారంగ సేవకుడు డా. ఓర్సు రాయలింగు కావడం విశిష్ట ఘట్టం. ఆయన కృషి, ఆలోచనా పటిమ, విద్యా సేవలు అభినందనీయమైనవి" అని పేర్కొన్నారు. డా. రాయలింగు ఈ సందర్భంగా స్పందిస్తూ౹ "భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్త, స్ఫూర్తిదాయక నాయకుడు, ప్రజల మనిషి , రాష్ట్రపతి డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం పేరుతో ఈ జాతీయ ప్రతిభా అవార్డు లభించడం నాకు గౌరవకరం. నా కృషిని గుర్తించిన ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత శక్తి, బాధ్యతను నాపై ఉంచింది. విద్యా సేవే నా జీవన ధ్యేయం. విద్యార్థులలో విలువలు, సృజనాత్మకత, సమాజసేవా చైతన్యం పెంచడమే నా లక్ష్యం" అని చెప్పారు. అయన సహచర అధ్యాపకులు, విద్యావేత్తలు, సాహిత్య మిత్రులు ఈ అవార్డు పట్ల గర్వం వ్యక్తం చేశారు. "తెలుగు విద్యారంగానికి రాయలింగు సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన శ్రమ, తపనకు ఇది సరైన గుర్తింపు" అని పలువురు అభినందించారు. ఇలాంటి ప్రతిభావంతులైన అధ్యాపకులు సమాజానికి నిజమైన మార్గదర్శకులు. విద్యను వృత్తిగా కాక, సేవగా చూసే ఆలోచనతో కృషి చేసే వారు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతారు. రాయలింగు గారి కృషి, అంకితభావం, సాహిత్య పట్ల మక్కువ ఆయనను ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. అబ్దుల్ కలాం లాంటి మహనీయుని పేరు గల పురస్కారం అందుకోవడం ఆయనకే కాకుండా తెలంగాణ విద్యావేత్తలకూ గౌరవ కారణం. ఈ అవార్డు ద్వారా ఆయన కృషి జాతీయ స్థాయిలో ప్రతిధ్వనించింది. విద్యా, సాహిత్య, సామాజిక సేవల సమ్మేళనంగా నిలిచిన డా. ఓర్సు రాయలింగు సాధించిన ఈ గౌరవం, యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తి, విద్యా ప్రపంచానికి ఆత్మ విశ్వాసం. విద్యారూపంలో సేవ, సాహిత్య రూపంలో స్ఫూర్తి, సమాజ రూపంలో మార్పు"౹ ఈ త్రివిధ మార్గంలో అడుగులు వేస్తున్న డా. ఓర్సు రాయలింగు సాధించిన అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం ఆయన కృషికి నిలువుటద్దంగా నిలిచింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**

## కళా తపస్వి శాంతారామ్ - అక్టోబర్ 30... దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత శాంతారామ్ వర్ధంతి

శాంతారాం రాజారాం వణకుద్రే (నవంబరు 18, 1901 – అక్టోబరు 30, 1990) భారత దేశపు చలన చిత్ర రంగంలో చరిత్ర సృష్టించిన అద్భుత చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు వి. శాంతారామ్. ఆయన ఒక కళా తపస్వి. శాంతారామ్ దాదాపు ఏడు దశాబ్దాలుగా చిత్ర నిర్మాతగా వృత్తిని కలిగి చలనచిత్ర మాధ్య మాన్ని సాంఘిక మార్పుకు సాధనంగా వినియోగించు కోవడానికి ప్రయత్నం చేశారు. ప్రారంభ చిత్రనిర్మాతలలో ఆయన ఒక వైపు మానవతా వాదాన్ని సమర్థించడానికి, మరోవైపు మూర?త్వం మరియు అన్యాయాన్ని బహిర్గతం చేయడానికి చిత్రాలను విజయ వంతంగా ఉపయోగించారు. ఆయన "డా.కోట్నిస్ కీ అమర్ కహానీ" (1946), "అమర్ భూపాలి" (1951), "దో ఆంఖె బారహ్ హాథ్" (1957), "నవ రంగ్" (1959), "దునియా నా మానే" (1937),"పింజ్రా" (1972) వంటి చిత్రాల తో అందరికి పరిచితుడు. ఆయన తీసిన చిత్రాలన్నీ ఆణి ముత్యాలే. ప్రతీ చిత్రంలో ఎదో ఒక కళకు ప్రాముఖ్యత ఇచ్చి నిర్మించారు' ఝునక్ ఝునక్ పాయల్ బాజేలో' నృత్యానికి, 'నవరంగ్' లో కవిత్వానికి, 'గీత్ గాయా పత్తరోన్' చిత్రంలో (తెలుగులో 'అమరశిల్పి జక్కన' చిత్రానికి ఆధారం. సాంఘిక చిత్రంగా మలిచారు) శిల్పానికి, ఇలా ఎన్నో కళలని దృశ్య కావ్యాలుగా మనకి అందించారు. వారి చిత్రాలలో పాటలు అమృత గుళికలు. 'జల్ బిన్ మచిలీ' చిత్రంలో ఒక పాము డాన్స్ చాలా అద్భుతం గా ఉంటుంది. అది మన తెలుగుచిత్రం 'అగ్నిపూలు' లో జయప్రద చేశారు. అంతే కాదు వారి చిత్రాలు సందేశాత్మకంగా ఉండి ప్రజలని ఆలోచింప జేసేలా ఉంటాయి. ఉదాహర ణకి 'తూఫాన్ అవుర్ దియా' చిత్రంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని నిలబడాలని, 'దో ఆంఖేన్ బారా హాత్' చిత్రంలో మంచితనంతో ఎంత దుర్మార్గులనైనా మార్చ వచ్చునీ, 'సుభా క తారా' చిత్రంలో వితంతు వివాహ సంస్కరణ గురించి చెప్పారు.. ఇలా ఎన్నో అద్భుత చిత్రాలు ఆయన దర్శకత్వంలో వెలువడ్డాయి. డా వి.శాంతారామ్ మహా రాష్ట్ర లోని కొల్హాపూర్‌కు సమీప గ్రామంలో తేదీ–18–11–1901వ సంవ త్సరంలో జన్మించారు. 1921లో నటుడిగా చిత్ర రంగ ప్రవేశం చేసిన ఆయన మూకీ, టాకీలు అన్నీ కలిపి 25 చిత్రాల్లో నటించారు. సుమారు 90 సినిమాలు నిర్మించారు. వీటిలో 55 సినిమాలకు స్వయంగా ఆయనే దర్శకత్వం కూడా వహించారు. కళాత్మక, వ్యాపార దృక్పథాలను మేళ వించిన విలక్షణ దర్శకునిగా పేరుగాంచారు. అమరజ్యోతి, ఆద్మీ, దునియా న మానే, పడోసీ, స్త్రీ, అమర్ భూపాలీ, డా కోట్నిస్ కీ అమర్ కహానీ మొదలగు సినిమాలు శాంతా రామ్ దర్శ కత్వంలో వచ్చిన కొన్ని ఆణి ముత్యాలు. నవరంగ్, గీత్ గాయా పత్థరోంనే, ఝునక్ ఝునక్ పాయల్ బాజే మొ చిత్రాల్లో కళాకారుడి అంతరంగాన్ని, ఆవేదనను ఆవిష్కరించారు. 'శాంతారామ' అనే పేరుతో తన ఆత్మకథను రాసుకున్నారు. చిత్రపరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ... 1985లో కేంద్ర ప్రభుత్వం 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డును బహూకరించింది. ఉత్తమ దర్శకుడికి ఫిల్మ్‌ఫేర్ అవార్డు (1957)బీ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుబీ పద్మ విభూషణ్‌బీ నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందిన ఆయన అక్టోబరు 30, 1990 వ సంవత్సరంలో మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440585494**

## భారతదేశ అణు శక్తి పితామహుడు హెూమీ జహంగీర్ భాభా - అక్టోబర్ 30... హెచ్ జె భాభా జయంతి

హెూమీ జహంగీర్ భాభా భారతదేశ అణు శక్తి రంగానికి పునాది వేసిన గొప్ప శాస్త్రవేత్త. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, అణుశక్తిని శాంతియుత విధానాల్లో వాడేలా మార్గదర్శకత్వం చేసిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాడు. ఆయన భారత దేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించ బడ్డాడు. హెూమీ భాభా 1909 అక్టోబరు 30 న బొంబాయి లోని (ముంబై) సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచే ఆయనకు చదువు, శాస్త్రాల మీద ఆసక్తి ఉండేది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఆయన చదువులో ప్రతిభ చూపాడు. హెూమీ భాభా తన ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాల యానికి వెళ్లాడు. అక్కడ రాథర్‌ఫోర్డ్ లేబొరేటరీలో శాస్త్రవేత్తలతో కలిసి కేంద్రక భౌతిక శాస్త్రం రంగంలో తన పరిశోధనలను ప్రారంభిం చాడు. కేంబ్రిడ్జ్‌లో ఉన్నత స్థాయి విద్యను పొందిన తరువాత, ఆయన పరిశోధనల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, భాభా అమెరికాలోని మాంహట్టన్ ప్రాజెక్ట్‌లో కూడా పాల్గొన్నాడు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచపు మొట్టమొదటి అణుబాంబు అభివృద్ధికి సంబంధించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆయనకు అణు శక్తి రంగంలో ఉన్న విస్తృత అవకాశాలపై అవగాహన పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత భాభా భారత దేశానికి తిరిగి వచ్చాడు. దేశానికి సేవ చేయాలనే తపనతో, భారత దేశంలో శాస్త్రీయ పరిశోధనలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో ముందుకు సాగాడు. దేశంలో సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం భాభా తాటా ట్రస్ట్ సహకారంతో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ను 1945లో స్థాపించాడు. TIFR భారతదేశంలో ప్రాథమిక శాస్త్ర, భౌతిక శాస్త్ర, అంతరిక్ష పరిశోధనలు మొదలైన రంగాల్లో ముఖ్య భూమికను పోషించింది. 1948లో భారత దేశం అణు శక్తి రంగంలో ముందుండాలని భావించి అణుశక్తి కమిషన్ను స్థాపించాడు. ఈ కమిషన్ ద్వారా అణుశక్తి పరిశోధనలకు బలమైన పునాది వేసి, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి వినియోగం ఎలా ఉండాలో ప్రణాళికలు రూపొందించాడు. ఆయన అణుశక్తిని విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, వ్యవ సాయం వంటి రంగాల్లో వినియోగించడానికి మార్గదర్శకత్వం అందించాడు. 1954లో, ముంబై సమీపంలోని ట్రాంబేలో భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌ను స్థాపించాడు. ఈ సంస్థ అణుశక్తి పరిశోధనలకు కేంద్రంగా మారింది. %దీూ=జ% ద్వారా స్వదేశీ అణు శక్తి పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఆయా విధానాలను అనుసరించి, అణు శక్తిని విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించే విధంగా ప్రణాళికలు రూపొందించాడు. భాభా అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిని కోరుకున్నాడు. ఆయన ప్రణాళికలు భారతదేశం అణుబాంబును అభివృద్ధి చేయడానికి బాటలు వేశాయి. భారత దేశానికి అత్యవసర సమయంలో సైనిక శక్తిని ప్రదర్శించడానికి అణు శక్తి అవసరమని, అలాగే దీన్ని శాంతియుత కార్యక్రమాల్లో కూడా ఉపయోగించవచ్చని ఆయన భావించాడు. భారత దేశానికి అణు శక్తి రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. ఇది భారత శాస్త్రజ్ఞులకు ఆయన అందించిన ప్రేరణకు గుర్తింపు లాంటిది. భారతదేశపు అణు శక్తి కార్యక్రమానికి చేసిన కృషిని గుర్తిస్తూ, ఆయనను భారతదేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించారు. ఆయన నిరంతరం శాస్త్రీయ అభివృద్ధి కోసం ప్రయత్నించి, దేశానికి శక్తి స్వావలంబనను అందించే ప్రయత్నం చేశారు. భాభా స్థాపించిన %ు×ఖీ=% మరియు %దీూ=జ% సంస్థలు ఇప్పటికీ భారతదేశంలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఆయన అభిప్రాయాలే దేశానికి శక్తి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థితిని తెచ్చాయి. భారతదేశం అణు శక్తి రంగంలో ప్రగతిని సాధించడానికి ఆయన చూపిన మార్గం నేటి వరకు మార్గదర్శకంగా నిలిచింది. హెూమీ జహంగీర్ భాభా భారతదేశంలో అణు శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. ఆయన దృష్టి, పట్టుదల, మరియు శాస్త్రీయ దార్శనికత భారతదేశాన్ని అణు శక్తి రంగంలో ప్రపంచ పటంలో నిలిపింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440585494**

## ఆర్థిక వ్యవస్థకు పునాది పొదుపు - అక్టోబర్ 30.. ప్రపంచ పొదుపు దినోత్సవం




ప్రపంచ పొదుపు దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 30న నిర్వహిస్తారు. సామాన్య పౌరులకి పొదుపు ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించడం కోసం ఈ దినోత్సవం జరుపు కుంటారు. స్పెయిన్లో 1921 లో మొదటి జాతీయ పొదుపు దినోత్సవం జరుపు కున్నారు. 1924లో ఇటలీలోని మిలన్ నగరంలో జరిగిన మొదటి అంతర్జాతీయ పొదుపు సమావేశంలో అక్టోబర్ 30ని ప్రపంచ పొదుపు దినోత్సవంగా ప్రకటించింది. ఇటాలియన్ ప్రొఫెసర్ ఫిలిప్పో రవిజ్జా ఈ రోజును "అంతర్జాతీయ పొదుపు దినం" గా ప్రకటించారు. 'ప్రపంచ పొదుపు దినం' అని కూడా పిలుస్తారు. పొదుపు కాంగ్రెస్ యొక్క తీర్మానాల్లో, 'ప్రపంచ పొదుపు దినం' ప్రపంచ వ్యాప్తంగా పొదుపుల ప్రోత్సాహానికి అంకితమైన రోజుగా నిర్ణయించ బడింది. ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పొదుపు ప్రోత్సహించడానికి ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ప్రపంచ వ్యాప్తంగా వున్న బ్యాంక్యులన్ని ప్రపంచ పొదుపు దినోత్సవంను జరుపు కోవడం ప్రారంభించాయి. ప్రస్తుతం ప్రపంచమంతా 'ఇంటర్నేషనల్ సేవింగ్స్ బ్యాంక్స్ ఇన్‌స్టిట్యూట్' కి చెందిన 940 సేవింగ్స్ బ్యాంక్స్ క్రియాశీలకంగా, నిర్మాణాత్మకంగా పని చేస్తున్నాయి. భారత దేశం లోనూ అక్టోబర్ 30న ఈ పొదుపు దినోత్సవం జరుపు కుంటారు. పొదుపు స్త్రీ, పురుషులు అనే భేదం లేకుండా చిన్న పెద్ద ప్రతి ఒక్కరూ పొదుపు చేయడానికి అర్హులే. అయితే పొదుపు అనేది అన్ని విషయాలకు వర్తిస్తుంది. విద్యుత్, నీటిని, ఆహారాన్ని, అనవసరంగా వృధా చేయకుండా పొదుపు చేసే ఉద్దేశంతో ఈ దినోత్సవం ప్రారంభించారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, ప్రపంచ పొదుపు దినం 1955 మరియు 1970 మధ్య సంవత్సరాలలో దాని ప్రజాదరణ యొక్క గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇది ఆచరణాత్మకంగా కొన్ని దేశాలలో నిజమైన సంప్రదాయంగా మారింది. మన పెద్దలు నిరంతరం మనం సంపాదించే దానికంటే తక్కువ ఖర్చు చేసి భవిష్యత్తులో ఉపయోగం కోసం కొంత భాగాన్ని ఆదా చేసుకోవాలని చెబుతారు. వారు మన ఆదాయానికి అనుగుణంగా డబ్బు ఖర్చు చేయమని కూడా బోధిస్తారు మరియు మా ఖర్చులు మన ఆదాయానికి మించ కూడదు. పొదుపు విజయానికి మార్గం. ఆదా చేసిన డబ్బు ఏదైనా అత్యవసర వైద్య పరిస్థితి వంటి కఠినమైన సమయాల్లో ఉపయోగించ బడుతుంది. పెట్టుబడి ద్వారా ఎక్కువ డబ్బును సృష్టించడానికి కూడా దీనిని ఉపయోగించవచ్చు. ఈ రోజు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలు, ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని జరుపు కుంటాయి, గృహాలకు మరియు దేశ ఆర్థిక వ్యవస్థకు పొదుపు యొక్క ప్రాముఖ్యతపై ప్రజల అవగాహన పెరుగుతుంది. వారు పొదుపు ఎందుకు ముఖ్యం, ప్రపంచ పొదుపు దినోత్సవం చరిత్ర, జాతీయ ఆర్థిక వ్యవస్థలో పొదుపు పాత్ర మరియు ప్రతి డిపాజిటర్ దాని అభివృద్ధికి ఎలా దోహదపడుతుంది వంటి అంశాలను హైలైట్ చేసే ఉపన్యాసాలు నిర్వహిస్తారు. కుటుంబాలు, పిల్లలు మరియు తద్వారా మొత్తం సమాజాన్ని ఆదా చేయడం మరియు పొదుపు యొక్క ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ఒప్పించడం ఈ దినం లక్ష్యం. పొదుపు అనేక రూపాల్లో చేయవచ్చు. మీ విద్యుత్ మరియు టెలిఫోన్ ఖర్చులను కేంద్రీకరించడం ద్వారా మీరు ప్రారంభించ వచ్చు. విద్యుత్తు విషయంలో ఒకరు అప్రమత్తంగా ఉండి, లైట్లు, ఫ్యాన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఉపయోగించిన వెంటనే ఆపి వేయవచ్చు. అదేవిధంగా టెలిఫోన్ విషయంలో మీరు సరసమైన మోడల్‌ను కొనుగోలు చేయడం ద్వారా మరియు ఫోన్‌లో తక్కువ మాట్లాడటం ద్వారా ఆదా చేయవచ్చు. పొదుపు మీకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, వ్యర్థాలను నివారించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంలో సహాయ పడుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440585494**

# పేరుకు అత్యవసరం.. సేవలు సాధారణం

కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మూడు నెలల కిందట ప్రారంభించిన క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్య సదుపాయాలు లేకపోవడంతో క్షతగాత్రులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనాన్ని ప్రధాన మంత్రి ఆయుష్‌మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మిషన్ (పీఎం ఏబీహెచ్‌ఐఎం)కు సంబంధించిన నిధులు రూ.23.75 కోట్లతో దీనిని నిర్మించారు. ఈ ఏడాది జులై 27న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దీనిని ప్రారంభించారు. ఇప్పటికీ వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులను చివరి క్షణంలో వరంగల్, హైదరాబాద్‌కు వైద్యాధికారులు రెఫర్ చేస్తున్నారు. కొంతమంది చేసేదిలేక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

**ప్రత్యేక వైద్య నిపుణులు కరవు**

చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని చికిత్స అందించడానికి క్రిటికల్ కేర్ యూనిట్‌కు తరలిస్తారు. ప్రమాదం జరిగిన చివరి గంట గోల్డెన్ హవర్‌గా పిలుస్తుంటారు. అయితే ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో క్షతగాత్రులను వైద్యులు వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతు ఉంటాయి. రోజుకు సగటున ఒకటి రెండైనా రోడ్డు ప్రమాద బాధితులను ఇక్కడకు తీసుకొస్తుంటారు.



క్రిటికల్ కేర్ యూనిట్‌లో అనుభవజ్ఞులైన న్యూరోసర్జన్, న్యూరో ఫిజిషియన్, నెఫ్రాలజిస్టు, కార్డియాలజీ వైద్య బృందంతోపాటు ఆర్థోఫెడిక్ సర్జన్, అనస్థిషియా, జనరల్ సర్జన్లు ఉండాలి. అయితే వీరిని రాష్ట్ర ప్రభుత్వం నియమించలేదు. భవనం ఖాళీగా ఉందని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కొందరికి ఇక్కడకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందం లేకపోవడంతో జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందిని మూడు షిప్టులలో అక్కడ, ఇక్కడ సర్దుబాటు చేయడం అధికారులకు ఇబ్బందిగా మారింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం ప్రస్తుతానికి ఆసుపత్రిలో ఉన్న వైద్య బృందంతో సేవలందిస్తున్నాం. ప్రత్యేక వైద్యుల నియామకం అంశం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# యాసంగికైనా భరోసా కలిగేనా!

జగిత్యాల : రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పంటల(ఫసల్) బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించిన నేతల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు సీజన్లు గడిచినా అన్నదాతకు భరోసా కరవైంది. అక్టోబరు నుంచి యాసంగి పంట కాలం మొదలైన నేపథ్యంలో ఈసారైనా బీమా పథకం అమలుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**అత్యధికంగా 9 పంటలకు..**

యాసంగి సీజన్‌లో పంటల బీమాను అమలు చేయాలంటే ఇప్పటి నుంచి డిసెంబరు 15లోగా నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉంటుంది. గతంలో బీమా కంపెనీకి రైతులు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేవి. మొత్తం ప్రీమియంను రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని నేతలు పేర్కొన్నారు. ఇది అమలైతేనే అన్నదాతకు ఊరట కలుగుతుంది. గతంలో రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో జగిత్యాల జిల్లాలో 9 పంటలకు బీమా పథకం అమలైంది. మిగిలిన జిల్లాల్లో 6 పంటలకు బీమా ఉండేది. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా వరి, మక్క, వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా ద్వారా మామిడి, వానాకాలంలో పత్తి, మిరపకు కూడా బీమా ఉండేది. కొన్ని సీజన్లుగా అమలు చేయకపోవడంతో ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ఆసరా కరవైంది. మరోవైపు పంటలు దెబ్బతిన్నపుడు ఎకరాకు



రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

**ఇవీ లోపాలు**

2000లో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి 2019 వరకు 31 సీజన్లలో అమలు చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు మొత్తం 9.13 లక్షల మంది రైతులు రూ.62.12 కోట్ల ప్రీమియం చెల్లించగా ఇంతే మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీకి చెల్లించాయి.

చాలా సీజన్లలో రూ.వందల కోట్లలో రైతులు నష్టపోయినా 3.72 లక్షల మందికి రూ.72 కోట్ల పరిహారం మాత్రమే వచ్చింది. మామిడిలో వాతావరణ బీమాను అమలు చేసినా కనీసం చెల్లించిన ప్రీమియం మేరకు కూడా పరిహారం రాలేదు. ఈ నేపథ్యంలో రైతువారీగా లేదా కమతం, సర్వే నంబర్ల వారీగా బీమా అమలు, ప్రీమియం చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేయడం ద్వారా పథకం అమలులోని లోపాలను చాలావరకు అరికట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పథకంలో మార్పులకు బదులు అయిదేళ్ల కిందట కేవలం కిస్తీ చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేసి అమలు బాధ్యతను కంపెనీకి వదిలిపెట్టాయి. పైగా తాము చెల్లించాల్సిన కిస్తీపై ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించనందున రైతుల్లో నమ్మకం సడలి బీమా వైపు వెళ్లలేదు.

ఇప్పటికైనా ఫసల్ బీమా పథకానికి నోటిఫికేషన్‌ను వెలువరించడంతో పాటు బీమా పరిధిలోకి వచ్చే రైతులు, కుటుంబసభ్యులకు రూ.2 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం సంభవిస్తే రూ.1.25 లక్షల పరిహారం, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర పరికరాలకు పరిహారం అందేలా పథకం విస్తరణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# పోషక వంట.. పెరగాలి పంట



చౌటుప్పల్: పప్పు ధాన్యాలు ఆహారంలో కీలకమైనవి. ఇవి మన దేహం, కణజాలాల, ధాతువుల నిర్మాణానికి కణజాలాల పునరుత్పత్తికి, రోగ నిరోధక శక్తిని పెంచేందుకు, పదార్థాలకు రుచి, సువాసనకూ, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగపడతాయి. రక్తంలో, కాలేయంలో నాలుగు గ్రాముల ఇనుము ఖనిజ లవణంగా ఉంటుంది. హిమోగ్లోబిన్ తయారయ్యేందుకు, కొన్ని ఎంజైములు పని చేసేందుకు ఇనుము అవసరం. పప్పు ధాన్యాలు భుజిస్తే వాటి నుంచి శరీరానికి ఇనుము లభిస్తుంది. మన శరీరంలో ఉండాల్సిన 24 రకాల ఖనిజ లవణాలు, విటమిన్లు పప్పు ధాన్యాల ద్వారా లభిస్తాయి. నిత్యం ఆహారంలో పప్పు ధాన్యాలు తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలోని ఏడు లక్షల మందికి నిత్యం పప్పు ధాన్యాలు అవసరమైనా సాగు నామమాత్రంగా ఉంది. 2025 వానాకాలంలో జిల్లాలో 4042 ఎకరాల్లో వీటిని పండించినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు.

**రోజుకెన్ని పప్పు ధాన్యాలు అవసరం**

ప్రతి ఒక్కరికీ అవసరమైన కేలరీలు(శక్తి) పొందేందుకు తృణ, పప్పు ధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, దుంపలు, పాలు, నూనెలు, పంచదార, బెల్లం నిత్యం ఆహారంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం ఒక రోజుకు... కూర్చుని పని చేసే వారు 40 గ్రాములు, మితమైన శ్రమ చేసే వారు 50 గ్రాములు, అధిక శ్రమ చేసే వారు 60 గ్రాములు పప్పు ధాన్యాలు భుజించాలి. గర్భిణులు 15 గ్రాములు, పాలిచ్చే తల్లులు 30 గ్రాములు అదనంగా ఆహారంలో పప్పు ధాన్యాలు తినాలి.

**ప్రకృతి ప్రసాదించిన పోషకాహారం**-డాక్టర్ జెల్లా రాందాసు, ఎండీ, జనరల్ మెడిసిన్, చౌటుప్పల్

పప్పు ధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన సహజసిద్ధ పోషకాహారం. వాటిలో 40% ప్రొటీన్, 40% కార్బొహైడ్రేట్లు, 20% కొవ్వు పదార్థాలుంటాయి. శరీరానికి కావాల్సిన విటమిన్లు, మినరల్స్ కూడా లభిస్తాయి. అన్ని వయసుల వారూ నిత్యం ఆహారంలో పప్పు ధాన్యాలు భుజించాలి.

# స్నాతకోత్సవానికి వేళాయె!



కరీంనగర్ : శాతవాహన విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవం నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. వర్సిటీ ఛాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన నవంబరు 7న నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బి.జె.రావు హాజరుకానున్నారు. వీరు విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు అందించి దిశానిర్దేశం చేస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వర్సిటీ ఆవరణలోని క్రీడా మైదానంలో భారీ వేదిక ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

**భారీ భద్రత మధ్య..** గవర్నర్ హాజరవుతుండటంతో ప్రొటోకాల్ ప్రకారం హైసెక్యూరిటీ నడుమ వర్సిటీ విద్యార్థులు, అతిథులు మాత్రమే హాజరవుతారు. 2019లో ప్రథమ స్నాతకోత్సవం నిర్వహించగా అప్పటి గవర్నర్ సమయం ఇవ్వలేకపోయారు. దాంతో ఈసారి వీసీ ఉమేశ్‌కుమార్ స్నాతకోత్సవానికి ముందుగా గవర్నర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం వేడుక పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

**బంగారు పతకాలు 161.. పీహెచ్‌డీ పట్టాలు 25**

విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రతిభ కనబర్చిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నారు. ఇప్పటికే విద్యార్థుల జాబితాలను సిద్ధం చేసి వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. మెరిట్ ఆధారంగా పతకాలు, 2018 నుంచి పీహెచ్‌డీలు పూర్తి చేసుకున్న వారికి పట్టాలు అందజేయనున్నారు.

**పేరు నమోదు చేసుకోవాలి**

బంగారు పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు అందుకునే విద్యార్థులు వారి పేర్లు, మొబైల్ నంబరు, ఫొటో, ఈమెయిల్ ఐడీలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. దాని ఆధారంగా వేదిక వద్ద వారికి సీట్లు కేటాయిస్తారు. వాటిలో మాత్రమే కూర్చోవాల్సి ఉంటుంది. విద్యార్థులతోపాటు ఒక వ్యక్తికి వర్సిటీలోకి ప్రవేశం ఉంటుంది. చిన్న పిల్లలకు ప్రవేశం లేదు.

శాతవాహన విశ్వవిద్యాలయం వీసీగా యు.ఉమేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలో మెగా జాబ్‌మేళా, న్యాయ, ఫార్మసీ కళాశాలలు, హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయించారు. విశ్వవిద్యాలయంలో వివిధ అభివృద్ధి పనులకు కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. వర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారు.

**పది రోజుల్లో పనులు పూర్తి**

వర్సిటీలో ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టాం. పతకాల దాతలతో పాటు, వేర్వేరు పార్టీల ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పలికాం. ఈ పది రోజులపాటు మిగిలిన పనులు పూర్తి చేస్తాం. స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఉమేశ్‌కుమార్, ఉపకులపతి, వర్సిటీ

# జోరుగా ఇసుక 'అక్రమ' రవాణా



ఇల్లంతకుంట: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ముఖ్యంగా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్, పొత్తూరు మానేరు వాగు నుంచి నర్సక్కపేటలో బిక్కవాగు నుంచి నిత్యం ఏదో రకంగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. స్థానికంగా ఇసుక అవసరమున్న వారికి మాత్రం దొరకడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి** ఇందిరమ్మ ఇళ్ల పేరిట అనుమతులు తీసుకొని పక్క జిల్లాల్లో విక్రయిస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పక్క జిల్లా అయిన సిద్దిపేట పరిధిలోని విఠలాపురం, చిన్నకోడూరు, తదితర గ్రామాలకు తరలిస్తున్నారు. దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందంగా ఇసుక అక్రమ వ్యాపారం సాగుతోంది.

నియంత్రించాల్సిన అధికారులు ఎవరో ఫోన్ చేస్తే తప్ప తనిఖీలు చేపట్టడం లేదు. ట్రాక్టర్లకు నంబర్లు లేకుండా నడుపుతుండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిపై కేసు నమోదు చేస్తారో తెలియని పరిస్థితి.

రెవెన్యూ అధికారులు రెండు ట్రిప్పులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ఇందుకు ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల సమయం మధ్య స్థానికంగా ఉన్న వాగుల నుంచే తీసుకెళ్లడానికి అవకాశం కల్పిస్తున్నారు కానీ.. ఇసుక ట్రాక్టర్ల యజమానులు మానేరు వాగులోంచి అనుమతి లేకున్నా తవ్వకాలు చేస్తూ తరలిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఎంత అసరమన్నది పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరించి ఇస్తే రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. అయితే ఆ ఇళ్లకు ఎన్ని ట్రిప్పుల ఇసుక అవసరమో గుర్తించలేకపోవడంతో అక్రమదారులకు కాసులు కురుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి ఎంతమొత్తంలో ఇసుక అవసరమో గుర్తించి అంతమేరే అనుమతులు ఇస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాత్రమే ఇసుక అనుమతిస్తున్నాం. అది కూడా బిక్కవాగు నుంచి తీసుకెళ్లాలి. వాగులో నీరు ఉండటంతో ప్రస్తుతం మానేరు వాగు నుంచి తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు స్థానికంగా ఉన్న వాగులో నుంచి తీసుకెళ్లాలి. గ్రామ పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరిస్తేనే అనుమతి ఇస్తున్నాం. సమయం దాటి ఇసుక రవాణా చేయకుండా చూడాలని పోలీసులకు చెప్పాం. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయి. ఫారూఖ్, తహసీల్దార్

# గుత్తేదారులు వదిలేశారు!

భువనగిరి: ప్రభుత్వం పనులు మంజూరు చేస్తోంది. గుత్తేదారులు ఒప్పందం చేసుకుంటున్నారు.. మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలో వదిలేసి వెళ్లిపోతున్నారు. కొత్త పనులు చేయకుండా ఆపేస్తున్నారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల తీరు ఇలా.. ప్రణాళికేతర నిధులతో రెండేళ్ల కిందట భువనగిరి మండలంలో మూడు రహదారుల బీటీ రెన్యూవల్ ప్రతిపాదించారు. టెండర్ల క్రతువు ముగిసి గుత్తేదారు ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క పనికూడా ప్రారంభించలేదు. వీటిలో అనాజీపూర్ నుంచి జంపల్లి వరకు 5 కి.మీ.లకు రూ.కోటి, భువనగిరి అప్రోచ్‌రోడ్డు–ముత్తిరెడ్డిగూడెం–దాతర్‌పల్లి వరకు 10 కిమీలకు రూ.2 కోట్లు, ముత్తిరెడ్డిగూడెం– గంగసానిపల్లి– పాత గుట్ట వరకు 4.6 కిమీ సుమారు రూ.కోటి మంజూరు చేశారు. బీబీనగర్–పోచంపల్లి మార్గంలో మూసీ నదిపై రుద్రవెల్లి–జూలూరు మధ్యన వంతెన పనులు ప్రారంభించి ఏడేళ్లు కావొస్తుంది. నాబార్డు ఆరేళ్ల కింద రూ.8.5 కోట్లతో మంజూరు చేసింది. కరోనా నేపథ్యంలో మరో ఏడాది గడువు పొడిగించారు. ఆ లోపు నాబార్డు గడువు ముగియడంతో చేసిన పనుల వరకు బిల్లులు చెల్లించి పనులు నిలిపివేశారు. అసంపూర్తి పనులు చేపట్టేందుకు విడిగా కొత్త అంచనాలు తయారు చేసి పంపగా 2022–23లో ఎస్సీ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.10.80 కోట్లు మంజూరు చేశారు.

# సృజనాత్మక ఆలోచనకు.. పీఎంఈజీపీ భరోసా

హైదరాబాద్: ఒక చిన్న ఆలోచన ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తోంది. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి పెట్టేందుకు ఇబ్బంది పడే యువతకు కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తోంది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా బ్యాంకురుణాలు, రాయితీ అందిస్తూప్రోత్సహిస్తోంది.

**ఎంపిక, మంజూరు ఇలా..**

18 ఏళ్లు నిండిన వారు తమ ఆసక్తి, స్థానిక అవసరాలకు అనుగుణంగా యూనిట్లను ఏర్పాటు చేయవచ్చు.

కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ ఉపయోగించుకున్నవారు ఈ పథకానికి అనర్హులు.

సేవా రంగంలో రూ.20 లక్షలు, ఉత్పత్తి రంగంలో రూ.50 లక్షల వరకు యూనిట్ ధర ఉంటుంది. రూ.2 లక్షల వరకు ట్రైనింగ్ ఉండదు. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఐదురోజులు, అంతకు మించితే 11 రోజుల వరకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుంది. ఆతర్వాత




సాధారణ స్థాయి పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

యూనిట్ జియో ట్యాగింగ్, సంబంధిత వీడియోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండడంతో బినామీలకు ఆస్కారం ఉండదు. ఖాదీ, విలేజ్‌ఇండస్ట్రీస్ కమిషన్ నోడల్‌ఏజెన్సీగా ఉంటుంది.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మాజీ సైనికులు, దివ్యాంగులు తదితరులను ప్రత్యేక కేటగిరీకింద పరిగణిస్తారు. ఇతరులు సాధారణ విభాగంలోకి వస్తారు. సాధారణ కేటగిరిలో ప్రాజెక్టు విలువలో 10 శాతం, ప్రత్యేక కేటగిరిలో 5% లబ్ధిదారు వాటాగా పెట్టుబడి పెట్టాలి. పీఎంఈజీపీ కింద సాయం ఒక కుటుంబం నుంచి ఒకరికే. యువత ఉపయోగించుకోవాలి...

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇదో మంచి అవకాశం. యువత వినియోగించుకోవాలి.

ఎం.ప్రీతి పవన్‌కుమార్, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, హైదరాబాద్దరఖాస్తు ఇలా.. %www.kvconline.gov.in/pmegpeportal% ఆన్‌లైన్ వేదికలో అప్లై చేసుకోవాలి.

# కొనుగోళ్లలో రాణింపు

సిరిసిల్ల: మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ఆసక్తి ఉన్న ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాలు)లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఒక అడుగు ముందుకేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలను సింహభాగం మహిళలకే అప్పగించింది. గత యాసంగి సీజన్‌లో 189 కేంద్రాలను విజయవంతంగా నిర్వహించి రూ.6 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు. ఈ వానాకాలంలోనూ పెద్దఎత్తున వారికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు అప్పగించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు.

**లక్ష్యం ఇలా..** జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వానాకాలం వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఈ సీజన్‌లో 4.56 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. కాగా అందులో రైతులు తిండి అవసరాలకు పోను పౌరసరఫరాలశాఖ 3.24 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో 9 వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం. ఈ సారి ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు ఏ–గ్రేడు రూ.2,389 కాగా కామన్‌రకం రూ.2,369లుగా నిర్ణయించారు. దసరా పండుగ తర్వాత నుంచి జిల్లాలో వరి కోతలు ప్రారంభం అవుతాయి. పౌరసరఫరాలశాఖ కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు చేస్తోంది.

జిల్లాలో 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. వీటిలో 189 ఐకేపీ, మెప్మా 3, పీఏసీఎస్ 50 కేంద్రాలు ఉన్నాయి. కొనుగోళ్లు జరిగే రెండు నెలలు అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ధాన్యం మిల్లులకు సకాలంలో చేరేలా శ్రమించనున్నారు. రైతుల డబ్బులు ఎప్పటికప్పుడు వారి ఖాతాలో జమ చేయిస్తున్నారు.

ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్‌ను సంఘాలకు అందిస్తుంది. మహిళా సంఘాలకు 2023–24 సంవత్సరానికి ధాన్యం కొనుగోలులో కమీషన్ రూ.90.57 లక్షలు అంటే కొనుగోలు చేసినదానిలో 39.25 శాతం మాత్రమే ముట్టింది. ఇప్పటికీ మూడు సీజన్ల కమీషన్ రావాల్సి ఉంది.

జిల్లాలో అత్యధికంగా ముస్తాబాద్, చందుర్తి, మల్యాలలోని సంఘాలు 30 వేల నుంచి 33 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనిలో ఒక్కో సంఘానికి సగటున రూ.10 లక్షల మేరకు కమీషన్ వచ్చే అవకాశం ఉంది. ఖర్చులు పోనూ ఒక్కో సంఘానికి రూ.5 లక్షలపైనే మిగులుతుంది. రెండు నెలల వ్యవధిలో మహిళా సంఘాల కష్టానికి ప్రతిఫలం లభిస్తుంది. ప్రభుత్వం సకాలంలో కమీషన్ నిధులు విడుదల చేయాలని సభ్యులు కోరుతున్నారు.

# వర్ష ప్రభావం.. బొగ్గు ఉత్పత్తికి విఘాతం

గోదావరిఖని: అర్ధ వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సింగరేణి చేరుకోలేకపోయింది. వర్షాల ప్రభావంతో గత నెలలో 1.52 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకంజలో ఉంది. మొత్తంగా ఆరు నెలల్లో 2.97 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి దూరంగా ఉంది. ఈ ఏడాది సింగరేణి సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆరు నెలల్లో 30.71 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా.. 27.74 మిలియన్ టన్నుల ఉత్పత్తిని మాత్రమే సాధించింది.

**కేవలం ఆర్జీ–1లోనే వందశాతం**

సెప్టెంబరులో 5.07 మిలియన్ టన్నులకుగాను.. 3.55 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని వెలికి తీసింది. ఈ నెలలో కేవలం ఆర్జీ–1 మాత్రమే వందశాతం బొగ్గు ఉత్పత్తి చేయగలిగింది. మిగతా 10 డివిజన్లన్లు లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. గతనెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఉపరిత గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. దీంతో ఈ నెలలో సాధించాల్సిన ఉత్పత్తిపై ప్రభావం పడింది. అదికాస్త అర్ధవార్షిక లక్ష్యానికి విఘాతం కలిగినట్లయింది. **రానున్న ఆరు నెలలు కీలకం** రానున్న ఆరు నెలల్లో 44.26 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. 72 మిలియన్ టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. రానున్న ఆరు నెలల్లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ ముందుకు సాగాలి. గడిచిన ఆరు నెలల్లో కేవలం 27.74 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిన సింగరేణి.. రానున్న ఆరు నెలల్లో వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే నెలకు 7.4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంటుంది. **ముందంజలో మూడు డివిజన్లు** ఇప్పటి వరకు ఆరు నెలల్లో కేవలం మూడు డివిజన్లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. కొత్తగూడెం, మణుగూరు, ఆర్జీ–2 డివిజన్లు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఆరు నెలల్లో కొత్తగూడెం డివిజన్ 102 శాతం సాధించగా.. మణుగూరు వంద, ఆర్జీ–2 డివిజన్ 110 శాతం ఉత్పత్తి సాధించాయి.

## ఆ పల్లెలో పది రాష్ట్రాల ప్రజలు

జగిత్యాల : దేశంలో అన్ని వర్గాలు, మతాలవారు ఉంటారు కానీ ఆ పల్లెలోనే దాదాపు సగం రాష్ట్రాల జనాభా జీవిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఆ పల్లె ఉంది. అదే టీఆర్‌నగర్(తారకరామనగర్). 1984లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో నర్సింగాపూర్ శివారులోని భూములను తీసుకొని పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కొక్కరు గ్రామంలో చేరటంతో గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల పట్టణంలో ఆ గ్రామాన్ని విలీనం చేశారు.

**9 వేల జనాభా**

గ్రామంలో రెండు వార్డులతో దాదాపు 9 వేల మంది జీవిస్తున్నారు. ఇక్కడ ఉంటున్నవారిలో గతంలో తెలంగాణలోని దాదాపు 10 జిల్లాలకు చెందినవారుండగా.. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఢిల్లీ తదితర 10 రాష్ట్రాలకుపైగా జనాభా ఇక్కడ నివాసం ఏర్పరచుకున్నారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో జన్మించినవారు తమది ఇదే ప్రాంతంగా చెప్పుకొంటారు.

**సర్వ మతాలు, అన్ని వర్గాలు**

హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కులతోపాటు అన్ని వర్గాలవారు గ్రామంలో ఉన్నారు. నాలుగు దేవాలయాలుండగా, మూడు మసీదులు, రెండు చర్చిలు, సిక్కుల కోసం గురుద్వార్ ఉంది. ముస్లింలకు ఉర్దూ పాఠశాల,



ఇతరులకు మదర్సా అనే అరబ్ పాఠశాల ఉంది. దాదాపు అన్ని భాషలు మాట్లాడేవారు గ్రామంలో ఉన్నారు. టీఆర్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరముందని గ్రామస్థులు కోరుతున్నారు.

**వలసకు కారణం** జగిత్యాల పట్టణంతోపాటు, కోరుట్ల, మెట్‌పల్లి, కరీంనగర్ పట్టణాలకు సమీపంలో టీఆర్‌నగర్ ఉంది. ఉపాధి కోసం ఇక్కడికి వచ్చినవారికి టీఆర్‌నగర్‌లో అద్దె ఇళ్లు తక్కువ ధరకు దొరకడం, గ్రామంలో ఎక్కువగా కూలీలు ఉండటంతో తాము కూడా కలిసి ఉందామనే ఆలోచనతో ఇక్కడే ఉండిపోయారు. చిన్న చిన్న వ్యాపారాలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలున్నారు. సమీపంలోనే పట్టణాలు ఉండటంతో వ్యాపారాలతో లాభసాటిగా ఉండటం వారంతా ఇక్కడే స్థిరపడేలా చేసింది.

## యాసంగికి శ్రీరామ రక్ష

జగిత్యాల : ఉమ్మడి జిల్లా వరదాయని శ్రీరామసాగర్ ప్రాజెక్టు యాసంగి సాగుకు భరోసాగా నిలవనుంది. ఈ వానాకాలంలో గోదావరి పరీవాహకంలో వానలు ఆలస్యంగా ప్రారంభమైనా తదుపరి భారీ వర్షాలతో ఎన్నడూ లేనంతగా ప్రాజెక్టులోకి వరద చేరింది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 882 టీఎంసీల నీరు రాగా 815 టీఎంసీలను దిగువకు వదిలారు. గడిచిన నాలుగేళ్లలో ఈసారి వరదే అధికం. ఇందులో అత్యధికంగా మిగులు జలాలుగా గోదావరిలోకి విడుదల చేశారు. వానాకాలం సీజన్ ముగిసినా ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో స్పిల్‌వే గేట్ల ద్వారా కొంత నీటిని నదిలోకి వదులుతున్నారు. యాసంగి మొదలైన నేపథ్యంలో ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో నీరు నిలువ ఉండటంతో పూర్తి స్థాయిలో పంటలకు నీరందే అవకాశం ఏర్పడింది.

**29న బాబ్లీ గేట్లు మూసివేత**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహారాష్ట్రలో గోదావరిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఏటా జులై 1న తెరచి అక్టోబరు 29న మూసివేస్తున్నారు. ఈ నాలుగు నెలలు ఎగువ నుంచి బాబ్లీలోకి వచ్చిన వరదను మొత్తం దిగువన ఎస్సారెస్పీలోకి వదలాలి. ఆ తర్వాత తదుపరి నెలల్లో వచ్చే 2.74 టీఎంసీల నీటిని మహారాష్ట్ర వినియోగించుకోవాలి.

తెలంగాణ తాగునీటి అవసరాల నిమిత్తం మార్చిలో 0.60 టీఎంసీల నీటిని బాబ్లీ నుంచి ఎస్సారెస్పీలోకి విడుదల చేయాలి.

2.40 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసివేసినా ప్రస్తుతం ఎస్సారెస్పీతో పాటు మధ్యమానేరు, దిగువమానేరు, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి నీటితో ఉమ్మడి జిల్లాకు భరోసా కలగనుంది.

ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీల పరిధిలో ప్రధాన పంటలైన వరి, ఇతర ఆరుతడి పంటలకు అనుగుణంగా నీటి విడుదల ప్రణాళికను అధికారులు రూపొందించి వారబందీ పద్ధతిని అమలు చేస్తారు.

ఎస్సారెస్పీ నుంచి ఉమ్మడి జిల్లా అవసరాల కోసం కాకతీయ, వరద కాలువలకు నీటిని విడుదల చేసి ఆయకట్టుతో పాటు చెరువులు, కుంటల్లోకి తరలించనుండటంతో భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలో కొనసాగి పంటల సాగుకు ఉపకరించనుంది.ఎస్సారెస్పీ ఆయకట్టు విస్తీర్ణం(ఎకరాల్లో)

ఎల్‌ఎండీ ఎగువన : 4,42,920

దిగువన : 5,05,720

వరదకాలువ ఆధారంగా : 50 వేలు

## పరిశీలించకుండా.. పచ్చజెండా

హైదరాబాద్ : నగర శివారులో ఫ్లాట్ల నిర్మాణం చేపట్టిన ఓ స్థిరాస్తి సంస్థ హెచ్‌ఎండీఏ నుంచి అనుమతుల కోసం ఏకంగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసింది. ఇటీవలే సంస్థ పనులు ప్రారంభించగా, రెవెన్యూ అధికారులకు అనుమానం వచ్చి రికార్డులను పరిశీలించగా, వ్యవసాయయేతర భూమిగా మార్చుకోకుండానే ఆర్డీఓ అనుమతిచ్చినట్లు ఫోర్జరీ పత్రాన్ని సృష్టించినట్టు తేలింది. దీంతో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు. నకిలీ పత్రం అని తెలుసుకోకుండా ఎలా అనుమతులిచ్చారని హెచ్‌ఎండీఏ అధికారులను పోలీసులు ప్రశ్నిస్తే మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోవైపు సంస్థ ప్రతినిధులు హయత్‌నగర్ సమీపంలోని తట్టిఅన్నారంలో ఫ్లాట్ల నిర్మాణం సాగిస్తున్నారు.

ధ్రువీకరించుకోకుండా: అబ్దుల్లాపూర్ మండలం తట్టిఅన్నారంలో 600లకు పైగా ఫ్లాట్లు నిర్మించేందుకు ఓ స్థిరాస్తి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. రెండు ఎకరాల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ఏడేళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు పొందారు. ఈ భూమికి పక్కనే ఉన్న మరో ఎకరం భూమికి అనుమతులు తీసుకోలేదు. కొద్ది నెలల క్రితం తొలుత రెండెకరాల భూమిలో లే-అవుట్ వేసి హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నారు. అనంతరం ఎకరం భూమిని నాలా కన్వర్షన్ (వ్యవసాయేతర భూమి)చేయించకుండా ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసి హెచ్‌ఎండీఏకు సమర్పించగా అనుమతులు మంజూరయ్యాయి. దీంతో పనులు మొదలు పెట్టారు.

**సమాచారం ఇచ్చేందుకు మీనమేషాలు..**

ఫ్లాట్ల నిర్మాణానికి లే-అవుట్లు ఇచ్చేప్పుడు హెచ్‌ఎండీఏ అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి. రెవెన్యూ అధికారులు, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతో మాట్లాడాలి. వీటన్నింటిని విస్మరించిన అధికారులు అనుమతులిచ్చారు. దీనిపై పోలీసులు ప్రశ్నిస్తుంటే మూడు నెలలుగా సమాచారం ఇవ్వడం లేదు. దీంతో నిందితుల అరెస్ట్ ఆలస్యమవుతోందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ఫోర్జరీకి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షిస్తామని, హెచ్‌ఎండీఏ అధికారుల అలసత్వముంటే ఉన్నతాధికారులకు సమాచారమిస్తామన్నారు.

# వాయువు మూస్తే.. ఆయువు పోసేదెలా?



నల్గొండ: అత్యవసర సమయంలో రోగులకు ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్తు బిల్లుల మోత పెరగడంతో నిర్వహణ ఆపేశారు. కరోనా సమయంలో శ్వాసకోస సమస్యలు తలెత్తి.. పలువురు ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు నిర్మించాలని ఆదేశించింది. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి.

**ఆసుపత్రుల్లో వినియోగం ఇలా..**

ఒక్కో జిల్లాసుపత్రిలో అన్ని విభాగాలు కలిపి రోజూ 800 మంది ఓపీ నమోదవుతుంది. ఐపీ 300 మంది వరకు ఉంటారు. గర్భిణులు వైద్యసేవలకు ఎక్కువగా తరలివస్తారు. ఐసీయూ, అత్యవసర సేవలు, శస్త్రచికిత్స విభాగాల్లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంప్రదాయ ఆక్సిజన్ సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రతి నెల గరిష్ఠంగా ఒక్కో ఆసుపత్రిలో 10 వరకు వాడుతున్నారు. ఒక్కో ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.60 లక్షలతో నిర్మించిన 500, 1000 లీటర్ ఫర్ మినిట్(ఎల్పీఎం) సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఐసీయూతో పాటు ఆక్సిజన్ అవసరం ఉన్న అన్ని విభాగాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లాలోని సాధారణ ఆసుపత్రిలో ప్లాంట్ ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. కోదాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్లాంట్ నిర్మించినప్పటికి వినియోగించడం లేదు. తిరుమలగిరిలో ఏడు పడకల ఆసుపత్రి ఉండటంతో ఇక్కడ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. హుజూర్‌నగర్ 60 పడకల ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయగా ప్రస్తుతం మరమ్మతుల కారణంగా వినియోగించడం లేదు.

నల్గొండ జిల్లాసుపత్రిలోనూ లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించినా.. విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడం, వినియోగం తక్కువగా ఉండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు. నాగార్జునసాగర్ కమల నెహ్రూ ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్మించినా.. విద్యుత్తు ఖర్చులు పెరుగుతుండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు.

దేవరకొండ ప్రాంతీయాసుపత్రిలో టెక్నీషియన్ లేక నిరుపయోగంగా ఉంది.

నకిరేకల్, మునుగోడులో నిర్మించినా ప్రారంభించలేదు.

**గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే నిర్వహణ కష్టాలు**

– డా.మాతృనాయక్, జిల్లా సుపత్రుల పర్యవేక్షకుడు, నల్గొండ

కరోనా సమయంలో ఒక్కో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టంను జిల్లాసుపత్రిలో, తక్కువ పడకలున్న చోట్ల మినీ లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులను నిర్మించి వదిలేశారు. దేవరకొండలో నెలకు రూ.40వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తుండటం, మరమ్మతులకు గురవుతుండటంతో సిలిండర్లు వినియోగిస్తున్నారు. గుత్తేదారుల సంస్థ కొన్ని ప్రాంతీయాసుపత్రుల్లో బిల్లులు రాక సగం నిర్మించి వదిలేశారు. నిర్మించిన చోట్ల మరమ్మతులు వచ్చినా పట్టించుకోవడం లేదు.

# భగీరథ.. తొలి అడుగు ఇక్కడే..!



నల్గొండ : దేశంలోనే అత్యధిక ఫ్లోరిన్ నీటి సమస్య ఉన్న ప్రాంతమైన మునుగోడు నియోజకవర్గం నుంచి 'మిషన్ భగీరథ' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫ్లోరైడ్ సమస్య నుంచి శాశ్వతంగా విముక్తి కల్గించేందుకు నదీ జలాన్ని శుద్ధి చేసి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నల్లా ద్వారా అందించాలనేది ఈ పథకం లక్ష్యం. మిషన్ భగీరథ చిహ్నంగా చౌటుప్పల్‌లో పైలాన్‌ను నిర్మించారు. 2015 జూన్ 8న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ పథకానికి రూ.5800 కోట్లు కేటాయించారు. 14 నెలల కాలంలో పనులు పూర్తి చేసి ఆగస్టు 7న గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 36.07లక్షల జనాభాకు నిత్యం స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. రోజుకు ప్రతి ఒక్కరికి గ్రామాల్లో 100 లీటర్లు, పురపాలికల్లో 135 లీటర్లు, పట్టణాల్లో 150 లీటర్లు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామాలకు 4.354, పురపాలికలకు 1.190, పరిశ్రమలకు 0.210 టీఎంసీలు నీళ్లు అవసరమని 2018లో నిర్ణయించారు. 2048 నాటికి జనాభా పెరుగుదలను అంచనా వేసి ఆ మేరకు నీటి అవసరాలను లెక్కించారు. శ్రీశైలం, పాలేరు నుంచి నీటిని సేకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. 7137 కిలోమీటర్ల ప్రధాన పైపులైను వేయించారు. నీటిని శుద్ధి చేయడానికి అంతకు ముందున్న రోజుకు 180.10 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే నీటి శుద్ధి కేంద్రాలతో పాటు 303 ఎంఎల్‌డీ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అంతకు ముందున్న 126 ఉపరితల, భూతల నీటి రిజర్వాయర్లతోపాటు కొత్తగా 113 నిర్మించారు. అంతకుముందున్న 43 సంపులకు అదనంగా 16 నిర్మాణం చేయించారు. గ్రామాల్లో అంతకు ముందున్న 6132.69 కి.మీ. పైపులైన్లకు తోడుగా 2096.32 కి.మీ పైపులైను వేయించారు. 180.90 ఎకరాల భూమిని సేకరించారు. రాష్ట్రంలో ఫ్లోరైడ్, ఆర్సినిక్ జలాలున్న ఆవాసాలు లేవని, కొత్తగా ఫ్లోరైడ్ కేసులు నమోదు కాలేదని 2020లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. మిషన్ భగీరథ పథకం ద్వారా నదీజలాలను సేకరించి, శుద్ధి చేసి, ఇంటింటికీ నల్లాల్లో పంపిణీ చేస్తున్న నీటిని ప్రజలు వినియోగించడం వల్ల ఫ్లోరైడ్ కొత్త కేసులు నమోదు కాలేదని, దశాబ్దాలుగా జిల్లాలోని లక్షల మందిని పీడించిన సమస్య పరిష్కారమైందని జిల్లా అధికారులు వెల్లడించారు.

# భద్రత డొల్ల.. పర్యవేక్షణ కల్ల



ఆలేరు : భువనగిరి ఆర్బీనగర్‌కు చెందిన ఒక టిఫిన్ సెంటర్ నిర్వాహకుడి ఇంట్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్‌ను నింపే క్రమంలో గ్యాస్ లీకైంది. మంటలతో పాటు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో దంపతులు, అక్కడే ఉన్న మరొకరు దుర్మరణం చెందారు.' హోటళ్లు, క్యాంటీన్‌లు, టీకొట్లు, బేకరీలలో ఆహార పదార్థాల తయారీకి గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. చాలావరకు ఇరుకు గదులలో వంటలు తయారు చేస్తున్నారు. అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించడం లేదు. చిన్నచిన్న నిర్లక్ష్యాలు, తప్పిదాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చాలా హోటళ్లలో గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నప్పటికీ అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వీడటం లేదు.

**ఇష్టారాజ్యంగా అనుమతులు**

హోటళ్లు, బేకరీలు, వాణిజ్య సముదాయాల నిర్వహణకు పురపాలిక, ఆహార తనిఖీ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. గ్యాస్ సిలిండర్లను గదుల్లో కాకుండా భవనం ముందు భాగంలో ఏర్పాటు చేయాలి. అక్కడి నుంచి పైపుల ద్వారా భవనంలోకి గ్యాస్‌ను సరఫరా చేసుకోవాలి. అవసరమైన అగ్నిమాపక పరికరాలు, గోనె సంచులు, ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలి. వెలుతురు ఉన్న గదుల్లోనే ఆహార పదార్థాలు, వంటలు తయారు చేయాలి. పొగ లేకుండా గొట్టాలు ఏర్పాటు చేయాలి. కానీ సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లుగా తనిఖీలు చేపట్టడం, అనుమతులు ఇస్తుండటంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. కొందరు హోటళ్ల నిర్వాహకులు వంటగ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీని దుర్వినియోగం చేస్తున్నారు.

**జాగ్రత్తలతోనే రక్షణ..**

గ్యాస్ సిలిండర్‌కు బిగించిన రెగ్యులేటర్, పైపును తరచూ పరిశీలిస్తుండాలి. గ్యాస్ లీకేజీ నివారణకు వినియోగం పూర్తయిన వెంటనే గ్యాస్‌స్టవ్‌కు సరఫరా నిలిపివేయాలి.

బేకరీలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో రాత్రివేళ సీసీ కెమెరాలు మినహా, ఇతర గదులకు విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి.

వంటచేసే సమయంలో సిబ్బంది నూలు దుస్తులు ధరించాలి. సిల్క్, టెరికాటన్ లాంటి దుస్తులకు త్వరగా మంటలు అంటుకునే గుణం ఉంటుంది, ఇలాంటివి ధరించకూడదు.

జిల్లా సమాచారం

గ్యాస్ ఏజెన్సీలు: 19

దీపం కనెక్షన్లు: 51,391

ఉజ్వల: 13,007

డొమెస్టిక్: 1,85,070

## ఉపయోగం లేక .. రూ.కోట్లు వృథా

పెద్దపల్లి :కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామశివారులో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. పరికరాలు సమకూర్చారు. స్మశాన వాటిక సమీపంలో ఉండటంలో అటువైపు వెళ్లేందుకు పిల్లలు, క్రీడాకారులు జంకుతున్నారు. అందులో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, విద్యార్థులను ఆటల వైపు మరల్చేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. చెరువు శిఖం, గుట్ట, పనికిరాని ప్రాంతాల్లో నిర్మించటంతో అందులో సాధన చేసిన నాథుడే లేడు. ఆరేళ్ల క్రితం ఆగమేఘాల మీద ఉపాధిహామీ నిధులు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు నెలకొల్పారు. కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం సాధనకు మైదానాన్ని చదును చేసి పరికరాలు బిగించారు. అయితే అధికారుల ముందుచూపు, నిర్వహణ లోపం కరవై రూ.లక్షల ప్రజాధనం వృథాగా మారింది.




**ఒక్కో దానికి రూ.4లక్షల లోపు నిధులు**

ఒక్కో ప్రాంగణానికి రూ.4 లక్షలలోపు ఉపాధిహామీ నిధులు వెచ్చించారు. ఈ లెక్కన జిల్లాలో 266 పంచాయతీల్లో సుమారు రూ.9 కోట్లు కేటాయించి.. నిర్మించారు. గ్రామానికి దూరంగా, స్మశానవాటికల సమీపంలో ఉండటంతో నిరుపయోగంగా మారాయి. పంచాయతీలు మైదానాలు నిర్మించటంలో చూపిన శ్రద్ధ వాటి నిర్వహణలో మరిచా యి. క్రీడా పరికరాలు పొదల్లో తుప్పు పట్టిపోతున్నాయి. ఆరేళ్లలో ఒక్కసారి కూడా వీటిని వినియోగించకపోవటం గమనార్హం. ఎత్తులు, వంకల స్థలాల్లో ఉండటంతో చిరుజల్లులకే బురదమయంగా మారుతున్నాయి.

**మూలన కిట్లు**

సాధనకు ఒక్కో పంచాయతీకి క్రీడా కిట్లు సరఫరా చేశారు. అందులో క్రికెట్, అథ్లెటిక్స్, వాలీబాల్, ఇతరత్రా పరికరాలు ఉన్నాయి. ఇవి పంచాయతీల్లో మూలన మూలుగుతున్నాయి. కొన్నిచోట్ల ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి కూడా నెలకొంది. మైదానాల్లో సాధన చేసే ఉద్దేశంతో వీటిని పంపిణీ చేసినప్పటికీ ప్రభుత్వ ఆశయం అటకెక్కింది. గ్రామీణులు ఆరోగ్య కోసం నడక, వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూపుతున్నా.. సరైన వసతులు లేవు. రహదారులపై సాధన చేస్తూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి.

## అద్దె పథకం.. మూలన పరికరం

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థికాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. రాయితీపై రుణాలు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా జాతీయ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో నాలుగేళ్ల కిందట మండలానికి ఒక కస్టమర్ హైరింగ్ సెంటర్‌ను(సీహెచ్‌సీ) మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చి మహిళలు ఉపాధి పొందడం కార్యక్రమ ఉద్దేశం. వివిధ కారణాలతో ఆశయం అటకెక్కి పరికరాలు మూలనపడ్డాయి.

**మండలానికి ఒక యూనిట్**

జాతీయ జీవనోపాధుల మిషన్‌లో కేంద్రం 25 శాతం రాయితీ కల్పించింది. మిగిలిన సొమ్మును మండల సమాఖ్య నుంచి రుణంగా తీసుకొని ట్రాక్టర్, కల్టివేటర్, బేయర్, రొటొవేటర్, ట్రాలీ, కేజ్ వీల్స్, గడ్డికోత యంత్రాలు కొనుగోలు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.8 లక్షల నుంచి రూ.13 లక్షలు ఖర్చయింది. గ్రామాల్లో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంచాలని నిర్ణయించారు. 2021లో ప్రయోగాత్మకంగా జిల్లాకు ఒకటి చొప్పున ఇవ్వగా ఏడాది తర్వాత అన్ని మండలాలకు ఒక్కోటి కేటాయించారు.

**ఎందుకు ఈ పరిస్థితి?**

కొన్ని మండలాల్లో కేంద్రం ఇచ్చిన రాయితీ సొమ్ముతో పాటు మండల సమాఖ్య నుంచి తక్కువ రుణం తీసుకొని కొనుగోలు చేసుకున్నారు. గ్రామాల్లో చాలా మంది రైతులకు ట్రాక్టర్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉండటంతో గిరాకీ తగ్గింది. ప్రచార లోపంతోనూ రైతులు అద్దెకు తీసుకోవడం లేదు. అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టడం లేదు.కరీంనగర్ జిల్లా నగునూరు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో రూ.12 లక్షలతో పనిముట్లు కొనుగోలు చేశారు. అవసరం ఉన్న రైతులకు అద్దెకు ఇచ్చారు. మొదట్లో కొంత గిరాకీ రావడంతో ఆదాయం సమకూరింది. తరువాత ఆ పరిస్థితి లేదు.

గ్రామాల్లో పెద్ద రైతులు ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను కొనుగోలు చేసుకొని అద్దెకు ఇస్తున్నారు. రైతులు వారికి తరువాత డబ్బులు ఇచ్చే అవకాశముండటంతో రైతులు స్వశక్తి సంఘాల నుంచి తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

## పనులు పరుగులు పెట్టాలి

హైదరాబాద్: నవంబరు నెలాఖరుకల్లా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తి చేయాలని ద.మ.రైల్వే నిర్ణయించుకున్నా ఇప్పటివరకు 60శాతం పనులు కూడా పూర్తవ్వలేదు. రూ.699 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా మరో 40 శాతం మిగిలున్నాయి. ఇప్పటికే అనేక రైళ్లను చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడకు తరలించినా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పనులు పరుగులు పెట్టించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



**పురోగతిలో ఉన్నవి..**

దక్షిణం వైపు ప్రధాన భవనం, బేస్‌మెంట్ ఉత్తరం వైపు మల్టీలెవెల్ కారు పార్కింగ్ ఉత్తరం వైపు ప్రధాన భవనం, బేస్‌మెంట్ ఎయిర్ కాన్‌కోర్స్ కాజీపేట్ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నాంపల్లి వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పుట్ ఓవర్ బ్రిడ్జితో కూడిన ట్రావెలేటర్.ప్రారంభం 2023 పూర్తి లక్ష్యం 2025 నవంబర్ రోజువారీ ప్రయాణికులు 1,00,000 (ప్రస్తుత అంచనా) రైళ్లు 120

# శివారు వార్డులపై శీతకన్ను

బెల్లంపల్లి : ఇది బెల్లంపల్లి మున్సిపాల్టీలోని 3, 17వ వార్డులు కలిసి ఉన్న రోడ్డు. ఇక్కడ వీధి దీపాలు మూడేళ్లుగా వెలగడం లేదు. విద్యుత్తు స్తంభాలు ఉన్నా వాటికి బిగించిన తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. తీగలు లేక చీకట్లోనే ప్రజలంతా రాకపోకలు సాగిస్తుంటారు. రవీంద్రనగర్, చిన్నబూద గ్రామాల ప్రజలు ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు పండగ సందర్భంగానైనా వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని శివారు వార్డులపై మున్సిపాల్టీలు చిన్నచూపు ప్రదర్శిస్తున్నాయి. పురపాలికలు కనీస మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమవుతున్నాయి. సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి ప్రజలంతా సమస్యలతో సహవాసం చేస్తున్నారు. అభివృద్ధి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేట, క్యాతనపల్లి, మందమర్రిలతో పాటు మంచిర్యాల కార్పొరేషన్‌లోని శివారు వార్డుల్లో ప్రజలు సమస్యలతో అవస్థలు పడుతున్నారు.

**అధికారులకు విన్నవిచ్చినా..**

అక్కడి వార్డుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. సేవలు ఆలస్యంగానే అందుతున్నాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తంతా రోడ్లపైనే కనిపిస్తోంది. అధికారులకు సమాచారమిచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**



మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఒడ్డెరకాలనీ, రాజీవ్‌నగర్, గాంధీనగర్, తిలక్‌నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, అండాలమ్మకాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ సరిగా లేదు. తాగునీటి కోసం ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో ఇళ్లకు చేరడం లేదు. బెల్లంపల్లి పురపాలికలోని సుబ్బరావుపల్లి, అంబేడ్కర్‌నగర్, షంషీర్‌నగర్, గంగారాంనగర్‌లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. చెత్త వాహనాలు ప్రతిరోజు రావడం లేదు. చెత్తంతా పోగై కంపుకొడుతోంది. చెన్నూరు మున్సిపాల్టీలోని శివారు వార్డుల్లో మురుగు కాలువలు, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఆరో వార్డులోని ఆదర్శనగర్‌లో నిత్యం ప్రజలు సమస్యలతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. క్యాతనపల్లి మున్సిపాల్టీలోని కనకదుర్గ కాలనీ, తిలక్‌నగర్, అల్లూరి సీతారామరాజునగర్‌లో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. అంతర్గత రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. చెన్నూరు మున్సిపాల్టీ ఆరో వార్డులోని రోడ్డు పరిస్థితి ఇది. వర్షాకాలం వస్తే చాలు రోడ్డు బురదమయంగా మారుతుంది. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తారు రోడ్డుపై ఇసుక వేయడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

# మూత్రంపిండం.. ప్రాణ గండం

భైంసా: నిర్మల్ జిల్లా తానూరు మండలం మొగిలి గ్రామ పంచాయతీ పరిధిలోని మసల్గతండాను కిడ్నీ వ్యాధి వేధిస్తోంది. తండాలో 90 కుటుంబాలు ఉన్నాయి. 20 మంది కిడ్నీ వైఫల్య బాధితులు ఉండగా, మూడేళ్లలో ఆరుగురు మృతి చెందారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబాలు పశుసంపదను అమ్ముకుంటూ, అప్పు చేస్తూ చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం కనీసం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, వైద్యసేవలు అందించాల్సిన అవసరముంది.

**ఇదీ పరిస్థితి...**


మసల్గతండా గ్రామస్థులు కిలోమీటరు దూరంలో ఉన్న ఊట బావి నుంచి నీరు ట్యాంకులకు సరఫరా చేసుకుని వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ ఉన్నా సరఫరా కావడం లేదు. తాగు నీటి ద్వారా ఫ్లోరైడ్‌తో మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడి కిడ్నీ వైఫల్యానికి దారి తీస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. చిన్న జ్వరం వచ్చినా వైద్యులను ఆశ్రయించకుండా నొప్పినివారణ మాత్రలు వాడటం కిడ్నీలపై ప్రభావం చూపిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**ఎకరం పొలం అమ్మినా..అంగూరే బాయి**

నడుము నొప్పితో ఆసుపత్రికి వెళ్తే కిడ్నీ సమస్య ఉందని శస్త్రచికిత్స చేశారు. రూ.3 లక్షల వరకు ఖర్చయింది. ఎకరం పొలం అమ్మాను. ప్రతినెలా చికిత్సలకు, మందులకు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది.

**రూ.5 లక్షలు ఖర్చు చేసినా లాభం లేదు..**

జాదవ్ రేణుకాబాయి నా భర్త రామారావు కిడ్నీ పాడైంది. డయాలసిస్ కోసం మేకలు, గేదెలు అమ్మి రూ.5 లక్షలు ఖర్చు చేసినా ఆరు నెలల క్రితం మృతి చెందారు. నా పరిస్థితి అలాగే ఉంది. ప్రతినెలా చికిత్సలు, మందులకు రూ.10 వేల వరకు అవుతుంది. నా తోటి కోడళ్లు శాంతాబాయి అయిదేళ్లుగా, కమల్‌బాయి ఏడాదిగా కిడ్నీ వైఫల్యంతో



బాధ పడుతున్నారు.


**రెండు కిడ్నీలు పాడయ్యాయి**

రెండేళ్ల క్రితం అనారోగ్యంతో నిజామాబాద్, నాందేడ్, హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తిరిగాను. చివరకు రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు చెప్పారు. మందులు వాడినా తగ్గలేదు. 8 నెలలుగా వారానికి రెండు సార్లు భైంసా ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నా. పని చేసే శక్తి లేక ఇంటికే పరిమితమయ్యాను. –జాదవ్ ఆనంద్‌రావు

**నాతో పాటు నా కోడలు పరిస్థితి ఇదే..**

జాదవ్ రుక్మాబాయి నేను అయిదేళ్లుగా, నా కోడలు నీలాబాయి ఆరు నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాం. ముంబయిలోని ఆసుపత్రిలో చూపించుకుంటున్నాం. అప్పు చేసి మందులు కొంటున్నాం.

# తప్పుడు పోస్టులు.. తప్పవు కటకటాలు




ఆదిలాబాద్ : టాంజానియాలో ఉంటూ విద్వేషాలు రెచ్చగొట్టేలా వాట్సప్‌లో పోస్టు పెట్టిన నిందితుడు షేక్ ఇర్ఫాన్‌ను ఆదిలాబాద్ పోలీసులు ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇటీవల అరెస్టు చేశారు. ఓ రౌడీ షీటర్ అరెస్టు విషయంలో పోలీసులను కించపరిచేలా పోస్టులు పెట్టిన ఫలితంగా జైలుకు తరలించారు.

**శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా..**

పోలీసులు ఓ వ్యక్తిని పట్టుకొని కొడుతున్న వేరే ప్రాంతానికి చెందిన పాత వీడియోను ఆదిలాబాద్‌లోని బొక్కలగూడ యువకుడు పోస్టు చేశాడు. ఆదిలాబాద్‌లో జరిగిన సంఘటనగా వివరాలను నమోదు చేశాడు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పాత వీడియో పోస్టు చేశాడని అతనిపై పోలీసులు రెండ్రోజుల కిందట కేసు నమోదు చేశారు.

సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి వాటిలో కొందరు రకరకాల పోస్టులు పెడుతుంటారు. వీటిలో కొన్ని అవాస్తవాలు, మరికొన్ని విద్వేషాలు రెచ్చగొట్టేలా, మతాలు,వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా ఉంటాయి. వీటిని గుడ్డిగా నమ్మి కొందరు ఇతర గ్రూపులకు పంపిస్తుంటారు. దీంతో కొందరి పరువుకు భంగం కలగొచ్చు.. మత, వర్గ విభేదాలకు కారణం కావచ్చు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో జిల్లా యంత్రాంగం సోషల్ మీడియా సెల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. తప్పుడు పోస్టులు పెట్టిన వారితోపాటు, గ్రూప్ అడ్మిన్‌లనూ ఇందుకు బాధ్యులను చేస్తారు.

**కేసులు నమోదైన దృష్టాంతాలు ..**

గుడిహత్నూర్ మండలంలోని ఓ యువకుడు ఇన్‌స్టాగ్రాంలో తన సోదరి పేరిట ఫేక్ ఐడీ తయారు చేసి మహిళ పట్ల తప్పుడు ప్రచారం చేస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు.

ఆదిలాబాద్ పట్టణంలోని ఒక యువకుడు ఓ ప్రార్థన మందిరం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తూ పోస్టులు పెట్టాడు.

సిరికొండ మండలంలోని ఒక యువకుడు చైల్డ్‌పోర్న్ వీడియోలు చూడటమే కాక.. వాటిని డౌన్‌లోడ్ చేసి సామాజిక మధ్యమాల్లో పోస్టు చేశాడు.

మారణాయుధాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పోస్టు చేసిన పాత నేరస్థుడు కైంచీ సలీం అనే యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక యువకుడు కత్తులు, డాగర్లతో ప్రదర్శన చేస్తూ వీడియో పెట్టాడు.

**ఈ సెక్షన్ల(బీఎన్ఎస్) ప్రకారం..**

196 : వర్గ విభేదాలు సృష్టించటం

353 : పరువుకు భంగం కలిగించటం, అవమానపర్చటం

78 : మహిళలను కించపర్చడం

66–డి ఐటీ యాక్ట్ : సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయటం

ఈ ఏడాది నమోదైన కేసులు : 53

**నిజానిజాలు తెలుసుకోవాలి**

ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ ఆదిలాబాద్ సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేసినా, వర్గ, మత విభేదాలు సృష్టించేలా పోస్టులు చేసినా.. బాధ్యులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. గ్రూపుల్లో వచ్చే సమాచారం ఏదైనా నిజానిజాలు తెలుసుకోవాలి. తప్పుడు పోస్టులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

# ప్రణాళికతో.. పట్టిందల్లా 'ఉద్యోగమే'



ఆదిలాబాద్: ఒక ప్రభుత్వ ఉద్యోగం రావడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో.. వీరు పట్టిందల్లా బంగారం అన్నట్లు.. పరీక్షలు రాస్తే చాలు కొలువు కొడుతూ సత్తా చాటారు. ఒకటి, రెండు కాదు ఏకంగా మూడు, నాలుగు ఉద్యోగాలు సాధించారు.. ఆ విజయాల వెనుక నిరంతర శ్రమ.. కఠిన సాధన.. తపన ఉంది. వేలమంది పరీక్షలు రాస్తే అందులో కొంతమంది మాత్రమే వరుస ఉద్యోగాలను పొంది ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఎలా సాధించారు..? ఏం చదివారు..? రూపొందించుకున్న ప్రణాళిక తదితరాలపై 'విజేతల అంతరంగమిది..'

**సోషల్ మీడియాకు దూరం..**

ఉట్నూరు మండలం పెర్కగూడకు చెందిన మహేశ్ వరుసగా నాలుగు ఉద్యోగాలు సాధించారు.. ముందుగా పోలీస్, తర్వాత ఫైర్‌మెన్ ఉద్యోగాలు పొందారు. అనంతరం ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి ఉన్నత ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాత్రి 11 గంటల తెల్లవారుజాము వరకు పుస్తకాలతో కుస్తీ పట్టారు. గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం, తాజాగా గ్రూప్–2 ఫలితాల్లో ఎంపీవో ఉద్యోగం సాధించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్, టీవీ, సినిమాలకు దూరంగా ఉండటం, సిలబస్‌కు తగ్గట్లు నోట్స్ ప్రిపేర్ చేసుకోవడం తన విజయానికి కారణమని ఆయన అన్నారు..

**మార్గదర్శకత్వం అవసరమే**

అనుభవజ్ఞులైన వ్యక్తుల నుంచి మార్గదర్శకత్వం పొందడం అవసరమే.. నా విషయంలో మా వారు ఇచ్చిన ప్రోత్సాహం, సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని వరుస ఉద్యోగాలకు అర్హతలను సాధిస్తూ, తాజాగా ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం పొందిన బోథ్ మండలానికి చెందిన ప్రవర్ష అన్నారు.. చదివేటప్పుడు ప్రధాన అంశాలను నోట్స్ రాసుకోవడం, గత పరీక్ష పత్రాలను విశ్లేషించుకోవడంతో ప్రశ్నల తీరును అర్థం చేసుకోవచ్చని ఆమె అన్నారు.. ప్రతి రోజు ఆరు గంటలు చదివేందుకు కేటాయించినట్లు తెలిపారు..

**మాక్ టెస్ట్‌లు.. ప్రాక్టీస్ పేపర్లు**

ఆదిలాబాద్ రవీందర్‌నగర్‌కు చెందిన సుదగణ నందిని బీటెక్ పూర్తిచేసి రెండు, మూడు ప్రైవేట్ కంపెనీల్లో వరుస ఉద్యోగాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్, గ్రూప్–3లో అర్హత పొందారు. తాజాగా గ్రూప్–2లో ఎంపీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు. మాక్ టెస్టులు, ప్రాక్టీస్ పేపర్లు సాధన చేయడంతో ప్రశ్నల తీరు అర్థం చేసుకోవచ్చు.. సమయం విలువైనదిగా భావించి ముందుగా విషయాలపై పట్టు సాధించాలని ఆమె చెబుతున్నారు. పరీక్ష హాల్‌లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా కీలకమేనని అంటున్నారు.

**ఆత్మవిశ్వాసం అవసరం..**

జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన అవినాష్ ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, అదీ తెలుగు మీడియంలో చదివారు. గ్రూప్ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన చాలా ప్రధానమని ఆయన అన్నారు. గ్రూప్–3లో అర్హత సాధించగా, తాజాగా గ్రూప్–2లోనూ ఎంపీవోగా ఉద్యోగం తెచ్చుకున్నారు. 'ఒత్తిడికి లోనుకాకుండా గమ్యానికి చేరుకునేలా నిరంతరం శ్రమించాలి.. గ్రంథాలయంలో రోజూ 12 నుంచి 14 గంటలు చదవడం ప్రారంభించాను.. స్టడీ సర్కిల్స్ పరీక్షలను రాస్తూ ప్రిపేర్ కావడంతో ఆశించిన లక్ష్యం చేరుకున్నట్లు' ఆయన వివరించారు.

# అందుబాటులోకి కీమోథెరపి సేవలు

మంచిర్యాల : జిల్లాలోని క్యాన్సర్ బాధితులకు కొంత ఉపశమనం లభించింది. ఈ వ్యాధి బారిన పడి చికిత్స కోసం దూర, ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నవారికి ప్రయోజనం చేకూరింది. మంచిర్యాల మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. వ్యాధి సోకి యాతన పడుతూ వైద్యం కోసం అవస్థలు పడుతున్న బాధితులకు చేరువైన ఈ సేవలతో కాస్త ఊరట కలిగినట్లయింది అధికారికంగా కీమోథెరపి విధానాన్ని ఎంసీహెచ్‌లో ప్రారంభించారు. ఓ బాధితురాలికి చికిత్స అందించారు.

**రెండో డోసు నుంచి ఇక్కడే..**

క్యాన్సర్ అనేక రకాలు ఉండగా నిర్ధారణ అయిన వెంటనే బాధితులను జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని క్యాన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తున్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించి ఇవ్వాల్సిన మందులు, అవసరమైన వారికి కీమోథెరపి బాధిత వ్యక్తి పరిస్థితి దృష్ట్యా మోతాదును నిర్ధారించి మొదటి డోసును అందిస్తారు. పర్యవేక్షించి ఎలాంటి సమస్యలు తలెత్తలేదంటే వారితో పాటు చికిత్స వివరాలను జిల్లా క్యాన్సర్ సెంటర్‌కు పంపిస్తారు. అనంతరం రెండో డోసు నుంచి హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే పొందవచ్చు. క్యాన్సర్ తీవ్రత ఆధారంగా కీమో మోతాదు, డోసులు అందిస్తారు. మందులకే పరిమితమైన వారు సైతం ఇక్కడే స్వీకరించవచ్చు. ఇప్పటికే అవసరమైన



మాత్రలు, సూదిమందులను కేంద్రాలకు అందజేశారు. ఈ కీమోథెరపి చికిత్సను అందించేందుకు ఇంతకుముందే జిల్లా నుంచి వైద్యులు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. జనరల్ సర్జన్ నిపుణురాలు అశ్లేషా ఈ వైద్యాన్ని అందించనున్నారు. ఈమెతో పాటు మరో అనస్తీషియా వైద్యురాలు కూడా ఈ సేవలో భాగస్వాములు కానున్నారు. జిల్లాకు చెందిన బాధితురాలికి చికిత్స అందించగా పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డితో పాటు ఆర్ఎంఓలు భీష్మ, శ్రీధర్ పర్యవేక్షించారు. ఈ వైద్యం అందుబాటులోకి రావడంతో జిల్లా బాధితులకు ఉపశమనం లభించిందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో భారీగానే బాధితులు ఉన్నారని, మొదటి కీమో అనంతరం ఇక్కడే సేవలు పొందవచ్చని చెప్పారు.

# అటకెక్కిన వినియోగం.. భవనం నిరుపయోగం


కరీంనగర్ : కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం, కిరాణ సామగ్రి మొదలైనవన్నీ ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిలో భాగంగానే కరీంనగర్ నగరవాసుల కోసం పద్మనగర్ సమీకృత మార్కెట్‌ను స్మార్ట్‌సిటీ నిధులు రూ.16.50 కోట్లతో నిర్మించి ఎనిమిది నెలల కిందట ప్రారంభించారు. వీటిల్లో అమ్ముకోవడానికి 164 స్టాళ్లను, 22 షట్టర్లను నిర్మించి లక్కీ డ్రా ద్వారా అప్పగించారు. అప్పటి నుంచి మొత్తం మంది వ్యాపారులు రాకపోవడం, అధిక శాతం మంది వ్యాపారులు ఒప్పందం చేసుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది.

**నిర్లక్ష్యమే కారణమా?**

కొనుగోలుదారులు రావడంలేదని వ్యాపారులు, వ్యాపారులు రావడంలేదని కొనుగోలుదారులు ఎవరికి వారు నిర్లక్ష్యం చూపుతున్నారు.

రాంనగర్, పద్మనగర్, మంకమ్మతోట, సప్తగిరికాలనీ, భాగ్యనగర్, విద్యానగర్, మల్కాపూర్, లక్ష్మీపూర్, చింతకుంట ప్రజలు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేసేలా విస్తృత ప్రచారం చేయాలి.

అధికారులు చర్యలు తీసుకోకపోతే భవనం పనికి రాకుండా పోతుంది.



**వసతులు కల్పించినా..**

ప్రస్తుతం సమీకృత మార్కెట్ భవనం ఖాళీగా ఉంది.

వ్యాపారుల సౌకర్యార్థం ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, నీటి వసతి, పార్కింగ్ కల్పించారు. విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో వినియోగించుకున్నా సాధారణ ఛార్జీలు భారం మాత్రం బల్దియాపైనే పడుతోంది.

కూరగాయలు విక్రయించే ఓ అయిదారుగురు వ్యాపారులు, చికెన్ వ్యాపారిరాగా గిరాకీ లేకపోవడంతో మానేశారు.

**త్వరలో తరలిస్తాం**

మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాం. వ్యాపారులు ఈ అవకాశాన్ని ఉచితంగా వినియోగించుకోవాలి. స్టాళ్లు దక్కించుకున్న వారు దుకాణాలు నిర్వహించాలి. త్వరలోనే రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులను మాంసం, చేపలు అమ్మే వారిని ఇక్కడికి తరలిస్తాం. ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# మహిళా శక్తి.. సంపద సృష్టి

పెద్దపల్లి : రుచికరమైన మిఠాయిలు, నోరూరించే పిండి వంటకాలు, నాణ్యమైన ఇంటి భోజన రుచులతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు పట్టణ ప్రజలకు ఆహ్వానం పలుకుతున్నాయి. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 'ఇందిర మహిళా శక్తి' పథకాన్ని అమలు చేస్తుండగా వీరంతా అందిపుచ్చుకుని ఆర్థికంగా రాణిస్తున్నారు. శుభకార్యాలకు వంటకాలు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**పాకశాస్త్రంలో శిక్షణ**


స్వయం సహాయక సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను క్యాంటీన్ల నిర్వహణకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో వంటల తయారీలో మెలకువలు, నైపుణ్యాలపై శిక్షణ అందించారు. సరకుల వినియోగం, నిర్వహణ, లావాదేవీలపై సందేహాలను నివృత్తి చేసి పాకశాస్త్రంలో ప్రావీణ్యం పొందేలా సిద్ధం చేశారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.2–5 లక్షలు, సంఘానికి రూ.5–20 లక్షలకు రుణాన్ని మంజూరు చేస్తూ తోడ్పాటు అందిస్తున్నారు.

**15 చోట్ల ఏర్పాటు**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో 15 చోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. బయట వంటకాల కంటే రుచి, శుచికరమైన పదార్థాలు లభించడంతో ఆర్డర్లు, ఆదాయం పెరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఉచితంగా వసతి కల్పించగా మరికొన్ని ప్రాంతాల్లో అద్దె చెల్లించాల్సి ఉండటంతో అదనపు భారమవుతోంది. వంట పాత్రలు, సరకుల కొనుగోళ్లపై రుణ మంజూరులో రాయితీ కల్పించాలని కోరుతున్నారు.

**బీడీలు చుట్టడం తప్పిందిగంగాభవాని, గంగాధర, కరీంనగర్**

రెండేళ్ల కిందట బీడీలు చుట్టి కుటుంబాన్ని పోషించాను. నెలకు రూ.3 వేలు కూడా వచ్చేది కాదు. అధికారుల తోడ్పాటుతో క్యాంటీన్ ఏర్పాటు చేశాం. అన్ని రకాల వంటకాలు చేస్తున్నాం. ఇంటి భోజనంలా ఉ



ండటంతో అందరికీ నమ్మకం పెరుగుతోంది. ప్రస్తుతం నెలకు రూ.6 వేలు సంపాదిస్తున్నాం.

**నెలకు రూ.30 వేలు భారతి, మల్లాపూర్, జగిత్యాల జిల్లా**

నాకు వంటలపై కొంత పట్టు ఉంది. సంఘం సమావేశంలో క్యాంటీన్ కోసం అనుమతి ఇచ్చారు. వంటకాల తయారీపై శిక్షణ తీసుకోవడంతో మరింత నైపుణ్యం పెరిగింది. పెళ్లిళ్లు, శుభ కార్యాలయాలకు పిండి వంటలు, భోజనం తయారు చేస్తున్నా. నెలకు రూ.30 వేల ఆదాయం వస్తోంది.

**కేరళ బృందం ప్రశంసలుకల్యాణి, పెద్దపల్లి**

కలెక్టరేట్‌లో ఇద్దరం కలిసి క్యాంటీన్ ఏర్పాటు చేశాం. ఉద్యోగులు, కార్యాలయాలకు వచ్చే ప్రజలు భోజనం, టిఫిన్లు తింటున్నారు. రోజురోజుకూ గిరాకీ పెరుగుతోంది. ఇటీవల కేరళ బృందం క్యాంటీన్‌ను సందర్శించి వంటకాల తయారీ, ఇతర వివరాలు అడిగి తెలుసుకుని ప్రశంసించారు. మా ఇద్దరితోపాటు మరో ఆరుగురికి ఇక్కడ ఉపాధి దొరికింది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

జగిత్యాల : 5

పెద్దపల్లి : 4

సిరిసిల్ల 4

కరీంనగర్ 2

## ఎంపీ తలుచుకుంటే.. పనైపోద్ది..!

మధురానగర్ : గుణదల మూడు వంతెనల ఆర్ఓబీ.. రైవస్ కాలువ, ఏలూరు కాలువ, బుడమేరుల మీదుగా గుణదల నుంచి నున్నకు సులువుగా చేరేందుకు తలపెట్టిన పై వంతెన ఇది. 2009లో శంకుస్థాపన చేసుకోగా.. కొద్దిపాటి నిర్మాణం జరిగి ఆ తర్వాత నిలిచిపోయింది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా..? అని గుణదల వాసులు ఎదురు చూస్తున్నారు. 2006లో రూ.36 కోట్ల అంచనాలతో సిద్ధం చేయగా.. తాజాగా రెట్టింపు అయింది. అయితే రైల్వేశాఖ గతిశక్తి ప్రాజెక్టు కింద పూర్తి స్థాయిలో నిర్మించేందుకు ముందుకు వచ్చింది.

**తప్పని ట్రాఫిక్ కష్టాలు**

గుణదల 1వ డివిజన్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. వేలాది నివాసాలు వస్తున్నాయి. వారంతా ఈ మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించారు. అవి ఇరుకుగా ఉండటంతో.. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. అందుకే పైవంతెనను వేగంగా పూర్తి చేస్తే ఈ కష్టాలు తీరతాయని స్థానికులు అంటున్నారు.

**చొరవ చూపితేనే పరిష్కారం**

రైల్వేశాఖ వద్ద పెండింగ్‌లో ఉండడంతో పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చొరవ చూపితేనే పనులు ప్రారంభమవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై.. నిర్మాణం పూర్తి చేసుకుని ఘనంగా ప్రారంభం చేస్తారని ఎదురు చూస్తున్నామని పేర్కొంటున్నారు. ఆ దిశగా ఎంపీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



**అన్నీ సిద్ధమైనా...**

పైవంతెన నిర్మాణానికి అన్నీ సిద్ధమయ్యాయి. నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయింది. కాలువగట్లను ఖాళీ చేయించారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు రైల్వే వద్ద పెండింగ్‌లో పడడంతో పనులు ప్రారంభం కాలేదు. కారల్‌మార్క్స్ రోడ్డులో పైవంతెన నిర్మాణమయ్యే ప్రాంతం ఇప్పుడు చెత్తకుప్పలకు కేంద్రంగా మారిపోయింది. పనికి రాని మట్టి, చెత్తను తీసుకువచ్చి పైవంతెన నిర్మాణం జరిగే ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డ్‌లా మారిపోయింది.

**రైలు గేటు పడితే అంతే..**

విజయవాడ–గుడివాడ రైలు మార్గం ఉంది. గూడ్సు రైళ్లు ఎక్కువగా వస్తుంటాయి. ఒక్కోసారి రెండు వస్తాయి. అప్పటి వరకు గేటు తీయరు. దీంతో అరగంట సేపు ఆగిపోవాల్సిందే. గేటు తీసినా ఇరువైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు క్లియర్ అయ్యేందుకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. సువర్చల, లెనిన్‌నగర్

**అరగంట ముందు బయలుదేరాలి**

పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లాలంటే వంతెనపై ఉదయం వేళ ట్రాఫిక్ నిలిచిపోతుంది. అందుకే అరగంట ముందు బయలుదేరాలి. ట్రాఫిక్ ఆగితే.. ఆ రోజు ఆలస్యమైనట్లే. వేరే వైపు వెళదామంటే.. సరైన మార్గమే లేదు. రోజూ నిలిచిపోయే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం. సుబ్బారావు, కర్మెల్‌నగర్

## పాత పనుల్లో గుట్టు.. కొత్త బిల్లుల్లో కనికట్టు

అమరావతి : పెనుగంచిప్రోలు పంచాయతీలో పాత పనులకు కొత్తగా బిల్లులు చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించారు. 2014–19 తెదేపా పాలనలో చేసిన పనులకు వైకాపా పాలనలో బిల్లులు చేసుకున్నారు. పారిశుద్ధ్య పనులు చేసే సిబ్బంది జీతాలను సైతం పక్కదారి పట్టించారు. ఈ వ్యవహారం మొత్తం స్థానిక వైకాపా నాయకులు, సిబ్బంది కుమ్మక్కై చేసినట్లు తెలుస్తోంది.

**రూ.లక్షలు మింగేశారు...**

గ్రామంలో తాగునీటి అవసరాలకు 2023–24లో కొత్త ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేసినట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.31.6లక్షలు బిల్లులు తీసుకున్నారు. పంచాయతీలో 3 ట్యాంకులు ఉండగా 20 ఏళ్ల కిందటే రెండు నిర్మించారు. 2014–19 తెదేపా పాలనలో ఒక ట్యాంకు నిర్మించారు. దానికి అప్పుడే బిల్లులు చెల్లించేశారు. మరో ట్యాంకు ఎక్కడా నిర్మించలేదు. బిల్లులు మాత్రం స్వాహా చేశారు. గ్రామంలో ఓ సీసీ రహదారి నిర్మాణం 2022లో చేపట్టినట్లు రూ.11.34లక్షలు బిల్లులు తీసుకున్నారు. వాస్తవానికి ఆ రహదారి 2014–19 తెదేపా పాలనలోనే నిర్మాణం చేపట్టారు.




మరికొన్ని పనులు చేసినట్లు రూ.22లక్షలు బిల్లులు తీసుకున్నారు.

**వైకాపా నేతల దందా..**

పంచాయతీలో మొత్తం 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.15,480 చొప్పున జీతం ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వీరిలోనే 16 మందిని హరిత రాయబారులుగా నియమించినట్లు తీర్మానం చేశారు. ఒక్కొక్కరికీ నెలకు రూ.6వేల చొప్పున రూ.96వేలు చెల్లిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి సాధారణ నిధులకు మళ్లించి అక్కడ నుంచి సొమ్ము స్వాహా చేస్తున్నారు. వైకాపా పాలనలో పంచాయతీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.50లక్షల వరకు స్వాహా చేశారు.

**ఇన్నాళ్లు ఏం చేస్తున్నారో?** వైకాపా మద్దతుదారుడైన సర్పంచి, కార్యదర్శి కలిసే నిధుల దుర్వినియోగం చేసినట్లు పంచాయతీ 14వ వార్డు సభ్యుడు ప్రవీణ్ నాయకులు, అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు కనీసం పరిశీలించకుండానే రూ.కోటికి పైగా బిల్లులు మంజూరు చేశారంటే వారికీ భారీగా ముడుపులు అందినట్లు తెలుస్తోంది. 'అక్రమాల విషయం నా దృష్టి వచ్చింది. విచారణకు ఆదేశాలిచ్చాను. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# మెప్మా.. అవినీతికి చిరునామా!



ధర్మవరం : ధర్మవరంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అవినీతి కూపంగా మారిపోయింది. గత వైకాపా ప్రభుత్వంలో కొంతమంది ఆర్పీలు (రీసోర్సు పర్సన్లు) నకిలీ సంఘాలను సృష్టించి రూ.కోట్లు రుణాలు పొంది తమ ఖాతాల్లోకి జమ చేసుకున్నారు. వీరికి కొందరు సీవోలు, బ్యాంకు సిబ్బంది అండగా నిలిచారనే విమర్శలు ఉన్నాయి. రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో సంఘాల మహిళలకు ప్రస్తుతం నోటీసులు జారీ అవుతుండటంతో చర్చనీయాంశమైంది. ఏకంగా రూ.10 కోట్ల నుంచి 11 కోట్ల వరకు అవినీతి జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మీరు రూ.15 లక్షలు రుణం పొందారు. వాటిని చెల్లించకపోతే కేసులు నమోదు చేయిస్తామని ధర్మవరంలోని సిద్దయ్యగుట్టకు చెందిన అక్కమ్మ మహిళా సంఘం సభ్యులకు ఎస్‌బీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. అవాక్కైన సభ్యులు వెంటనే మెప్మా కార్యాలయానికి చేరుకున్నారు. మేము రుణం పొందకున్నా.. బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. వివరాలను సరిచూడగా.. మీ సంఘం పేరు మీద ఇతర గ్రూపులోని మహిళలను ఏర్పాటు చేసి రుణం తీసుకున్నారని మెప్మా అధికారులు తెలిపారు. దీంతో బాధితులు డీఎస్పీకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాం**

విజయభాస్కర్, పట్టణ మెప్మా ప్రాజెక్ట్ అధికారి

నోటీసులు తీసుకుని పోలీసులను కలిశాం. మా అధికారుల సంతకాలు లేకుండా రుణాలు పొందారు. దీనిపై విచారణ చేయాలని పోలీసులు, బ్యాంకు అధికారులను కోరాం. బోగస్ సంఘాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం.

**అంతా ఆమె నడిపించింది..**

గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకురాలు స్థానిక నాయకుల అండతో శానిటేషన్ విభాగంలో ఒప్పంద కార్మికురాలిగా విధుల్లోకి చేరింది. ఆ తరువాత మెప్మాలో సీఓగా నియమితురాలై కార్యాలయాన్ని పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుంది. ఎంతగా అంటే తన అనుమతి లేకుండా ఏ ఒక్కరికి రుణం మంజూరు చేయకూడదని ఆదేశాలిచ్చింది. ఈమెకు పురపాలక శాఖలో కీలకంగా ఉన్న ఓ అధికారి అండగా నిలిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. మెప్మాలోని సంఘాలు రుణాలు తీసుకోవాలంటే బ్యాంకు కాగితాలపై సీఓ సంతకం ఉండాలి. ఇవేమీ లేకుండానే బ్యాంకు అధికారులు బోగస్ సంఘాలకు రుణాలు మంజూరు చేశారు. నెలలు గడుస్తున్న కంతులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం బ్యాంకు అధికారులు సంఘాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.

ధర్మవరం పట్టణ మెప్మా పరిధి

మహిళా సంఘాలు: 2,466

సభ్యులు: 24,660

బోగస్‌గా తేలిన సంఘాలు: 150–160

వీటి కింద పొందిన రుణాలు: రూ.10– 11 కోట్ల వరకు

# జలాల లెక్కలు తేల్చేదెవరు?



అనంతపురం : ఉమ్మడి జిల్లా వరప్రదాయినిగా భావించే హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రధాన కాలువ, ఉప కాలువల్లో నీటి ప్రవాహం పుష్కలంగా కొనసాగుతోంది. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా జలాలు దండిగా ఉన్నా అధికార యంత్రాంగం నిర్వాకం.. నిర్లక్ష్యం మూలంగా నీటి నిర్వహణ అస్తవ్యస్తంగా నడుస్తోంది. నీటి కేటాయింపుపై కార్యాచరణ ప్రణాళిక.. కాలువలపై పర్యవేక్షణ ఊసేలేదు. నీటి సీజన్ మొదలై ఐదు నెలలు గడుస్తున్నా జలవనరులు(ఎంఐ), హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టుల అధికారులు కూర్చోని చర్చించిన దాఖలాలు లేవు. ఏ కాలువకు నీరు ఎన్ని కేటాయించాలి. చెరువులు ఎలా నింపాలి, ఆయకట్టు పరిస్థితి ఏమిటీ.. వంటి అంశాల ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకోలేదు. సరికదా.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ స్థాయిలో ఈ సీజన్‌లో ఒక్క సమావేశం జరగపోవడం విచారకరం. నీరు విడుదలైన మూడు నెలల తర్వాత మొన్ననే ఐఏబీ సమావేశం నిర్వహించారు. లస్కర్ల కొరత, అద్దె వాహనాలు, నీటి కేటాయింపులపై సరైన చర్చ జరగలేదన్నది నిష్ఠూర సత్యం. వీటిపై ఏ నిర్ణయం తీసుకోలేదు.

**చెరువులకు అంతంత మాత్రమే**

హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని ఎత్తిపోసే ప్రక్రియ మూడు నెలల కిందట మొదలైంది. రెండో దశ ప్రధాన కాలువకు 10.284 టీఎంసీలు ఎత్తిపోశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 219 చెరువులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందులో అనంతలో 42, శ్రీసత్యసాయిలో 177 ప్రకారం ఉన్నాయి. గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలకు అరకొరగానే జలాలు వెళ్తున్నాయి. పుంగనూరు ఉప కాలువకు మాత్రం 219 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. మడకశిర ఉప కాలువ కింద ఏకంగా 103 చెరువులు ఉంటే.. ఇప్పటికి కేవలం రెండు మాత్రమే భర్తీ అయ్యాయి. మరో ఐదింటికి పాక్షికంగా చేరుతున్నాయి. 96 చెరువుల పరిస్థితి ఏమిటో తెలీదు. ఈ ఉప కాలువకు కేవలం 100 క్యూసెక్కుల ప్రవాహం ఉందంతే.

**ఆయకట్టుపై అశ్రద్ధ**

హెచ్చెల్సీ నీరు కణేకల్లు చెరువు ద్వారా జీబీసీ, ఎమ్పీఆర్, పీఏబీఆర్‌కు వెళ్తున్నాయి. మూడు నెలలు గడిచినా జీబీసీ ద్వారా గుత్తి ఉప కాలువకు చేరలేదు. ఎమ్పీఆర్ దక్షిణ కాలువ ద్వారా తాడిపత్రి ఉప కాలువకు వెళ్లడం గగనమైంది. సుబ్బరాయసాగర్ ద్వారా కేవలం ఐదు క్యూసెక్కులు మాత్రమే వెళ్తున్నాయి. హెచ్చెల్సీ ప్రధాన కాలువ మోపిడి రెగ్యులేటర్ వద్ద 1430 క్యూసెక్కులు చూపిస్తే.. ఎమ్పీఆర్‌లోకి 1175 క్యూసెక్కులే చేరుతున్నాయి. పీఏబీఆర్ లింకు కాలువ మొదట్లో 249 క్యూసెక్కులు నమోదైతే.. డ్యాంలోకి 150 క్యూసెక్కులు మాత్రమే చేరుతున్నాయి. ముచ్చుకోట రిజర్వాయర్‌కు 32 క్యూసెక్కులని చూపిస్తున్నా.. కనీసం పది కూడా చేరడం లేదు.

హెచ్చెల్సీ

తుంగభద్రలో కేటాయింపు : 24.068 టీఎంసీ

డ్యాంలో విడుదల : 17.187 టీఎంసీ

జిల్లా సరిహద్దుకు చేరిక : 15.489 టీఎంసీ

ప్రధాన కాలువకు ప్రవాహం : 1974 క్యూసెక్కులు

హంద్రీనీవా

శ్రీశైలం మల్యాల వద్ద ఎత్తిపోత : 21.695 టీఎంసీ

జిల్లా సరిహద్దుకు చేరిక : 19.578 టీఎంసీ

జీడిపల్లి జలాశయానికి చేరిక: 17.338 టీఎంసీ

ప్రస్తుత ప్రవాహం : 1910 క్యూసెక్కులు

**నీటి నిర్వహణ పక్కాగా చేస్తాం**

నీటి నిర్వహణ ప్రక్రియను పక్కాగా అమలు చేస్తాం. ఐఏబీ సలహా మేరకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేస్తున్నాం. ఏ కాలువకు ఎన్ని జలాలు కేటాయించాలో నివేదిక రూపొందిస్తున్నాం. ఆయకట్టుకు నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పంపిణీ చేస్తాం. ఏ సమస్య తలెత్తకుండా చూస్తున్నాం.

సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ

# తిరుచానూరులో.. అవస్థలే సదా!

తిరుచానూరు.. పద్మావతి అమ్మవారి దివ్య పుణ్యక్షేత్రం కొలువైన ప్రాంతం. తిరుమలేశుడితో సమానంగా అమ్మవారికి ఆదాయం వస్తున్నా.. అభివృద్ధిలో మాత్రం వెనుకంజే. అమ్మ దర్శనం అటుంచితే.. అక్కడి వరకు ప్రయాస పడుతూ వెళ్లాల్సిందే. ఆలయాభివృద్ధి అంతంతే కావడం ప్రధాన కారణం. తిరుమల తరహాలో తిరుచానూరును అభివృద్ధి చేస్తామన్న తితిదే అధికారుల మాటలు వాస్తవ రూపం దాల్చడం లేదు.

**వేధిస్తున్న సమస్యలివే..**

పార్కింగ్ ప్రదేశాలు సరిగా లేవు. ఏళ్లుగా వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు.

తిరుచానూరులో సరైన బస్టాండ్ లేదు. రోడ్లపైనే బస్సులు నిలపాల్సిందే. శౌచాలయాలు సమస్య తీవ్రంగా ఉంది. డిప్యూటీ ఈఓ కార్యాలయం పక్కనే ఉన్న వాటిని ఒకేసారి ఐదుగురు వినియోగించుకోలేని దుస్థితి. ఆలయానికి కొంతదూరంలో ఉన్నవాటి వినియోగం అంతంతే. ఆలయానికి వెళ్లే దారులు ఇరుగ్గా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. విస్తరణ పనులు కాగితాలకే పరిమితం. జాతీయ రహదారి నుంచి గేట్–1కు వెళ్లే మార్గం ఇరుగ్గా ఉంది. గేట్–2, 3 వద్ద చిరువ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాల ఏర్పాటుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతాన్ని ఫ్రీజోన్ చేయాలనే ప్రతిపాదన ఉంది. చరవాణులు భద్రపరిచేందుకు లాకర్లు, పాదరక్షల స్టాండ్లు అవసరం మేర లేవు.

**అక్కడికే పరిమితం..**

20 ఏళ్ల కిందట మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆలయ మాడవీధుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పట్లో నిత్యం 5 వేల మంది భక్తులు వచ్చేవారు. ఇప్పుడా సంఖ్య 25 వేలకు చేరింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై తితిదే అధికారులకు అంచనా ఉన్నా.. మౌలిక వసతుల కల్పన దిశగా చర్యలు శూన్యం.

రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా..రెండేళ్ల క్రితం అమ్మవారి పద్మ సరోవరంలో రూ.10 కోట్లతో మరమ్మతులు చేశారు. ఆ తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదు. పాలకమండలి తీర్మానం మేర రూ.20 కోట్లతో క్యూ కాంప్లెక్స్, భక్తుల వసతిగృహాలు, కల్యాణకట్ట తదితర నిర్మాణాలు చేపట్టారు. ఇవి చివరి దశలో ఆగిపోయాయి. స్థానిక గ్రామపంచాయతీకి పార్కింగ్ ఫీజు ద్వారా ఏటా రూ.5 కోట్ల ఆదాయం వస్తోంది. అయితే అభివృద్ధికి సహకారం మాత్రం అంతంతే భక్తులకు కనీసం తాగునీరు అందించలేని దుస్థితి.

## మేల్కొంటేనే మనుగడ..

అమరావతి : పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, ప్రకృతి విపత్తుల నుంచి రక్షించడంలో మడ అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. పెనుగాలులు, ముంపు, సునామీలను ఆపాలంటే మడ అడవులు దట్టంగా పెరగాలి. వీటి వల్ల జన నష్టం లేకుండా బయటపడొచ్చు. నానాటికీ ఇవి తరిగిపోతుండడంతో 380 పీపీఎం మేర కర్బన వాయువు వెలువడుతోంది. నిర్లక్ష్యం చేస్తే 2050 నాటికి 500 పీపీఎంగా నమోదయ్యే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సహజసిద్ధ రక్షణ ఛత్రం**

1977లో దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో మడ మొక్కలు బాగా పెరిగిన చోట్ల ప్రభావం కనిపించలేదు. పూర్తిగా ధ్వంసమైన ప్రాంతాల్లో ఊళ్లకు ఊళ్లను మింగేసింది. వేలల్లో మృత్యువు బారిన పడ్డారు. 2004లో సునామీ వచ్చినప్పుడు కొన్ని ప్రాంతాల్లో మడ అడవులు సహజ రక్షణ కవచంగా పనిచేశాయి.

**దెబ్బతింటున్న జీవవైవిధ్యం**

మడ అడవులు ఎన్నో జీవ జాతులకు ఆశ్రయమిస్తున్నాయి. అవిసేనియా అఫిసియానాలిస్, అవిసేనియా మరినా, అవిసేనియా అల్బా, రైజోఫోరా కాంజుగట, ఎక్సోకారియా అగళ్లోచా, వంటి వివిధ రకాల మడ మొక్కలు పెరుగుతాయి. బావురుపిల్లి, నీటికుక్కలు, సముద్రపు తాబేళ్లు, నీటి పాములు వీటిలో ఉంటాయి. సముద్రపు కాకి, కింగ్‌ఫిషర్, హనీ బీటల్, ఫ్లెమింగోలు, నైట్ హెరాన్, వంటి పక్షులు విహరిస్తుంటాయి.



**వృద్ధి అంతంతే**

కృత్తివెన్ను నుంచి బాపట్ల వరకు 19,480.60 హెక్టార్ల మేర కృష్ణా అభయారణ్యంలో మడ అడవులు విస్తరించాయి. సముద్రపు నీరు ప్రవహించకపోవడంతో చాలాచోట్ల మొక్కలు లేకుండాపోయాయి. దీని వల్ల ఇసుక మేటలు వేసింది. ఇలాంటి చోట్ల వన్యప్రాణి విభాగం అధికారులు కృత్రిమంగా పునరుద్ధరించాలి. ఇండియన్ స్టేట్ ఫారెస్ట్ రిపోర్టు 2023 నివేదిక ప్రకారం.. కృష్ణాలో విస్తీర్ణం పెరుగుదలలో కొంతమేరే వృద్ధి నమోదైంది.

**స్వచ్ఛమైన గాలి**

మడ ఆకులు అతినీలలోహిత కిరణాలను అధికంగా తీసుకుంటాయి. రోజుకు ఎకరా విస్తీర్ణంలో 3.7 పౌండ్ల మేర పర్యావరణానికి హాని చేసే కర్బన వాయువులను పీల్చుకుని స్వచ్ఛమైన గాలి అందిస్తాయి. నీ చిత్తడి నేలల్లో విడుదలయ్యే హానికరమైన మిథేన్ వాయువునూ అధికంగా పీల్చుకుంటాయి. సముద్రం, నది నీరు కలిసేచోట పెరిగే ఈ మొక్కలు ఉప్పు నీటిలోని లవణాన్ని వేర్ల ద్వారా పీల్చుకుని ఆకుపై వదులుతాయి.

**ప్రణాళికలు సిద్ధం..**

వంద హెక్టార్లలో మడ అడవులను పెంచాలనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. గతేడాది మిగిలిన 60 హెక్టార్లు, ఈఏడాది మరో 80 హెక్టార్లలో అడవులు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.

## డెల్టా వ్యవస్థ మూసివేత..!

పెనుగొండ : అధిక వర్షాలతో పంట నీటమునగడంతో తీవ్ర నిరుత్సాహానికి గురైన అన్నదాతలు 'మొంథా' తుపాన్ దూసుకొస్తుందనే సమాచారంతో ఆవేదనకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం వ్యవసాయ పంటల సంరక్షణపై దృష్టి సారించింది. కాలువ గట్లు బలహీనపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా గోదావరి నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య (మూడు) డెల్టాల పరిధిలో అన్ని పంట కాలువలకు సాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పశ్చిమ డెల్టాలో విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి ఉదయం 2 వేల క్యూసెక్కు లు విడుదల చేశారు. అధిక వర్షాలు కురుస్తుండటంతో సాయంత్రానికి కేవలం వెయ్యి క్యూసెక్కులకు పరిమితం చేశారు. ఆదివారం ఉదయం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్‌ను పూర్తిగా మూసివేశారు. ఉండి సబ్‌డివిజన్ పరిధిలోని వెంకయ్య వయ్యేరు, ఉండి పంట కాలువ, పాతవయ్యేరు కాలువల పరిధిలో వ్యవసాయ పంటలకు నీటి అవసరాలు లేకపోవడంతో నాలుగు రోజుల నుంచే కాలువలకు సరఫరాను నిలిపివేశామని ఉండి డీఈఈ సత్యనారాయణమూర్తి తెలిపారు.'

**చేరుతున్న మురుగునీరు..** ఉండి సబ్ డివిజన్ పరిధిలో 1.49 లక్షల ఆయకట్టు విస్తీర్ణముంది. ఉండి, గణపవరం, చిలకంపాడు, యండగండి, ఆకివీడు సెక్షన్ల పరిధిలోని కాలువలు మూడు రోజుల



కిందట వరకూ ఎర్ర బురదతో కన్పించాయి. వెంకయ్య వయ్యేరును పంట, మురుగు కాలువగా కూడా వినియోగిస్తున్నారు. గణపవరం, నిడమర్రు, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో డ్రెయిన్లలోని మురుగు ఈ కాలువలోకి చేరుతోంది. ఉండి పంట కాలువదీ ఇంచుమించు అదే పరిస్థితి. గణపవరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో వరి చేలల్లో నిలిచిన నీరు ఈ కాలువలోకి చేరుతోంది.

పశ్చిమ డెల్టాలో ప్రధాన పంట కాలువలు: 11

మొత్తం (లక్షల ఎకరాలు)

ఆయకట్టు: 5.29

వరి 3.60

ఆక్వా, ఇతర పంటలు: 1.69

# మల్బరీ..ఆ ఊరి ఉపాధి

చౌడేపల్లి: ఆ గ్రామంలో ఎక్కడ చూసినా మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకమే కనిపిస్తుంది. దీన్నే జీవనోపాధిగా మార్చుకున్నారు. ఆ ఊరే చౌడేపల్లె మండలం తెల్లనీళ్లపల్లె. గతంలో ఇక్కడ సంప్రదాయ పంటలు సాగు చేయగా, నష్టాలు చవిచూశారు. ఓ దశలో కొందరు మల్బరీ పండించి, పట్టుపురుగులు పెంచి అప్పుల నుంచి బయటపడ్డారు. ఇక అంతే అందరూ ఇదే బాటలో నడిచారు. మొత్తం 100 కుటుంబాలు ఉండగా.. 80 కుటుంబాలు దీన్నే నమ్ముకున్నాయి. 150 ఎకరాలలో మల్బరీ పండిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలను వినియోగించుకొని షెడ్లు నిర్మించుకుని, పట్టు పురుగులు పెంచుతున్నారు. పెట్టుబడి తక్కువ కావడంతో అందరూ దృష్టిసారించారు. ప్రతి నెలా 5 వేల కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఎంతోమంది తమ జీవితాల్లో ఈ సాగు మార్పు తీసుకొచ్చింది.

**నాలుగు దశాబ్దాలుగా..**

తెల్లనీళ్లపల్లెకు చెందిన తిమ్మారెడ్డి సంప్రదాయ పంటలు సాగు చేసేవారు. నష్టాలే మిగలడంతో 40 ఏళ్ల కిందట తొలిసారిగా 50



పట్టుగూళ్లు పెంచారు. ఆ తర్వాత ఆరెకరాలలో పండించారు. ఆదాయం రావడంతో ఆయన జీవితమే మారిపోయింది. కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు తీర్చేశారు. ఇంటిని నిర్మించుకున్నారు. బీఎస్సీ పూర్తిచేసిన ఈయన కుమారుడు తండ్రికి చేదోడుగా ఉంటున్నారు. ప్రస్తుతం 2.5 ఎకరాలలో మల్బరీ పండిస్తుండగా, 200 గూళ్లు పెంచుతున్నారు.

**నష్టాలు మిగలడంతో..**వెంకటరమణారెడ్డి.. 30 ఏళ్ల కిందటి వరకు చెరకు, వరి, వేరుసెనగ పండించారు. నష్టాలే మిగలడంతో మల్బరీ వైపు దృష్టిసారించారు. ముందుగా అరెకరంలో పండించారు. నష్టాలు తీరిపోవడంతో దీన్నే నమ్ముకున్నారు. రాయితీని సద్వినియోగం చేసుకొని షెడ్లు ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం 4 ఎకరాలలో మల్బరీ పండిస్తున్నారు. పట్టుగూళ్లను పెంచుతున్నారు.

# వాన చినుకుకో లెక్కుంది!

తెనాలి :వాన కురిసినప్పుడు ఎంత వర్షపాతం నమోదైందో... మిల్లీమీటర్లు, సెంటీమీటర్లలో రెవెన్యూ అధికారులు వివరాలు వెల్లడిస్తుంటారు. వర్షపాత స్థాయిని బట్టి సాధారణమా..అధికమా, తక్కువా అనే కీలక అంశాలను విశ్లేషిస్తారు. అసలు ఈ గణన ఎలా ఉంటుందో తెలుసా...?ప్రతి మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో వర్షపాత నమోదు సూచిక (రెయిన్ గేజ్ స్టేషన్) ఉంటుంది. అందులో పైభాగంలోని గరాటు ద్వారా లోపల ఉన్న జాడీలోకి వాన నీరు చేరుతుంది. నిర్ణీత సమయం పూర్తయ్యాక సహాయ గణాంక అధికారి ఆ జాడీని బయటకు తీసి మిల్లీమీటర్ల వంతున నమోదు కోసం



ప్రత్యేకించిన పరికరంలోకి వాననీటిని పోసి ఎంత వర్షం పడిందో నిర్ధారించి ప్రకటిస్తారు. సాధారణంగా ఉదయం 8:30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8:30 గంటల వరకు అంటే 24 గంటల పాటు గణన కోసం వాన నీటి సేకరణ ఉంటుందని తెనాలి సహాయ గణాంక అధికారి వాసుబాబు తెలిపారు. అంటే ఉదయం నుంచి నెఉదయం వరకు జరిగిన లెక్కింపును నాటి వర్షపాతంగా నమోదు చేస్తారు. తుపానులు, అల్పపీడనాలు వంటి సమయాల్లో అవసరాన్ని అనుసరించి ఈ గణన ప్రతి ఆరు గంటలకు ఒకసారి చేస్తారు. మండలాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి.. అటు నుంచి కలెక్టర్ కార్యాలయానికి ఆ వివరాలు పంపుతారు. అన్ని ప్రాంతాల నుంచి లెక్కించి సగటు వర్షపాతం వివరాలు వెల్లడిస్తారని వివరించారు.

# పల్లెల్లో.. ఆగని స్వాహా పర్వం!

పెనుగొండ : మండలం నడిపూడిలోని ఈ ప్రాంతంలో మురుగు పారుదల నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఈ పని నిమిత్తం అప్పట్లో బిల్లులు పెట్టగా కొందరి ఫిర్యాదుల మేరకు తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల మరోసారి ఇదే పనికి బిల్లు మంజూరు కోసం పంచాయతీలో తీర్మానం ఆమోదించేశారు. మరోపక్క ఇక్కడ పైపులైన్ల ఏర్పాటుకు అప్పట్లో స్థానిక నివాసితుల నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేసినట్లు గుర్తించడంతో స్థానిక వార్డు సభ్యుడు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో వైకాపాకు చెందిన ప్రజా ప్రతినిధి కుమారుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి.గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా నగదు చెల్లింపులు, తప్పుడు బిల్లులు, పన్ను వసూళ్లలో చేతివాటం వంటి వ్యవహారాలతో రూ. కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. కొన్ని చోట్ల ఇప్పటికీ ఇలాంటి వ్యవహారాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. మరోపక్క కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు బిల్లుల మంజూరు కోసం అడ్డదారులు తొక్కుతూ ఇష్టారాజ్యంగా తీర్మానాలు చేస్తున్నారు.పారిశుద్ధ్య పనులు చేయకుండానే చేసినట్లు చూపి సొమ్ము స్వాహా చేశారని, తాగునీటి పథకం నిర్వహణకు సంబంధించి సామగ్రి కొనుగోలులో చేతివాటం చూపారని, పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఖర్చులు, ఆడిట్ వివరాలను సభ్యుల దృష్టికి తీసుకురా లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెనుమంట్ర మండలం పొలమూరు పంచాయతీలో పెద్ద ఎత్తున సొమ్ము దుర్వినియోగమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి పాలకవర్గ సభ్యులకు తెలియజేయకుండా రూ.7 లక్షలను ఏడు చెక్కుల రూపంలో శానిటేషన్ సామగ్రికి చెల్లించారు. దీనికి రెండు రోజుల ముందు పాలకవర్గ సమావేశం జరిగినా ఈ అంశాన్ని ప్రస్తావించలేదు.నడిపూడిలో ఆస్తి, కుళాయి పన్నులు, కొబ్బరిచెట్ల లీజు సొమ్ము పంచాయతీకి జమ కాలేదని, ఇసుక సీనరేజీ సొమ్ము ఏమైందో తెలియడం లేదని ఉన్నతాధికారులు ఫిర్యాదులు అందాయి.

**ఆడిట్ ఓ మాయాజాలం...** పంచాయతీల్లో ఆడిట్ ఓ మాయాజాలంలా మారింది. ఏటా ఈ ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా కొన్ని పంచాయతీల్లో ఏళ్ల తరబడి జరగలేదు. ఫలితంగా లక్షలాది రూపాయలు దుర్వినియోగమైనా వెలుగుచూసే పరిస్థితి కనిపించడం లేదు.

# మున్సిపల్ పాఠశాలల్లో బోధించేవారేరీ?




హిందూపురం : హిందూపురం, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అనేక ఉర్దూ పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు ఉన్నా.. ఒక్క ఉపాధ్యాయుడితోనే నడిపిస్తున్నారు. ప్రధానంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన కుంటుపడింది. అన్ని పాఠశాలల్లో తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలఖారు నాటికి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్‌లో 90 శాతం పూర్తి చేసి ఉండాలి. అయితే అనేక పాఠశాలల్లో తెలుగు, హిందీ పాఠ్యాంశాల బోధన మొదలు కాలేదు. 6-9 తరగతులకు సంబంధించి మొదటి సెమిస్టర్ పాఠ్యాంశాలు పూర్తి చేసి, వచ్చే నెలలో ఎస్.ఎ.-1 పరీక్షలు నిర్వహించాలి. ఉపాధ్యాయుల కొరతతో వారిని పట్టించుకునేవారే లేకుండా పోయారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలకు తెలుగు, హిందీ భాషోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించడానికి అనేక అడ్డంకులు ఉన్నాయి. నిబంధనల్లో మార్పు తీసుకువచ్చి, వారికి పదోన్నతి కల్పిస్తేనే ఉపాధ్యాయుల కొరత తీరుతుంది.

1. కదిరిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో దాదాపు 1,000 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి బోధించడానికి 31 ఉపాధ్యాయుల పోస్టులు మంజూరయ్యాయి. అయితే కేవలం 13 మంది మాత్రమే ఉన్నారు. ఏకంగా 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలుగు, హిందీ బోధనకు ఒక్కరూ లేరు. ఇంత మంది విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు బోధన చేయాల్సి వస్తోంది.

2. హిందూపురంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఒకే ఒక్క తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నారు.

3. ధర్మవరంలోని సుందరయ్యనగర్ శ్రీగణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ఒక్కరు చొప్పున మాత్రమే తెలుగు, హిందీ ఉపాధ్యాయులు ఉన్నారు. మూడు వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఉంటే అన్నీ ఖాళీగానే ఉన్నాయి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం** మల్లికార్జున, హిందూపురం మున్సిపల్ కమిషనర్మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. దీంతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోస్టుల భర్తీ అవసరాన్ని పురపాలక శాఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం. ఈ ఏడాది సమస్యను అధిగమించడానికి టీచింగ్ అసిస్టెంట్లను తాత్కాలిక పద్ధతిన నియమించడానికి అనుమతి తీసుకొంటాం. ఇదే విషయమై విద్యా శాఖతో సంప్రదిస్తున్నాం.

# అనుమతులిస్తాం.. అడ్డంగా నరికేయ్!



హిందూపురం : హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండలంలో దశాబ్దాల వయసున్న రూ.లక్షలు విలువచేసే పచ్చని చెట్లపై గొడ్డలివేటు కొనసాగుతోంది. నాలుగు నెలల నుంచి కంచిసముద్రం, నాయనపల్లి, విభూతిపల్లి మరికొన్ని గ్రామాల్లో నిరంతరాయంగా ఈ చెట్ల సంహారం జరుగుతుండటంతో ఇప్పటికే దాదాపు 500 కుపైగా పెద్ద చెట్లు నరికివేతకు గురయ్యాయి.

**వెంచర్ల మోజులో..**

గ్రామాలు, రహదారుల సమీపంలో లేఅవుట్లు, వెంచర్లు వేసేందుకు రియల్టర్లు వస్తుండటంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. దీంతో రైతులు వారికి భూములు విక్రయిస్తున్నారు. అందులో నాలుగైదు దశాబ్దాల వయసున్న ఫలసాయాన్ని అందించే చింత చెట్లు ఉన్నాయి. ఈ చెట్లు లేఅవుట్లకు అడ్డమని రియల్టర్లు రైతుల ద్వారా దరఖాస్తులు చేసి అటవీ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొట్టివేస్తున్నారు.

**అడ్డగోలుగా..**అటవీ అధికారులు ఎండిపోతున్న, ప్రమాదంగా ఉన్న, ఫలసాయం అందించని మొండిచెట్ల కొట్టివేతకు అనుమతులు ఇవ్వాలి. ఒక చెట్టు నరికేస్తే దాని స్థానంలో 2002 వాల్టా (నీరుచెట్టు) చట్టం మేరకు సంబంధిత వ్యక్తి ఐదు మొక్కలు నాటాలి. ఇలా మొక్కలు నాటాడని అధికారులు పరిశీలించిన వెంటనే అనుమతులు మంజూరు చేయాలి.. కాని ఎక్కడ ఇలా చేయటం లేదు.

**ప్రజల ప్రతిఘటన**

విభూతిపల్లిలో ఓ రైతు చెట్లు కొట్టివేతకు ఇటీవల దరఖాస్తు చేసుకొంటే అటవీశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు వారు చెట్లు నరికేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.

**అవసరం ఉన్నవారికే అనుమతులు**

శ్రీనివాసరెడ్డి, అటవీరేంజ్ అధికారి, పెనుకొండ

నిజంగా అవసరం ఉన్న రైతులకు మాత్రమే చెట్లు కొట్టివేసుకునేందుకు అనుమతులు ఇస్తున్నాం. లేఅవుట్లు, వెంచర్లు ఏర్పాటు చేసుకొనేందుకు చెట్లు నరికేందుకు అనుమతులు ఇవ్వటం లేదు. రెవెన్యూశాఖ వారు రైతు భూమి అని నిర్ధారించి, చెట్టు కొట్టివేసిన స్థానంలో రెండు మొక్కలు నాటిన తర్వాతే అనుమతులు ఇస్తున్నాం. పెద్దఎత్తున చెట్లు కొట్టివేతపై విచారిస్తాం.

# ఆర్టీసీ డిస్పెన్సరీ.. ప్రయోజనకారి



తిరుపతి : ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల వైద్య పరీక్షల నిమిత్తం తిరుపతి కేంద్రీయ బస్‌స్టేషన్‌లో ఏళ్ల కిందట వైద్యారోగ్య డిస్పెన్సరీని నిర్మించారు. అది శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టారు. పనులు పూర్తవడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.**ఎంతమందికి ప్రయోజనం..:** జిల్లాలోని 11 డిపోల పరిధి, తిరుపతిలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న వారితో కలిపి సుమారు 4 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఉద్యోగులకు డిస్పెన్సరీ ఉపయోగపడుతుంది.

ఉమ్మడి చిత్తూరులోని ఉద్యోగులతో పాటు పునర్విభజనలో కలిసిన గూడూరు, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట డిపోల ఉద్యోగులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు 2 వేల మంది సేవలు పొందవచ్చు.

**సేవలు ఇలా..**ప్రస్తుత కేంద్రంలో రోజుకు సుమారు 100 మంది రోగులకు ఈసీజీతో పాటు సెమీ ఆటోమోటివ్ ఎనలైజర్ ద్వారా 30 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3 లక్షల వరకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఇవే సేవలు కొత్త కేంద్రంలో అందుతాయి. **30న సుముహూర్తం..**

నూతన డిస్పెన్సరీ ప్రారంభోత్సవానికి ఈ నెల 30న ముహూర్తం ఖరారైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులు హాజరుకానున్నారు.

**ఏమేం ఉంటాయంటే..**

అలిపిరి డిపోకు సమీపంలో ఉన్న ఆర్టీసీ స్థలంలో దీన్ని అన్ని హంగులతో నిర్మించారు. కింది అంతస్తులో పార్కింగ్, మొదటి అంతస్తులో డిస్పెన్సరీ. రెండు, మూడు అంతస్తుల్లో.. అతిథిగృహం విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, రోగుల కోసం ప్రత్యేక లిఫ్ట్.

50 మందికి పైగా వేచి ఉండేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన హాల్ ఫార్మసీ, ఓపీ కేంద్రం. ఇద్దరు వైద్యులకు వేర్వేరుగా గదులు.

నిర్మించింది: కపిలతీర్థం-అలిపిరి మార్గంలో..

విస్తీర్ణం: 1.3 ఎకరాలలో.. జీం3 భవనం

వ్యయం: రూ.3.89 కోట్లు

# ఆర్థిక సంక్షోభం.. చేయూత అవసరం

పెడన : జిల్లాలో చేనేత సహకార సొసైటీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన నిధులు నిలిచి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అప్పులు చేసి కొంత కాలం నడిపినా వాటికి వడ్డీలు చెల్లించలేక సొసైటీల్లో ఉత్పత్తిని నిలిపివేశారు. అక్కడక్కడ ఉన్నా సొసైటీ నిర్వహణకు కూడా ఆదాయం రాని పరిస్థితి నెలకొంది.

**ప్రోత్సాహం కొరవడింది**

జిల్లాలో 36 చేనేత సహకార సంఘాలు గతంలో ఒక వెలుగు వెలిగాయి. పెడన, కప్పలదొడ్డి, పోలవరం, మల్లవోలు తదితర ప్రాంతాల్లోనివి వస్త్రాల నాణ్యతలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. 80వ నంబరు చీరలకు ఆప్కోతో పాటు ప్రైవేటు షోరూంల్లోనూ ఆదరణ ఉండేది. కొన్నేళ్లుగా చేనేత సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. వైకాపా హయాంలో సంఘాలు పూర్తిగా నిర్వీర్యమయ్యా



యి. ప్రత్యేక రిబేటు కింద 20- 30 శాతం తగ్గించి విక్రయాలు చేసుకోవాలని, ఆ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని అప్పట్లో ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు రూ.14.25 కోట్ల బకాయిలు విడుదల కాలేదు. పావలా వడ్డీ, త్రిఫ్ట్ ఫండ్, యార్న్ సబ్సిడీ, మార్కెటింగ్ ఇన్‌సెన్‌టీవ్, 2018 వరకు రుణమాఫీ ఇలా మొత్తం రూ.47.15 కోట్ల వరకు చేరుకున్నాయి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

జిల్లాలో అత్యధికంగా పెడనలో చేనేత సొసైటీలు ఉన్నాయి. వీటిని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కూటమి సర్కారు దశల వారీగా అన్ని బకాయిలను చెల్లిస్తుంది. ఇప్పటికే చేనేత మంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం. త్వరలో పరిష్కారమవుతుంది.కాగిత కృష్ణ ప్రసాద్, పెడన ఎమ్మెల్యే

**ఉపాధి లేక వలసలు**


సొసైటీలు ఉపాధి కల్పించ లేని దుస్థితికి చేరడంతో కార్మికులు వలసలు వెళ్తున్నారు. కొంతమంది మాస్టర్ వీవర్ల వద్ద మంగళగిరి పట్టు చీరల ఉత్పత్తి వైపు మళ్లారు. జిల్లా మొత్తం మీద గతంలో దాదాపు 3 వేల మగ్గాలు సహకార రంగంలో ఉండగా ప్రస్తుతం 300 కూడా లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని సొసైటీలు కార్మికులకు వేతనాలు నిలిపివేశాయి. మొత్తం మీద చేనేత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సొసైటీలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక చేనేత మంత్రి సవిత పెడనలో పర్యటించి సొసైటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. త్వరలో బకాయిల విడుదలకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# ఆర్డరిస్తే చాలు... ఇంటికే కూరలు

అమరావతి : డబ్బావాలాలు.. ఈ మాట వినగానే గుర్తొచ్చేది ముంబైనే. మన గుంటూరులోనూ ఈ డబ్బావాలా సంస్కృతి విస్తరిస్తోంది. కానీ కాస్త భిన్నంగా. ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి డబ్బాలను సేకరించడం కాకుండా... ఆహార పదార్థాలను వండి డబ్బాల్లో నింపి వినియోగదారుల ఇళ్లకు చేరవేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి కృష్ణ బదిలీపై ఇటీవలే గుంటూరుకు వచ్చారు. కుటుంబాన్ని తీసుకొచ్చే అవకాశం లేకపోవడంతో భోజనానికి ఇబ్బందిగా ఉంది. వంటకు సమయం సరిపోవడం లేదు. హోటళ్లు, కర్రీ పాయింట్ల నుంచి తెచ్చుకుందామంటే నాణ్యత ఎలా ఉంటుందోనన్న సందేహం. ఓ స్నేహితుడి సలహాతో హోం మేడ్ కర్రీస్ క్యారియర్స్ నిర్వాహకులను సంప్రదించి రోజూ ఆఫీసుకెళ్లే సమయానికి కూరలు వచ్చేలా ఏర్పాటు చేసుకున్నారు. ఏటీ అగ్రహారం ప్రాంతానికి చెందిన అవినాశ్ సతీమణికి ఆరోగ్యం సరిగా లేక వంట చేయలేని పరిస్థితి. తెలిసినవారి సలహా మేరకు కర్రీస్ క్యారియర్స్‌ను ఎంచుకున్నారు. ఉదయం 8 గంటలకల్లా కావాలని చెప్పడంతో తన సమస్య పరిష్కారమైంది.

**ఈ విధానం ఎలా అంటే...**

కొన్ని కుటుంబాలు.. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యతతో ఇళ్లల్లోనే కూరలు తయారు చేస్తున్నాయి. వారు కోరుకున్న ఐటమ్స్, కోరుకున్న సమయానికి ఇంటి వద్దకే తెచ్చివ్వడం ఇందులోని ప్రత్యేకత. ఇలాంటి కుటుంబాలు కొవిడ్‌కు ముందు పదివరకే ఉ



ండగా... ఇప్పుడు 70కిపైగా సంస్థలొచ్చాయి. ఒక్కో సంస్థ పరిధిలో వంద నుంచి రెండొందలమంది వినియోగదారులున్నారు.

**ఏం కావాలో చెప్పొచ్చు..**

పప్పు, సాంబారు, రసం, పచ్చడి, తాళింపు, పెరుగుపచ్చడి... ఇలా నచ్చినవి ఎంచుకోవచ్చు. ఎన్ని ఐటమ్స్ ఎంతమందికి కావాలన్నదాన్ని బట్టి ధరలుంటాయి.నాలుగు రకాల కూరలు కావాలంటే ఒకరికి రూ.70 వసూలు చేస్తున్నారు.రూ.70, రూ.140, రూ.210, రూ.280... ఇలా ప్యాకేజీలుగా విభజించారు. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో బూరెలు, బూందీ వంటివి ఉచితంగా ఇస్తుంటారు.

**వాటికీ, వీటికీ తేడా అదే..**

స్విగ్గీ, జొమాటో ద్వారా నచ్చిన హోటళ్ల నుంచి ఆహారం రప్పించుకుంటుంటాం. కర్రీస్ క్యారియర్స్ సంస్కృతిలో మాత్రం తయారీ, తరలింపు అంతా సంబంధిత వ్యక్తులే చూసుకుంటారు. ఆర్డర్లు గణనీయంగా పెరుగుతున్నాయని కర్రీస్ క్యారియర్స్ నిర్వాహకులు విజేత, రాజేష్ తదితరులకు తెలిపారు.

# అధిక దిగుబడులతో ఆదర్శం

కోడుమూరు : ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఓ యువ రైతు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన రైతు మహేశ్వరరెడ్డి ఉత్తమ రైతుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల మన్ననలు పొందుతున్నారు. తనదైన శైలిలో వ్యవసాయం చేస్తూ జిల్లాతో పాటుగా, నియోజకవర్గంలోని ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏరువాక ఫౌండేషన్ గుంటూరు వారు కిసాన్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గత నెల 26, 27న జిల్లా తరఫున సేంద్రియ పద్ధతులతో ప్రకృతి వ్యవసాయం చేసే రైతుగా మహేశ్వరరెడ్డిని ఎంపిక చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పత్తి పంటను చేసి అధిక దిగుబడి సాధించినందుకు ఉత్తమ రైతుగా అవార్డు అందజేశారు. ఉత్తమ రైతుగా అవార్డులు అందుకున్నారు.

**మూడు ఎకరాల్లో 30 రకాలు**

మహేశ్వరరెడ్డికి కర్నూలు–బళ్లారి ప్రధాన రహదారి ఆనుకొని 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇంటి వద్దనే ఆవుపేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమన్ను, శనగపిండి, వేపనూనెతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుంటారు. ఎలాంటి రసాయనిక ఎరువులు వినియోగిం




చకుండా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్నారు. పత్తి సాగు చేసి అందులో అంతర, రక్షణ పంటలను వేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. మిర్చి, మెంతికూర, బెండ, టమాట, ఉల్లి, బీర, తోటకూర, పాలకూర, కొత్తిమీర వంటి కూరగాయలతో పాటుగా, రక్షణ పంటలుగా జొన్న, సజ్జ సాగు చేస్తున్నారు.

**సేంద్రియతో ఆరోగ్యకర పంటలు..**

సేంద్రియ పద్ధతులతో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనేది నా తపన. రైతులంతా ఈ పద్ధతులు ఉపయోగిస్తే భూమి ఆరోగ్యంతో పాటుగా చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయానికి పలువురు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వాలు రాయితీ ఇస్తున్నాయి. ఉత్పత్తులకు మార్కెటులో మంచి డిమాండు ఉంది. – మహేశ్వరరెడ్డి, రైతు

# దూదిరైతు దుఃఖం

ఎమ్మిగనూరు : ఉమ్మడి జిల్లాలో రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పత్తి రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కాయలు కుళ్లి పోతున్నాయి. తేమ అధికమై మొక్కలు చనిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 5.71 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆగస్టు మొదటి వారం వరకు పూత, కాయలతో మొక్కలు కళకళలాడాయి. ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. ఈ దశలో నేలలో తేమ ఆరకుండా వర్షాలు కురవడంతో పోషకాలను మొక్క వేరు వ్యవస్థ గ్రహించలేక ఆకులు, పూత, కాత రాలిపోయింది. కాయలు కుళ్లి నల్లగా మారాయి.

**అన్నదాతకు రూ.300 కోట్ల నష్టం**లక్ష ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. ఎకరానికి రూ.30వేల పెట్టుబడి పెట్టారు. ఈ లెక్కన రూ.300 కోట్ల మేర నష్టపోయారు. మిగతా పత్తి పంటలోనూ పెట్టుబడి చేతికి రావడం కష్టంగా మారింది. మే నెలలో నీటి వసతి కింద



వేసుకున్న రైతులకు ఎకరానికి ఆరేడు క్వింటాళ్ల దిగుబడి చేతికొచ్చింది. జూన్ రెండో వారం నాటిన పత్తి దిగుబడి అరకొరగా వచ్చినా రంగు మారింది. మార్కెట్‌కు తీసుకెళ్తే క్వింటా రూ.నాలుగైదు వేలకు అమ్ముడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు ఎకరాల్లో దెబ్బతింది**

నాలుగు ఎకరాలు సొంత పొలం, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని ఎనిమిది ఎకరాల్లో పత్తి వేశా. రెండు నెలలుగా కురుస్తున్న వానలకు నాలుగు ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. మిగిలిన పత్తి కూడా అంతంత మాత్రమే ఉంది. రూ.2 లక్షల పెట్టుబడి పెట్టా. ఈసారి పెట్టుబడి చేతికందని పరిస్థితి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.పి. పెద్దిరాజు, పొనకలదిన్నె

# జీఎస్టీ తగ్గినా ధరలు తగ్గలే!

ఒంగోలు : జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా పన్నుల వ్యవస్థను మరింత సులభ తరంగా, పారదర్శకంగా చేస్తూ గత నెల 22వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం సుమారు 375 వస్తువులపై జీఎస్టీని తగ్గిస్తూ వాటిని తక్షణమే అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. దుకాణాల వద్ద తగ్గిన ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించింది.




నిత్యావసర సరకులపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తెచ్చినా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. కొనుగోలుదారులు ప్రశ్నిస్తే స్టాక్ అయిపోయే వరకు పాత ధరలే కొనసాగుతాయని, కొత్త స్టాక్ వచ్చాకే కొత్త ధరలు వర్తిస్తాయని దుకాణదారులు చెబుతుండడం గమనార్హం. దీంతో వినియోగదారులు చేసేదిలేక వ్యాపారులు చెప్పిన ధరలకే సరకులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో షాపింగ్‌మాల్స్, వెహికల్ షోరూంలు మినహాయిస్తే ఎక్కడా కూడా తగ్గిన ధరలతో బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. వ్యాపారులు కొనుగోలుదారులకు పాత ధరలకే వస్తువులు, సరకులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో జీఎస్టీ ఫలాలు సామాన్యులకు అందని పరిస్థితి నెలకొంది. **తగ్గిన ధరలకే విక్రయించాలి –సత్యప్రకాష్, డీసీ, వాణిజ్య పన్నులశాఖ** అన్ని దుకాణాల్లో తగ్గిన ధరలతోతప్పనిసరిగా బోర్డులను ఏర్పాటు చేయాలి.

# అభివృద్ధి.. శిలాఫలకాలకే పరిమితం



గుంతకల్లు : గత ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.కోట్లతో పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. దీనికి తోడు నిర్మాణాల అంచనా వ్యయం రెట్టింపవుతోంది.దీంతో అప్పటి వరకు ఖర్చు చేసిన నిధులన్నీ వృథా అవుతున్నాయి. గుంతకల్లు, గుత్తి పట్టణాల్లో ఇలాంటి ఎన్నో కట్టడాలు ఎందుకూ పనికి రాకుండాపోతున్నాయి. ఈరెండు ప్రాంతాల్లో రూ.89.69 కోట్ల విలువ గల పనులు ఆగిపోయాయి.

**ముందుకు సాగని పనులు**

అభివృద్ధి పనులను చేయడానికి గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేయండంతో అధికారులు టెండర్లను కూడా నిర్వహించారు. అప్పట్లో నాయకులు భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికీ అతీగతీ లేదు.

గుంతకల్లులో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకం కింద మురుగు కాలువలు, రోడ్లు తదితర 160 వరకు పనులను చేయడానికి టెండర్లు నిర్వహించారు. ఆతరువాత పెండింగ్‌లో ఉంచారు. షాపింగ్ గదుల నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థానలు చేశారు.

గతంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మూడు గార్బేజ్ కలెక్షన్ కేంద్రాలు, ధర్మవరం రోడ్డు రైల్వేగేట్ వద్ద రోడ్డు అండర్ వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజలు చేశారు.

కసాపురంలో ప్రధాన మురుగు కాలువ పనులకు ఈయనే మొదలుపెట్టారు. హంద్రీనీవా కాలువకు రాగులపాడు వద్ద తూమును ఏర్పాటు చేసి కాలువను తవ్వి చెరువులకు నీటిని అందించడానికి చెందిన పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

గుత్తిలో మున్సిపల్ కార్యాలయానికి సొంత భవాలను నిర్మించడానికి సంబంధించి అప్పటి ఎంపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జంతేంద్రగౌడ్ శంకుస్థాపన చేశారు. కరడికొండ వద్ద టూరిజం కాంప్లెక్స్ ఏర్పాటుకు అప్పటి పార్లమెంట్ సభ్యుడు కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఆయా పనులు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

**ప్రభుత్వానికి నివేదించాం..** – నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్గతంలో గుంతకల్లులో భూమి పూజలు, శంకుస్థాపనలు జరిగిన పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. షాపింగ్ గదుల నిర్మాణాన్ని గుడ్‌విల్ పద్ధతిలో చేయడానికి అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. మిగిలిన పథకాలకు నిధులను విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

# అనాలోచిత నిర్మాణం.. ప్రమాదాలే నిత్యం!



ముదిగుబ్బ : జాతీయ రహదారులు, బైపాస్ నిర్మాణాలు జరిగితే ట్రాఫిక్ తగ్గడంతోపాటు గమ్యస్థానానికి వేగంగా చేరుకోవచ్చు. కానీ రహదారి విస్తరణ సమయంలో అనాలోచిత నిర్మాణాల ఫలితంగా వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించారు. తర్వాత ముదిగుబ్బ బైపాస్ నిర్మాణం పూర్తయింది. ఈ రెండింటిని కలిపే రోడ్డు జంక్షన్‌గా మారింది. కుడి, ఎడమవైపు వెళ్లేందుకు తికమకపడేలా జంక్షన్ నిర్మించడంతో వాహనదారులు ఇక్కట్లు అధికమవుతున్నాయి. ప్రధానంగా బైపాస్ నుంచి బత్తలపల్లి వైపు వెళ్లే వాహనదారులు జంక్షన్‌లో జాతీయ రహదారిలో వ్యతిరేక దిశగా వెళ్తున్నారు. ఎడమవైపునకు తిరిగేందుకు మలుపు లేకపోవడంతో కిలోమీటర్ మేర తప్పుదారిలో వెళ్లి ఎడమవైపు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

**ఒంపులుగా డివైడర్లు..**ముదిగుబ్బ నుంచి బత్తలపల్లి వరకు ఉన్న 42వ జాతీయ రహదారిలో సంకేపల్లిక్రాస్, కృష్ణాపురంక్రాస్, రామాపురం, కోడేకండ్ల, జ్వాలాపురం గ్రామాలకు వెళ్లే అప్రోచ్‌రోడ్డు వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బత్తలపల్లి నుంచి అనంతపురానికి వెళ్లే 42వ జాతీయ రహదారి, బైపాస్ కలిసే జంక్షన్‌లోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో బత్తలపల్లి బైపాస్‌లో మలుపు తిరిగే సమయంలో పెద్ద వాహనాలు డివైడర్‌ను ఢీకొంటున్నాయి. ఒకేసారి కనీసం రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో బస్సులు, లారీలు వెళ్లే సమయంలో ఇతర వాహనాలు నిలుపుకోవాల్సి వస్తోంది. రోడ్డు వెడల్పు చేసి నిర్మించి ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండేది కాదని వాహనదారులు వాపోతున్నారు.

**నివారణ చర్యలు చేపడతాం..**– సుజిత, జేఈ, ఎన్‌హెచ్ 42

ముదిగుబ్బలోని బైపాస్ జంక్షన్‌లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్లు నా దృష్టికి రావడంతో డివైడర్లను ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణంలో మార్పుచేసేలా చూస్తాం. బత్తలపల్లి బైపాస్ జంక్షన్‌ను పరిశీలించి రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకుంటాం.

# ప్రకృతి.. వరిప్రదాయిని



పుంగనూరు: రైతు రామనాథం స్వగ్రామం గట్టువారిపల్లె. మూడేళ్ల కిందట సాధారణ పద్ధతిలో వరి సాగుకు రూ.38 వేలు ఖర్చు చేస్తే రూ.20 వేలు మాత్రమే వచ్చింది. గతేడాది ప్రకృతి సేద్యం విధానంలో పండించగా రూ.5 వేలు పెట్టుబడి కాగా రూ.23 వేలు మిగిలింది. రైతులారా... రామనాథంలా అందరం చేద్దామా.

ఘన జీవామృతం: 500 కిలోలకు 500 కిలోల పేడ, 50 లీటర్ల గోమూత్రం, బెల్లం 10 కిలోలు, పుట్ట మట్టి రెండు కిలోలు, పప్పుల పిండి 10కిలోలు అవసరం. ఇవన్నీ అయిదు రోజులు మగ్గపెట్టాలి.

జీవామృతం: 200 లీటర్లకు గోమూత్రం 10 లీటర్లు, పప్పుల పిండి 10 కిలోలు, బెల్లం రెండు కిలోలు 5 రోజులు మురగబెట్టాలి.

వేప కషాయం: 40 లీటర్ల తయారీకి నాలుగు కిలోల వేపగింజలు రెండు కిలోల కుంకుడు కాయలు, 10 లీటర్ల గోమూత్రం కలిపి ఐదు రోజులు ఉంచాలి.

**ఎంత అవసరం**

ఎకరా వరిసాగుకు ఎరువుగా 400 కిలోల ఘన జీవామృతం, 40 లీటర్ల జీవామృతం, 40 లీటర్ల వేప కషాయం 400 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.మామిడి తోటకు 1500 కిలోల ఘన జీవామృతం, 80 లీటర్ల జీవామృతం, వేప కషాయం 40 లీటర్లు అవసరం.

ఈ ఏడాది ప్రకృతి సేద్యం లక్ష్యం : 65,283
ఎకరాలు రైతులు : 46,802
ఇప్పటి వరకు సాగు :34,633
అనురించిన రైతులు :35,201

# పైసలే వసూలు.. టిక్కెట్లు ఇవ్వరు

కుప్పం : ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతం కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కనే నగరవనాన్ని తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.2 కోట్లతో అభివృద్ధి చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను ఏర్పాటుచేశారు. ఈ పార్కును అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలతో పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ప్రవేశ రుసుంగా నిర్ధారించి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, టిక్కెట్ల విక్రయాల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదునుగా తాత్కాలిక సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారంపై పరిశీలించింది. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరుకు చెందిన సుమారు 10 మంది మహిళలకు సంబంధించిన రూ.20 టిక్కెట్లను పార్కు తాత్కాలిక సిబ్బంది వాపసు తీసుకొంటూ కనిపించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే, టిక్కెట్లు అయిపోయాయని, వేరే వారికి ఇచ్చేందుకు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. కుప్పం పట్టణానికి చెందిన ఓ కుటుంబం పార్కుకు వచ్చారు. వారి నుంచి రూ.150 వసూలు చేసి, టిక్కెట్లు ఇవ్వలేదు. ఈ విషయమై స్థానిక అటవీ క్షేత్రాధికారి జయశంకర్‌ను వివరణ కోరగా.. 5 వేల టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని, గోల్‌మాల్ విషయమై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో యంత్రం ద్వారా టిక్కెట్లు జారీ చేస్తామని చెప్పారు.

# అక్రమార్కులకు వంతపాట.. అన్నదాతలకు గుండెకోత!


కనిగిరి : గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి పాలకులు, నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారం సాగింది. ఫలానా భూమి తమకు కావాలంటే చాలు నాటి అధికారులు వారికి అన్ని విధాలా సహకరించారు. అసైన్డ్, వాగుపోరంబోకు, పశువుల బీడు.. ఇలా కనిపించిన భూములన్నింటినీ ఆక్రమించేశారు. ఇదే కోవలో సీఎస్‌పురం మండలం రేగులచెలకలోనూ భూఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వైకాపా నేతల పేరిట రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను అప్పటి రెవెన్యూశాఖాధికారులు ఆన్‌లైన్ చేసేశారు. ఇదేమిటని రైతులు అడిగిన పాపానికి రెవెన్యూ గ్రామంలోని భూములన్నింటినీ వివాదాస్పద భూముల కింద చేర్చేశారు. ఫలితంగా రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రేగులచెలక రెవెన్యూ గ్రామ పరిధిలో రైతులకు సంబంధించి 951 సర్వే సంఖ్యలున్నాయి. వీటి పరిధిలో 3,532 ఎకరాల రైతుల పట్టా భూములున్నాయి. వీటి సమీపంలోనే ప్రభుత్వ, పశువుల బీడు భూములున్నాయి. ఇతర గ్రామాలకు చెందిన వైకాపా నాయకులు తమ పేరిట రెవెన్యూశాఖాధికారుల సాయంతో 2022లో 300 ఎకరాలను అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు.



విషయం తెలుసుకున్న రైతులు 2023లో తమ గ్రామంలోని భూములను ఇతర ప్రాంతాలకు చెందిన వైకాపా నాయకులు ఆక్రమించారని కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నారా లోకేశ్‌కు సైతం సమస్యను వివరించారు. చివరకు అప్పటి గవర్నర్‌కు సైతం పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి భూఆక్రమణలు నిజమేనని తేల్చడంతోపాటు తహసీల్దారును సస్పెండ్ చేశారు. ఆక్రమిత ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుని వాటిని మాత్రమే వివాదాస్పద జాబితాలో పెట్టాల్సి ఉండగా, రెవెన్యూ గ్రామంలోని భూములన్నింటినీ వివాదాస్పద భూములుగా చేర్చడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 1బీలు రాక.. పథకాలకు దూరం.. రెవెన్యూశాఖాధికారులు చేసిన తప్పిదానికి గ్రామంలోని రైతుల భూములకు సంబంధించి 1బీ పత్రాలు రావడం లేదు. అన్నదాత సుఖీభవ, రాయితీ ఎరువులు, వ్యవసాయ పరికరాలు, పంట రుణాలు అందడం లేదు. ప్రభుత్వ పథకాలు రావాలంటే అడంగల్ కావాలని అధికారులు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. కనిగిరిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# రామా.. ఆక్రమణలు కనుమా!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లెలోని పురాతన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటిని స్వాదీనం చేసుకుని ఆలయం పేరిట పట్టా దారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని గ్రామస్థులు, భక్తులు ఏడాదిగా విన్నవిస్తున్నా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. రెవెన్యూ లెక్కల ప్రకారం స్వామివారికి 21 ఎకరాల భూములున్నాయి. గోళ్లవిడిపి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే సంఖ్య 877లో పదెకరాలు, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే సంఖ్య 4–2లో 10.12 ఎకరాలు, సర్వే సంఖ్య 66–1లో 22 సెంట్ల భూమి ఉంది. రెవెన్యూ దస్త్రాల్లో స్వామి పేరిట ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎల్ఆర్ నమోదై ఉన్నాయి. పురాతన ఆలయాల వివరాలు, వాటి ఆస్తులను సంరక్షించాల్సిన దేవాదాయశాఖ అధికారుల వద్ద మాత్రం వీటి వివరాల్లేకపోవడం గమనార్హం.ఆలయ భూముల్లో రామచంద్రాపురం తాలూకాలోని భూములు ఆక్రమణలకు గురయ్యాయి. పరిసర ప్రాంతాల్లోని కొందరు రైతులు భూములను ఆన్‌లైన్ సైతం చేయించుకున్నారు. భూముల వివరాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏడాది కిందట దేవాదాయశాఖ అధికారులకు అందించారు. ఆక్రమణలు తొలగించి ఆలయం పేరిట వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించాలని ఫిర్యాదు చేశారు.



ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలో చేర్చి భూముల వేలం నిర్వహించి ఆదాయాన్ని ఆలయ నిర్వహణకు వినియోగించాలని విన్నవించారు. గతేడాది మార్కాపురం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వచ్చి పరిశీలించి వెళ్లారు. ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# చెల్లింపులు కొరవడి.. ఆయుష్మాన్ తడబడి

కంభం : గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జిల్లాలో చేపట్టిన హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడంలేదు. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో వారు మధ్యలోనే వదిలేస్తున్నారు. దీంతో వాటిల్లో పనిచేసే సిబ్బంది, సేవలకు వచ్చే పల్లె వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా..

జాతీయ ఆరోగ్య విధానంలో భాగంగా కేంద్రం ఐదేళ్ల కిందట 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వైకాపా పాలనలో నిర్మాణ పనులు సక్రమంగా చేయలేదు. కూటమి ప్రభుత్వం నిర్మాణాలను పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి జిల్లాలో మంజూరైన హెల్త్ క్లినిక్‌లు : 492
నిర్మాణాలు ప్రారంభించినవి : 418
బేస్‌మెంట్, ఆపైన స్థాయి వరకూ నిర్మించినవి : 367
బేస్‌మెంట్ దిగువన ఉన్నవి : 125
ప్రారంభానికి నోచుకోనివి : 74
ఒక్కో నిర్మాణానికి సగటు అంచనా : రూ.20.08 లక్షలు
మొత్తం అంచనా వ్యయం : రూ.99 కోట్లు

మొత్తం 14 రకాల వైద్య సేవలు, గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయం కేంద్రంగా 14 రకాల వైద్య సేవలందిస్తున్నారు. వాటిలో జనరల్ ఓపీ, ఈఎన్‌టీ, మధుమేహం, బీపీ, హెచ్ఐవీ, హెచ్‌బీ, ప్రాథమిక చికిత్స తదితర సేవలున్నాయి. అంతేకాదు గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఇక్కడ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎంఎల్‌హెచ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త అందుబాటులో ఉంటారు. ఈ నేపథ్యంలో అసంపూర్తి గ్రామీణ వైద్యశాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్ తెలిపారు.

# ఎగరేద్దాం.. ఎదిగేద్దాం

తిరుపతి : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీకి ప్రతిష్ఠాత్మకమైన డ్రోన్ టెక్నాలజీ శిక్షణ కేంద్రం మంజూరైంది. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తొలుత ఎస్వీయూలో 10వ తరగతి పాసైనవారికి పది రోజులపాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు వర్సిటీలో రెండెకరాల పది సెంట్లు భూమిని, ఓ భవనాన్ని కేటాయించారు. గత నెల 12న డీజీసీఏ, పీఆర్టీవో బృంద సభ్యులు వచ్చి సాధ్యాసాధ్యాలను పరిశీలించి.. ఆమోదం తెలిపారు.
త్వరలో డిప్లమో కోర్సు: ప్రస్తుతానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు, బయటి వారికి తాత్కాలికంగా శిక్షణ ఇస్తున్నారు. రానున్న రోజుల్లో డిప్లమో



కోర్సును ప్రవేశపెట్టేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి, విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
రాష్ట్రంలో రెండోది: విజయవాడలో డ్రోన్‌పై అధికారిక శిక్షణ కేంద్రం ఉంది. దాని తరువాత తిరుపతిలోనే ఏర్పాటు చేస్తున్నారు. దీనికి డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అనుమతులొచ్చాయి. పీఆర్టీవో (రిమోట్ పైలెట్ ట్రెయినింగ్ ఆర్గనైజేషన్)తో కలిసి ఎస్వీయూ శిక్షణ ఇస్తుంది. అనంతరం సర్టిఫికెట్‌తోపాటు ఒక గుర్తింపు నంబర్ ఇస్తారు. అప్పుడు డ్రోన్ ద్వారా చిత్రీకరించే అంశాలకకు అధికారక ముద్ర ఉంటుంది. ఇందుకు ఐదు సంస్థలు ముందుకొచ్చాయని వీసీ ఆచార్య అప్పారావుకు తెలిపారు.

# ధన దాహం.. వన హననం

రాజమహేంద్రవరం : చెట్లకు డబ్బులు కాస్తాయా అంటే.. అన్ని చెట్లూ ఏమో కానీ 50 ఏళ్లకు పైబడిన మర్రి, రావి వృక్షాలకు మాత్రం డబ్బులు కాస్తున్నాయనే చెప్పాలి. ఏళ్లనాటి చెట్లు వ్యాపార వస్తువులుగా మారిపోయాయి. జాతీయ, ర.భ.శాఖ రహదారులు పక్కన ఉన్నవి, మైదానాల్లో, గ్రామ కూడళ్లు, నిర్మానుష్య ప్రాంతాల్లోని చెట్లను నరికి, వాటిని వేరే ప్రాంతాలకు తరలించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర అటవీశాఖ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు.

**బృందాలుగా..**
ఓ బృందం గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తారు. ఎక్కడెక్కడ ఏళ్లనాటి చెట్లు ఉన్నాయో గుర్తించి సదరు వ్యాపారులకు సమాచారం ఇస్తారు. అందుకోసం వారికి కొంత మొత్తం ఇస్తారు. వేరే బృందం ఆ వృక్షాల యజమానులు లేదా సంబంధిత వ్యక్తులకు కొంత డబ్బు ఇచ్చి కొంటుంది. ఆపై కొమ్మలు నరికి కాండాలను రాజమహేంద్రవరం సమీపంలోని ఓ ప్రాంతానికి తరలిస్తారు. అక్కడ వాటికి రసాయనాలు పూసి తిరిగి చిగురింపజేస్తారు. ఆ తర్వాత రూ.లక్షలకు విక్రయిస్తారు. ఈ మొత్తం ఆయా వ్యాపారుల కనుసన్నల్లోనే జరుగుతుంది.

**నయా దందా..**
గొల్లప్రోలు మండలం చెందుర్తి నుంచి ఓ మర్రిచెట్టును తూర్పుగోదావరి జిల్లాలోని ఓ గ్రామానికి తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం రావడంతో తనిఖీ చేసి, రాజానగరం వద్ద పట్టుకున్నారు. విచారణలో విస్తుపోయే విషయాలు తెలిశాయి. ఆపై చెట్టును రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ వారితో సంప్రదించి, మహా పుష్కరవనానికి తరలించారు.
**పదిరెట్ల లాభానికి** వృక్షాలను గుర్తించడం, తరలించడం, తిరిగి వాటిని పునరుజ్జీవింపజేసేందుకు రూ.70వేల నుంచి రూ.80వేల వరకు అవుతుంది. ఆ తర్వాత వాటిని వయసును బట్టి రూ.7లక్షల నుంచి రూ.8లక్షల వరకు విక్రయిస్తారు. రాజమహేంద్రవరం సమీపంలోని ఓ ప్రాంతంలో ఇలాంటివి 70 నుంచి 80 చెట్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన రూ.కోట్లలో ఆదాయం పొందుతున్నారు.

**గుజరాత్‌లో డిమాండ్..**
తెలుగు రాష్ట్రాల్లో బోన్సాయ్ మొక్కలకు మంచి డిమాండ్ ఉంది. రకాన్ని బట్టి రూ.వేలు, రూ.లక్షలు పెట్టి కొంటారు. గుజరాత్‌లో పాత వృక్షాలకు మంచి గిరాకీ ఉంది. ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**జిల్లాలో తనిఖీలు పెంచుతాం..**
పాత చెట్లను నరికేందుకు ప్రభుత్వ నిబంధనలు అంగీకరించవు. వీటిని తరలిస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదు. ప్రజా ప్రయోజనాల కోసం చేయాల్సిన పనులకు అనుమతులు తీసుకోవాలి. దీనిపై ఫిర్యాదులు వచ్చాయి. స్వాధీనం చేసుకున్నవి రోటరీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తున్నాం. తనిఖీలు పెంచుతాం. ప్రభాకరరావు, డీఎఫ్‌వో

# రహదారులకు పుష్కర శోభ

రాజమహేంద్రవరం : రానున్న పుష్కరాల నేపథ్యంలో ఆతిథ్య నగరం రాజమహేంద్రవరంలో రహదారులకు మహర్దశ పట్టనుంది. నగరంలో ప్రవేశించే, ఇతర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం వచ్చే వాహనాలను అంచనా వేస్తూ రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సిటీ ప్లానర్ నేతృత్వంలో అసిస్టెంటు సిటీ ప్లానర్లను కలిపి 17 మందితో బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అదనంగా నలుగురు సర్వేయర్లను నియమించింది. వీరంతా గోదావరి ఘాట్‌లు, ఆనుకొని ఉన్న రహదారులపై అంచనాలు రూపొందించారు.

**ఇలా గుర్తించారు..**
ఇప్పటికే ప్రత్యేక బృందం అధ్యయనం చేసి అర్బన్ పరిధిలో ఘాట్‌లను ఆనుకొని 30 కి.మీ మేర 25 రహదారులను 60 నుంచి 80 అడుగుల వెడల్పున విస్తరించాల్సి ఉందని అంచనాకు వచ్చింది. పుష్కర స్నానాల కోసం 17 ఘాట్‌లను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ధవళేశ్వరం నుంచి కాతేరు వరకు వీటిని సిద్ధం చేస్తున్నారు. గత పుష్కరాలకు సుమారు 3 కోట్ల మంది భక్తులు రాగా, ఈ సారి 8 కోట్ల మంది వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు. రోడ్డు మార్గం ద్వారానే ఎక్కువగా రావడానికి ఆస్కారం ఉంది. దీంతో నగరం చుట్టుపక్కల 10 కి.మీ మేర కూడా ఈ రోడ్లన్నీ రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేస్తారు.

**కన్సల్టెన్సీకి బాధ్యతలు..**
రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతోపాటు, పుష్కరాల రద్దీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అంచనాలు వేస్తున్నారు. వాహనాలను నగరంలో అనుమతించే క్రమంలో వారంతా ఘాట్‌ల వద్దకు చేరుకొనేందుకు చేపట్టాల్సిన పనులపై ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. రోడ్డు మార్గాలను అనుసంధానం చేయడం, నేరుగా ఘాట్‌ల వరకు వెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించడం వీరి బాధ్యత. దీనిపై మూడు బృందాలు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ముంచేందుకు సిద్ధమయ్యారు!



అనంతపురం: అమాయకులైన పేదలను మళ్లీ ముంచేందుకు కొందరు అక్రమార్కులు సిద్ధమయ్యారు. అనంత శివారులోని పండమేరు వంక పోరంబోకు స్థలాలను అమాంతం మింగేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం నగరానికి వలస వచ్చిన పేదలను లక్ష్యంగా చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. గతేడాది వరదల సమయంలో పూర్తిగా మునిగిపోయిన స్థలాల్లో మళ్లీ గుడిసెలు ఏర్పాటు చేశారు. కొద్దికొద్దిగా స్థలాన్ని ఆక్రమించి.. విక్రయించడానికి ఎత్తుగడలు వేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకునే ఇదంతా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆర్డీటీ స్టేడియం ముందు నుంచి ఉప్పరపల్లి వరకు వంక ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు.

**నకిలీ పట్టాలతో బురిడీ**
ఉప్పరపల్లికి చెందిన కొందరు వందల సంఖ్యలో నకిలీ పట్టాలు సృష్టించారు. స్టాంపులు, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నారు. ఒక్కో పట్టాను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. ఇటీవలే అనంతపురం గ్రామీణ పోలీసులు నకిలీ పట్టాలు సృష్టించిన కొందరిని అరెస్టు చేశారు. వంకకు రెండువైపులా ఉన్న ఖాళీ స్థలాలకు సర్వే నంబర్లు వేసి నకిలీ పట్టాలు అంటగడుతున్నారు. ఈ అంశంపై అనంత జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో విచారించి ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు.

**గత అనుభవం పట్టదా?**
వైకాపా హయాంలోనూ కొందరు స్థానిక నాయకులు పండమేరు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి పేదలతో గుడిసెలు ఏర్పాటు చేయించారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షల్లో దండుకున్నారు. గతేడాది నవంబరులో ఆకస్మిక వరదలు పండమేరును ముంచెత్తడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారు. వంకకు అవతలివైపు ఉన్న జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు మునిగిపోయాయి.
ఇప్పుడు సదరు స్థానిక నాయకులు దందా మొదలుపెట్టారు. ముంపు ప్రాంతంలోనే మళ్లీ గుడిసెలు ఏర్పాటు చేయించి స్థలాలు ఇస్తామంటూ బేరాలు మొదలుపెట్టారు.

# పర్యవేక్షణలో నిర్లక్ష్యం.. పిల్లల్లో పోషణ లోపం



అనంతపురం: ఐదేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉందంటూ.. వెనుకబడిన ప్రాజెక్టుల సీడీపీఓలతో ఈ ఏడాది జనవరిలో రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ స్వయంగా సమీక్షించారు. ఆరు మాసాల్లో పురోగతి రెట్టింపు స్థాయిలో ఉండాలని నిర్దేశించారు. తగ్గకపోగా.. రెట్టింపు స్థాయిలో పోషణ లోపం పెరిగింది. పోషణ లోపం 2 శాతం కంటే ఎక్కువ కలిగిన ప్రాజెక్టులు రాష్ట్రంలో 27 ఉండగా.. ఉమ్మడి జిల్లాలో ఆరు ఉన్నాయి. అనంత జిల్లాలో కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుత్తి, కణేకల్లు, శింగనమల, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర ఉన్నాయి. ఆరు మాసాల క్రితం జరిగిన సమీక్షలో ఇవే ప్రాజెక్టులు ఉండటం గమనార్హం.
ఉమ్మడి అనంత జిల్లాలో వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని (పోషణ లోపం) పిల్లల శాతం పెరుగుతోంది. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం చిన్నారుల పాలిట శాపంలా మారింది. లబ్ధిదారుల కోసం ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపిస్తోంది. దీంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో చాలా మంది సీడీపీఓ, పర్యవేక్షకులు కేంద్రాల పరిశీలనను చేపట్టడం లేదు. వయసుకు తగ్గ బరువు, ఎత్తు పెరగని పిల్లలు కనీసం 2 శాతానికి మించడానికి వీలులేదు. ఇంతకంటే ఎక్కువ శాతం కలిగిన ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో ఉండటం గమనార్హం.

**జిల్లా సగటు కంటే ఎక్కువ**
అనంత జిల్లాలో 11 ప్రాజెక్టుల సగటు శాతం 19 ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 18 శాతం నమోదైంది. ప్రాజెక్టుల స్థాయిలో మాత్రం జిల్లా సగటు కంటే రెట్టింపు స్థాయిలో నమోదు అవుతున్నాయి. ప్రతి నెలా రెండేళ్లలోపు పిల్లలకు సంబంధించి బరువు, ఎత్తు కొలతలు నమోదు చేయాలి. 2-5ఏళ్ల చిన్నారులకు ప్రతి మూడు మాసాలకోసారి ఎత్తు కొలుస్తారు. దయనీయం ఏమంటే.. ఆగస్టులో 73 శాతం పిల్లల బరువు, ఎత్తు కొలతలు తీసినట్లు నమోదైంది. దీన్నిబట్టి ఎంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో తేటతెల్లమవుతోంది.

**కళ్యాణదుర్గం.. అత్యంత అధ్వానం**
ఆరు అధ్వాన ప్రాజెక్టులకుగాను కళ్యాణదుర్గం పరిధిలో పోషణ లోపం మరీ దారుణంగా ఉంది. రాష్ట్రంలో 27 ప్రాజెక్టుల్లో కళ్యాణదుర్గం రెండో స్థానంలో ఉండటం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో 9.35 శాతం మందిలో పోషణ లోపం ఉంటే.. ఆగస్టు నాటికి ఏకంగా 17.51 శాతానికి పెరిగింది.
ఉరవకొండ ప్రాజెక్టులో 24.16 శాతం పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు లేరు. ఆరు మాసాల్లో ఈ ప్రాజెక్టులో 7.48 శాతం.. శింగనమలలో 7.92 శాతం పెరగడం విశేషం.
గుత్తి ప్రాజెక్టు పరిధిలో 13.97 నుంచి ఏకంగా 20.30 శాతం.. కణేకల్లు ప్రాజెక్టులో 8.8 శాతం నుంచి 14.30 శాతానికి పోషణ లోపం పిల్లల్లో పెరిగింది.
శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రాజెక్టులో 15.69 శాతం నుంచి 20.01 శాతానికి చేరుకోవడం గమనార్హం.

# మల్బరీ రైతులకు మరింత ఊతం



అనంతపురం : వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పట్టు పరిశ్రమకు కూటమి ప్రభుత్వం జవసత్వాలు అందిస్తోంది. అప్పట్లో ఒక్క ఎకరానికి రాయితీ ప్రకటించలేదు. రైతుల్లో నిరాశ ఏర్పడి మల్బరీ సాగు తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2025-26 సంవత్సరానికి మల్బరీసాగు లక్ష్యంతోపాటు పట్టు పురుగులు, పట్టుగూళ్ల ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. తాజాగా పలు పథకాలకు రాయితీలు ప్రకటించడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది.
జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 650 ఎకరాల్లో కొత్తగా మల్బరీ సాగుకు లక్ష్యంగా నిర్దేశించారు. 13.25 లక్షల పట్టుపురుగులు (బైవోల్టింగ్ (బ్రషింగ్) పెంపకంతోపాటు 994 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 650 ఎకరాలకు మల్బరీ సాగు ఎకరాకు లక్ష్యంగా పెట్టుకున్నారు. యూనిట్ (ఎకరా) ధర రూ.30 వేలు కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27 వేలు, ఇతర రైతులకు రూ.22,500 చొప్పున రాయితీలు ఇస్తారు.
పట్టుపురుగుల పెంపకం కోసం జిల్లాకు షెడ్లు-1 50, షెడ్డు-2 50 చొప్పున షెడ్లు మంజూరయ్యాయి. షెడ్డు-1 నిర్మాణానికి యూనిట్ ధర రూ.4.50 లక్షలు కాగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.05 లక్షలు, ఇతర రైతులకు రూ.3,37,500 చొప్పున రాయితీలు ఇస్తారు. షెడ్డు-2 నిర్మాణానికి ఒక్కో షెడ్డు రూ.3.25 లక్షలు కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2,92,500, ఇతర రైతులకు రూ.2,43,750 రాయితీ అందుతుంది.
పట్టుపురుగులు పెంపకానికి స్టాండ్లు 50 మంజూరయ్యాయి. ఒక్కోస్టాండ్ రూ.45,500 కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 40,950, ఇతర రైతులకు 34,125 చొప్పున రాయితీలు ఇస్తారు.
మల్బరీ సాగు చేసే రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు 35 యూనిట్లు మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 చొప్పున ఇతర రైతులకు 25 యూనిట్లు మంజూరు చేశారు. వీటి యూనిట్ ధర రూ.లక్ష కాగా అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.90 వేలు, ఇతర రైతులకు రూ.50 వేలు చొప్పున రాయితీ అందుతుంది.
**సద్వినియోగం చేసుకోండి-** విజయ్‌కుమార్, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి (అనంతపురం) మల్బరీ సాగు చేస్తున్న రైతులకు రాయితీలన్నీ వర్తిస్తాయి. అదనపు సమాచారం కోసం రైతు సేవాకేంద్రాల్లో గ్రామ పట్టు పరిశ్రమశాఖ సహాయ సహాయకులు అందుబాటులో ఉంటారు. రాయితీలకు పథకాల కోసం ఆర్ఎస్‌కేల్లో ధరఖాస్తు చేసుకోవచ్చు.

# చెత్తలో మన్ను దొంగలు

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వం వదిలేసిన చెత్త గుట్టలు 'ఖాళీ' చేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. వందల టన్నుల మేర పోగైన చెత్తను శుద్ధి చేసే పనులు ప్రజారోగ్య విభాగానికి అప్పగించారు. అక్టోబరు 2వ తేదీ నాటికి కంపోస్టు యార్డులన్నీ ఖాళీ మైదానాలుగా మార్చి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. చెత్త గుట్టలు ఖాళీ చేయకపోగా అక్కడ లభించే మట్టిని విక్రయించి రూ.లక్షలు వెనకేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజుల కిందట నంద్యాల పురపాలిక కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై వాడీవేడి చర్చ జరిగింది.

**రూ.17.23 కోట్లకు ఒప్పందం**
ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలిక సంఘాలున్నాయి. నిత్యం సుమారు 500-600 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఎన్జీటీ బృందాలు కంపోస్టు యార్డులను తనిఖీ చేసి వేల టన్నులు పోగైన చెత్తను చూసి చీవాట్లు పెడితే తప్ప గత ప్రభుత్వంలో కదలిక రాలేదు.
చెత్త తరలింపు దృష్టి సారించిన 'కూటమి' ప్రభుత్వం మహారాష్ట్రకు చెందిన ఓ కంపెనీకి బాధ్యత అప్పగించారు. సదరు కంపెనీ రూ.17.23 కోట్ల( (మెట్రిక్ టన్ను చెత్త శుద్ధికి రూ.840) ఒప్పందం



కుదుర్చుకొంది.

**మట్టిని అమ్మేశారు**
చెత్తను బయో మైనింగ్ చేసిన తర్వాత వచ్చే మట్టిని పొలాలకు ఎరువుగా, మండే స్వభావం ఉన్న చెత్తను పరిశ్రమలకు, శుద్ధి కాని వాటిని గుంతలు తీసి పూడ్చాలి.
నంద్యాల కంపోస్టు యార్డులో 25 వేల టన్నుల మట్టి వచ్చింది. దీన్ని రైతులు, వైఎస్సార్‌నగర్‌లో ఒక ఆలయ ప్రాంగణానికి తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా కొందరు అధికారులు, సిబ్బంది కలిసి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆదోనిలో 5 వేలు, డోన్‌లో 5 వేల మెట్రిక్ టన్నుల మట్టి అక్రమంగా తరలించారు.

**కొరవడిన పర్యవేక్షణ**
ఒక్క రోజే గడువున్నా.. ఒక్క డంప్ యార్డులోనూ తొలగింపు ప్రక్రియ పూర్తి కాలేదు. నంద్యాలలో 5 వేల మెట్రిక్ టన్నులు, ఆదోనిలో 30 వేలు, ఎమ్మిగనూరులో 45 వేలు, ఆళ్లగడ్డలో 5 వేలు, డోన్‌లో 7,500 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుభ్రం చేయాల్సి ఉంది. బయో మైనింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఎక్కడా ఏర్పాటు చేయలేదు.

# ఇంట్లో కుండీ.. కంచంలో శాకాహారం

డోన్ : కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి... ప్రతి మనిషి నిత్యం సగటున 300 గ్రాముల (విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు, పిండి పదార్థాలున్నవి) కూరగాయలు, 92 గ్రాముల పండ్లు తీసుకోవాలని ఉద్యానశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.5 లక్షల కుటుంబాలున్నాయి. ఉమ్మడి జిల్లాకు నిత్యం వెయ్యి టన్నులు అవసరం కాగా.. 360 టన్నులే ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆకుకూరల సాగు మరీ అధ్వానంగా ఉంది.. కేవలం 44 హెక్టార్లలోనే సాగవుతోంది. ఉత్పత్తి త్వరగా పెంచాలన్న ఉద్దేశంతో విపరీతంగా మందులు పిచికారీ చేసి విషతుల్యం చేస్తున్నారు. వాటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలొస్తున్నాయి. ఇంట్లోనే సహజ సిద్ధంగా కూరగాయలు పండించుకోవచ్చు.

**మిద్దెపైనే అన్నీ పండిస్తున్నాం**
" నిత్యం ఉదయం ఓ గంట, సాయంత్రం మరో గంట మిద్దె తోటలో గడుపుతాం. వంకాయ, మిరప, టమాట ఇలా విభిన్న రకాల కూరగాయలు, నిమ్మ మొక్కలు, వాటర్‌యాపిల్, రేగిచెట్టు, స్టార్‌పండు, డ్రాగన్ వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నాం.. పసుపును సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నట్లు" మిద్దె తోటల సాగులో ఏరువాక ఫౌండేషన్ నిర్వహించే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన డోన్ పట్టణానికి చెందిన వాణిరెడ్డి తెలిపారు.

**తినాల్సినంత తినడం లేదు**
ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం 7,340 మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గత నెలలో అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించిన సర్వేలో తేలింది. నిత్యం తీసుకోవాల్సిన ఆహారంపై వివరాలు సేకరించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.
**ఆరోగ్యం.. ఆదాయం** ఒక కుటుంబం (నలుగురు సభ్యులు) కూర



చేసుకోవడానికి నిత్యం రూ.100-రూ.150 వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఇంట్లోనే కూరగాయలు పండిస్తే ఆ డబ్బులు మిగిలిపోతాయి. రోజుకు రూ.100 లెక్కన ఏడాదికి రూ.36,000 మిగులుతాయి. నెలనెలా రూ.100 మ్యూచువల్ ఫండ్ ఇతర సంస్థల్లో పొదుపు చేస్తే.. ఏడాదికి 10% లెక్కకు రూ.37,696, 12% లెక్కకు రూ.38,047 అవుతాయని ఆర్థిక నిపుణుల అంచనా. డబ్బులు మిగలడమే కాదండోయ్ తోటలో ఒక గంట పని చేస్తే 300 కేలరీలు ఖర్చు చేసి ఆరోగ్యానికి బాటలేసు కోవచ్చు.

**రూ.10 వెచ్చిస్తే.. రూ.50 విలువైన కూరలు**
మిద్దెపై సెంటు స్థలమున్నా కుండీలు, ట్రేలు, టబ్‌లు వంటి వాటిలో పెంచుకోవచ్చు. గాలి ధారాళంగా, ఎండ తగిలే ప్రదేశాల్లో వీటిని పెట్టాలి. వెడల్పుగా ఉండే కుండీలను ఎంచుకోవాలి. వీటిలో నీరు నిలవని.. వదులైన, సారవంతమైన మట్టిని నింపి విత్తనాలు నాటుకోవాలి. రోజుకు ఐదారుగంటలైనా సూర్యకాంతి అందేలా చేసుకోవాలి. అప్పుడే నాణ్యంగా ఉంటాయంటున్నారు ఉద్యానశాఖాధికారి రాజాకృష్ణారెడ్డి.
ఒక్కో రకం విత్తనాలు ఒక ప్యాకెట్ రూ.10 మాత్రమే. రూ.50-100 ఖర్చు చేసి పది రకాల విత్తనాలను కొనుగోలు చేయాలి. ఆకుకూరలైతే విత్తిన 30-40 రోజుల్లో కోతకొస్తాయి.. అవసరమైనంత కత్తిరించుకుంటే మళ్లీ చిగురిస్తాయి. ఎప్పుడూ తాజాగానే వాడుకోవచ్చు.

## నార్త్ - సౌత్ మధ్య తేడా ఇదే..

ప్రముఖ నటి ప్రియమణి తెలుగు, తమిళ్ చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ అందుకుంది. ఇకపోతే ఈ మధ్యకాలంలో ఎక్కువగా నార్త్ ఇండస్ట్రీని ప్రియమణి టార్గెట్ చేస్తోందేమో అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. నిజానికి ఇప్పటికే ఎన్నో ఇంటర్వ్యూలలో పాల్గొన్న ప్రియమణి అప్పుడప్పుడు నార్త్ ఇండస్ట్రీని ఉద్దేశిస్తూ చేసే కామెంట్లు అలాగే అనిపిస్తున్నాయని సదరు నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. అలాంటి ఈమె ఇప్పుడు మరొకసారి నార్త్ ఇండస్ట్రీపై అలాగే నార్త్ సెలెబ్రిటీలపై చేసిన కామెంట్లు వైరల్ గా మారుతున్నాయి. మరి ఈసారి దేనిని ఉద్దేశించిందో కామెంట్స్ చేసిందో ఇప్పుడు చూద్దాం. విషయంలోకి వెళ్తే.. గత కొన్ని నెలలుగా సినీ ఇండస్ట్రీలో పారితోషకం విషయంలోనే కాదు పని గంటల విషయంలో కూడా వ్యత్యాసం చూపిస్తున్నారు అంటూ తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు నటి ప్రియమణి కూడా ఇదే విషయంపై మాట్లాడింది. ముఖ్యంగా సౌత్ కి నార్త్ కి తేడా అదే అంటూ కామెంట్లు చేసిన ఈమె.. అసలు ఇలా ఎందుకు అంది అనే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చింది. ప్రియమణి మాట్లాడుతూ..” ఏ రోజు కూడా నేను డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎక్కడైనా సరే



మన స్టార్డంను బట్టి పారితోషకం ఇస్తారు. అందుకే దానిని దృష్టిలో పెట్టుకొని నేను కూడా దర్శక నిర్మాతలను పారితోషకం అడుగుతాను. ఒక్కొక్కసారి నాతోపాటు నటించిన వారి కంటే కూడా నేను తక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్న రోజులు ఉన్నాయి. అందుకు నేనేమి బాధపడడం లేదు. ఒకవేళ నేను చేసే పాత్రను బట్టి, నిడివిని బట్టి అవసరం అనిపిస్తే నేనే డిమాండ్ చేస్తాను. అనవసరంగా రెమ్యూనరేషన్ పెంచమని ఇప్పటివరకు ఎవరిని బలవంత పెట్టలేదు” అంటూ రెమ్యూనరేషన్ పై స్పందించింది. అలాగే పని గంటల పై మాట్లాడుతూ..”రెండు ప్రాంతాలలో చిత్రీకరణ టైమింగ్ చాలా భిన్నంగా ఉంటుంది. సౌత్ ఇండస్ట్రీలో ఉదయం 8 గంటలకే షూటింగ్ మొదలుపెడతాము అని షెడ్యూల్ ఇస్తే.. ఖచ్చితంగా ఆ సమయానికి షూటింగ్ ప్రారంభిస్తారు. అయితే నార్త్ లో ఇలా ఉండదు. ఎనిమిది గంటలకు షూటింగ్ అంటే ఆ సమయానికి నటీనటులు తమ ఇంటి నుంచి బయలుదేరుతారు. ఇదే నార్త్ కీ సౌత్ కి తేడా” అంటూ ప్రియమణి తెలిపింది. ఇక ప్రియమణి చేసిన కామెంట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ గా మారుతున్నాయి. ప్రియమణి కెరియర్ విషయానికి వస్తే.. రావణ్ అనే హిందీ చిత్రం ద్వారా నటన రంగ ప్రవేశం చేసిన ఈమె.. తెలుగులో ఎవరే అతగాడు అనే సినిమాతో పరిచయమైంది. ఈ సినిమా పెద్దగా సక్సెస్ కాలేదు. దాంతో తమిళ్ కి వెళ్ళిపోయి అక్కడే పలు చిత్రాలు చేస్తూ ప్రేక్షకులను అలరించింది. తర్వాత మళ్లీ తెలుగులో పెళ్లయిన కొత్తలో అనే సినిమా చేసి ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది ప్రియమణి. అప్పటినుంచి వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రియమణి ఒకవైపు సినిమాలు మరొకవైపు పలు షోలకు జడ్జిగా వ్యవహరిస్తూ ఆకట్టుకుంటుంది. ప్రియమణి అప్కమింగ్ సినిమాల విషయానికొస్తే.. విజయ్ జన నాయగక్ చిత్రంతో పాటు ది ఫ్యామిలీ మెన్ సీజన్ 3 లో కూడా నటిస్తోంది.

## ఆ బ్యూటీ ఇండస్ట్రీ జర్నీ అలా!

అలయా.ఎఫ్ బాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. పదేళ్ల క్రితం కెరీర్ ప్రారంభమైనా అమ్మడు నిలదొక్కుకోవడానికి ఐదేళు సమయం పట్టింది. ఐదేళ్లగా నటిగా బిజీ అయింది. జవానీ జనేమాన్, ఫ్రెడీ, అల్మోస్ట్ ప్యార్ విత్ ద మెహబాత్ చిత్రాల్లో నటించింది. అటుపై బడేమియాన్ చోటే మియాన్, శ్రీకాంత్ లాంటి చిత్రాలతో మరింత పాపులర్ అయింది. ప్రస్తుతం అమ్మడికి అవకాశాలు బాగానే వస్తున్నాయి. ఎలాంటి ఛాన్సులొచ్చినా నో చెప్పకుండా కమిట్ అవుతుంది. మరి ఈ బ్యూటీ సినిమాల్లోకి రావడానికి అసలు కారణం ఏంటి? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం తెలిసింది. తొలుత అలయాకి సినిమాలంటే పెద్దగా ఆసక్తి ఉండేది కాదంది. ఆ సమయంలో అమ్మడు క్రిష్ చిత్రం థియేటర్లో చూసానంది. ఆ సినిమా బాలీవుడ్ పై ఆశలు కలిగించినట్లు పేర్కొంది. ఆ చిత్రాన్ని తన బాల్యాన్ని గుర్తించే చిత్రంగా భావిస్తానంది. తనకు ఇష్టమైన నటులు ఆ సినిమాలో నటించడమే తనకు ప్రేరణ కలిగించిందంది. క్రిష్ రిలీజ్ అనంతరం హృతిక్ రోషన్, ప్రియాంక చోప్రాలకు అభిమానులుగా మారినట్లు తెలిపింది.



అప్పుడే అలయా పరిశ్రమను ఇష్టపడటం మొదలు పెట్టినట్లు తెలిపింది. క్రిష్ సినిమా కంటే ముందు తన స్నేహితులు చాలా మంది బాలీవుడ్ కి ఫిదా అయ్యేవారు కానీ తాను మాత్రం సినిమాల పట్ల పెద్దగా ఆసక్తిగా ఉండేదాన్ని కాదంది. క్రిష్ తనలో సినిమాల్లోకి రావాలనే ఆశ పుట్టించడంతో మ్యాకప్ వేసుకున్నట్టు తెలిపింది. అలయా .ఎఫ్ ఇండస్ట్రీ బిడ్డ అన్న సంగతి తెలిసిందే. నటి పూజాబేడి కుమార్తె. పూజాబేడి బాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ కాదు గానీ కొన్ని టీవీ షోలను హోస్ట్ చేసి ఫేమస్ అయ్యారు.

ఇలా కుటుంబంలో నటనా రంగం నుంచి ఉంటే పిల్లలు కూడా అదే వృత్తిని ఎంచుకోవడం సహజం . కానీ అలయా మాత్రం అనుకోకుండా సినిమాల్లోకి వచ్చింది. తల్లి ప్రభావం తనపై ఎంత మాత్రం లేదని అలయా మాటల్ని బట్టి తెలుస్తోంది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేని నటిగానే బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు తాను అభిమానించిన హృతిక్ రోషన్ తోనే కలిసి ఓ ప్రాజెక్ట్ కి పని చేస్తోంది. హృతిక్ నటిస్తోన్న ఓ వెబ్ సిరీస్ లో జోడీగా నటిస్తోంది.




## అల్లరి నరేష్ 'రైల్వే కాలనీ'.. సరైన డేట్ ఫిక్స్ చేశారుగా!




టాలీవుడ్ హీరో అల్లరి నరేష్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. కామెడీ చిత్రాలతో ఓ రేంజ్ లో క్రేజ్ సంపాదించుకున్న ఆయన.. ఇప్పుడు రూట్ మార్చి విభిన్నమైన చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పుడు వినూత్న థ్రిల్లర్ మూవీ 12%ూ% రైల్వే కాలనీలో లీడ్ రోల్ లో నటిస్తున్నారు. హారర్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఆ సినిమాకు పొలిమేర, పొలిమేర 2 చిత్రాలతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్న డా. అనిల్ విశ్వనాథ్ షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు. కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను కూడా చూసుకుంటున్నారు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి చిత్రాన్ని నిర్మిస్తుండగా.. పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. పొలిమేర, పొలిమేర -2 చిత్రాలలో మెప్పించిన కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. అనిల్ విశ్వనాథ్ ఆమెతో వరుసగా చేస్తున్న మూడో చిత్రం ఇది కావడం విశేషం. అయితే 12%ూ% రైల్వే కాలనీ మూవీ షూటింగ్ ఇప్పటికే పూర్తి కాగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మేకర్స్ తాజాగా బిగ్ అప్డేట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. నవంబర్ 21వ తేదీన విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆ సమయంలో స్పెషల్ వీడియోతో పాటు పోస్టర్ ను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. విడుదల తేదీ పోస్టర్ లో అల్లరి నరేష్ ఐకానిక్ పోజులో కనిపించారు. ఆయన చుట్టూ డ్యాన్సర్లు ఉత్సాహంగా ఉన్నారు. అదే సమయంలో మేకర్స్ విడుదల చేసిన ప్రత్యేక వీడియో కూడా ఇంట్రెస్టింగ్ గా ఉంది. మంచు కొండల్లో అల్లరి నరేష్ స్పెషల్ బైక్ పై వస్తారు. ఏం బండి అని అడగ్గా.. ఫారిన్ బండి అని చెబుతారు.

ఆ తర్వాత రిలీజ్ డేట్ ను రివీల్ చేస్తారు. అయితే మేకర్స్ సరైన రిలీజ్ డేట్ ను సెలెక్ట్ చేసుకున్నారని చెప్పాలి. ఎందుకంటే ఆ వారంలో పెద్ద సినిమాలు ఏవీ విడుదల కావడం లేదు. దీంత్ మూవీకి మంచి అడ్వాంటేజ్ లభించనుంది. సింగిల్ గా విడుదల అవ్వనుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టైటిల్ టీజర్.. వెన్నులో వణుకు పుట్టించే కథనంతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. మరి మూవీ ఎలాంటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి

## వెంకటేష్ ని అలా చూడగలరా.. గురూజీ ప్లాన్ ఏంటి..?



విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం తర్వాత త్రివిక్రమ్ తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబో మూవీని హారిక హాసిని బ్యానర్ తో పాటు ఫార్చ్యున్ ఫోర్ మూవీస్ కలిసి నిర్మిస్తున్నారు.

రైటర్ గా ఉన్నప్పుడు వెంకటేష్ కి సూపర్ హిట్ సినిమాలు అందించిన త్రివిక్రమ్ ఇప్పుడు డైరెక్టర్ గా మరో సూపర్ హిట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. గుంటూరు కారం తర్వాత త్రివిక్రం కాస్త గ్యాప్ తీసుకుని వెంకటేష్ తో సినిమా చేస్తున్నారు.

**విక్టరీ వెంకటేష్ సెక్యూరిటీ గార్డ్ గా..** ఈ సినిమా కూడా ఒక మంచి ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్టైనర్ గా ఉంటుందట. ఫ్యామిలీ మొత్తం చూసే సినిమాగా ఇది తెరకెక్కిస్తున్నారు. ఐతే ఈ సినిమాలో వెంకటేష్ రోల్ గురించి ఒక లీక్ బయటకు వచ్చింది. సినిమాలో విక్టరీ వెంకటేష్ సెక్యూరిటీ గార్డ్ గా కనిపిస్తారట. వెంకటేష్ ఏంటి సెక్యూరిటీ గార్డ్ ఏంటి అనుకోవచ్చు. గురూజీ కథ కోసం హీరోల పాత్రలను టాక్సీ డ్రైవర్ లుగా చేస్తాడు.. అవసరమైతే సెక్యూరిటీ గార్డ్ గా కూడా చేస్తాడు. వెంకటేష్ 76 సినిమాల కెరీర్ లో ఇదివరకు ఎప్పుడు ఇలా సెక్యూరిటీ రోల్ చేసింది లేదు.

బాడీ గార్డ్ గా చేసిన సందర్భాలు ఉన్నాయి కానీ సెక్యూరిటీ గార్డ్ గా మాత్రం చేయలేదు. ఐతే సినిమాలో ఆయన చేసే పాత్ర దాని చుట్టూ కథ చాలా బలంగా ఉంటాయని తెలుస్తుంది. అంతేకాదు వెంకటేష్ టైమింగ్ కు తగినట్టుగా త్రివిక్రమ్ మాటలు అదరగొట్టేస్తాయని తెలుస్తుంది. వెంకటేష్, త్రివిక్రమ్ ఈ కాంబో సినిమాపై ఆడియన్స్ పెట్టుకున్న అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ఉంటుందట.

**మన శంకర వరప్రసాద్ సినిమాలో వెంకటేష్ క్యామియో..** ఈ సినిమాలో వెంకటేష్ కి జతగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా లాక్ అయ్యింది. ఈమధ్యనే తెలుసు కదా సినిమాతో మెప్పించిన శ్రీనిధి నెక్ట్ వెంకటేష్ తో ఛాన్స్ అందుకుంది. త్రివిక్రమ్ సినిమాలో ఛాన్స్ అది కూడా వెంకటేష్ లాంటి స్టార్ తో స్క్రీన్ షేరింగ్ కాబట్టి శ్రీనిధికి ఈ సినిమా కలిసి వచ్చే అవకాశం ఉంది. వెంకటేష్ కూడా గురూజీ మీద పూర్తి నమ్మకం ఉంచేశాడని తెలుస్తుంది. ఈ సినిమాను నెక్ట్ సమ్మర్ కి రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారట. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకటేష్ మరోసారి అదే రేంజ్ సక్సెస్ ఈసారి త్రివిక్రమ్ డైరెక్షన్ సినిమాతో కొట్టాలని చూస్తున్నారు.

మరి సినిమా ఎంతమేరకు ఈ కాంబో పై ఉన్న అంచనాలను అందుకుంటుందో చూడాలి. ఈ సినిమాతో పాటుగా వెంకటేష్ సంక్రాంతికి రిలీజ్ కాబోతున్న మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమాలో క్యామియో రోల్ చేస్తున్నాడని తెలిసిందే. చిరంజీవి, వెంకటేష్ ఈ కాంబో స్క్రీన్ మీద అదరగొట్టేయడం ఖాయమని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు.

## క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటున్న రష్మిక!


రష్మిక మందన్న.. నేషనల్ క్రష్ గా గుర్తింపు తెచ్చుకున్న ఈమె ఇటీవల ది గర్ల్ ఫ్రెండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో నిర్మాత చేత రష్మిక కాదు పాన్ ఇండియా క్రష్మిక అని పిలిపించుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. తన అందం తోనే కాదు అద్భుతమైన పర్ఫామెన్స్ తో కూడా అందరిని మెప్పించింది రష్మిక. పాత్ర ఏదైనా సరే డీ గ్లామరస్ పాత్ర మొదలుకొని మహారాణి పాత్ర వరకు ఇలా ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి నటించడంలో ఈమె తర్వాతే ఎవరైనా.. అలా తన అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకుంటున్న ఈమె .. ఇటు సోషల్ మీడియాలో కూడా అలరిస్తూ అభిమానులకు చేరువవుతోంది. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేసింది రష్మిక. అందులో థామా మూవీకి సంబంధించిన బ్లాక్ కలర్ అవుట్ ఫిట్ ధరించి కళ్ళకు మస్కారా వేసుకుంటున్నట్లు సెల్ఫీ ఫోటోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. మరొక ఫోటోలో ది గర్ల్ ఫ్రెండ్ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా చుడిదార్ లో దర్శనమిచ్చి కళ్లద్దాలు పెట్టుకొని మరీ కనిపించింది ఇంకొక ఫోటోలో కొంటెగా ఫోటోలకు ఫోజులిచ్చింది. ఇలా వరుసగా ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



రష్మిక అందానికి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. రష్మిక విషయానికి వస్తే.. ఛలో సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె ఆ తర్వాత పలు చిత్రాలలో నటించి భారీ పాపులర్ కి సొంతం చేసుకుంది..అతి తక్కువ సమయంలోనే సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా సరిలేరు నీకెవ్వరు సినిమాలో అవకాశానందుకొని భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈమె ఆచితూచి అడుగులు వేస్తూ పలు సక్సెస్ లను అందుకుంటోంది. ఇక గత మూడు నాలుగు సంవత్సరాలుగా పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, కుబేర, థామా అంటూ వరుస సినిమాలతో భారీ బ్లాక్ బస్టర్ విజయాలను తన ఖాతాలో వేసుకుంది ఈ ముద్దుగుమ్మ మధ్యలో సల్మాన్ ఖాన్ తో సికందర్ అనే సినిమా చేసింది కానీ ఈ సినిమా డిజాస్టర్ అయినా.. దీని ప్రభావం పెద్దగా రష్మిక కెరియర్ పై పడలేదు అని చెప్పవచ్చు. ఇప్పుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేసింది. నవంబర్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేయగా.. అందులో రష్మిక నటనకు అభిమానులు ఫిదా అవుతున్నారు. అటు సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. దీక్షిత్ శెట్టి హీరోగా, రావు రమేష్ కీలక పాత్ర పోషించారు. ఇక భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.మొత్తానికైతే రష్మికకు మహర్దశ పట్టింది అని చెప్పడంలో సందేహం లేదు.

## ప్రభాస్ లైనప్ లో 'ఆ ఐదు' సీక్వెల్స్.. మరి స్పిరిట్ సంగతేంటి?

తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఆ బాహుబలి సినిమాతో ఫ్రాంచైజీ ట్రెండ్ ను స్టార్ట్ చేసిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇప్పుడు అందుకు ఆయన కేరాఫ్ అడ్రస్ గా నిలిచేలా కనిపిస్తున్నారు. బాహుబలితో ఫ్రాంచైజీ ట్రెండ్ తెలుగులో మొదలవ్వగా.. అందులో రెండు సినిమాలు చేశారు ప్రభాస్. మూడు భాగం కూడా చేసేలా ఉన్నారు. అయితే సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రభాస్ స్టార్ట్ చేసిన ఫ్రాంచైజీ ట్రెండ్ ను అనేక మంది స్టార్ హీరోలు ఫాలో అయ్యారు. ఇప్పటికీ దాన్ని ఫాలో అవుతున్నారు కూడా.. అనుకున్న సినిమాను పలు భాగాలుగా రిలీజ్ చేయడం.. పాన్ ఇండియా రేంజ్ లో సందడి చేయడం.. సూపర్ హిట్స్ అందుకోవడం కొంతకాలంగా జరుగుతోంది. అదే సమయంలో ప్రభాస్ మాత్రం బాహుబలి నుంచి ఫ్రాంచైజీ సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. బాహుబలి రెండు చిత్రాల తర్వాత నార్మల్ మూవీస్ సాహో, రాధేశ్యామ్, ఆదిపురుష్ చేసిన ప్రభాస్.. అనంతరం మళ్లీ సలార్ ఫ్రాంచైజీలో అడుగుపెట్టారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఆ సినిమా.. సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్ గా వచ్చింది. ఆ మూవీ సీక్వెల్ శౌర్యాంగ్ పర్వం షూటింగ్ మరికొద్ది రోజుల్లో మొదలవనుంది. సలార్ తర్వాత నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీలో నటించారు



డార్లింగ్. ఆ మూవీ సీక్వెల్ కూడా ప్రభాస్ లైనప్ లో ఉంది. ఇప్పుడు ది రాజా సాబ్ లో ప్రభాస్ యాక్ట్ చేస్తుండగా.. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. అయితే ఆ సినిమాకు కూడా సీక్వెల్ ఉన్నట్లు తెలుస్తోంది. మూవీ లాస్ట్ లో సీక్వెల్ కు లీడ్ ఇచ్చి ఫ్రాంచైజీని డైరెక్టర్ మారుతి కంటిన్యూ చేస్తారట. అదే సమయంలో ఇప్పుడు ప్రభాస్ ఫౌజీలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమాకు కూడా సీక్వెల్ ఉందని రీసెంట్ గా డైరెక్టర్ హను రాఘవపూడి ఓ ఇంటర్వ్యూలో పరోక్షంగా తెలిపారు. దీంతో మొత్తానికి ప్రభాస్ లైనప్ లో నాలుగు సినిమాల సీక్వెల్స్ ఉన్నాయనే చెప్పాలి. సలార్, కల్కి, రాజా సాబ్, ఫౌజీ ఫ్రాంచైజీల్లో డార్లింగ్ మరోసారి కనిపించనున్నారు. యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో ప్రభాస్ ఓ సినిమా చేస్తారని కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తుండగా.. అది కూడా ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ అని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే డార్లింగ్ లైనప్ లో ఉన్న మరో మూవీ స్పిరిట్ సంగతేంటన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మాస్ యాక్షన్ పోలీస్ డ్రామాగా సినిమా రూపొందనుంది. ఆ మూవీకి సీక్వెల్ లేదా ప్రీక్వెల్ లేదా ఫ్రాంచైజీ ఉన్నట్లు ఇప్పటి వరకు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఎక్కడా మాట్లాడలేదు. దీంతో ఎలాంటి రూమర్స్ గానీ వార్తలు గానీ రావడం లేదు. మరి స్పిరిట్ విషయంలో సందీప్ వంగా ఏం చేస్తారో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536